# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

గురువారం 15 జనవరి 2025 / సంపుటి: 24 సంచిక: 11 పేజీలు: 12 వెల: రూ.4.00

TELANGANA & ANDHRA PRADESH




## రైతుభరోసా తదితర పథకాల అమలు

- 21 నుంచి గ్రామ సభల ద్వారా ఎంపిక
- జిల్లా కలెక్టర్లను ఆదేశించిన సి.ఎస్ శాంతికుమారి



హైదరాబాద్,జనవరి15 : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న నాలుగు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను ఈనెల 21వ తేదీ నుండి నిర్వహించే గ్రామ సభలలో ఆమోదం పొందాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్

మిగతా 2లో..

## తెలంగాణకు మద్దతు ఇవ్వండి...

- సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి
- కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ కు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి



హైదరాబాద్,జనవరి15 :సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణను అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 2లో..

# జాదురావుపేటలో గుప్పుమంటున్న గుడుంబా రక్కసి..



- సారాకు బానిసై రోడ్లపైనే పడిపోతున్న వైన్యం
- గుట్టు చప్పుడు కాకుండా అమ్మకాలు
- యువతను కబలిస్తున్న గుడుంబా రక్కసి
- పెద్ద దిక్కును కోల్పోయి వీధిన పడుతున్న కుంటుంబాలు
- నాటు సారా తయారీలో ప్రమాదకరమైన కెమికల్స్..!
- హార్వెస్టర్ యజమానే.. గుడుంబా దందా నిర్వహణ..?
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ అధికారులు..







జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జనవరి 15 తారా జ్యోతి

అనగనగా ఒక ఊరిలో గుడుంబా అనే రక్కసి ఉంది. ఆ రక్కసిని ఓ పిల్లాడు గుడుంబా నువ్వు ఏమి చేస్తావని అడిగాడు. అందుకు ఆ గుడుంబా సమాధానం చెబుతూ... నేను పచ్చని కుటుం బంలో చిచ్చు పెడతానని... నిండు జీవితాన్ని సర్వనాశనం చేస్తానని... కుటుంబ సభ్యుల మధ్య గొడవలు శృష్టిస్తానని... మనిషి ప్రాణాన్ని నిర్దాక్షిణ్యంగా తీస్తానని చెప్పడం మొదలుపెట్టింది. ఎందుకు ఇలా చేస్తున్నావని ఆ పిల్లాడు అడిగితే... అందుకు గుడుంబా రక్కసి నా తప్పేముంది... ప్రభుత్వం నన్ను నిషేదించినప్పటికీ... కొంతమంది అక్రమ దారులు బహిరంగంగా నన్ను విక్రయిస్తున్నారని... దీన్ని నివారించాల్సిన సంబంధిత ఎక్సైజ్ అధికారులు చూసి చూడనట్లుగా జాగ్రత్తగా వ్యవహరి స్తున్నా రంటు... ఆ గుడుంబా రక్కసి వికటట్టా హసం తో సమాధానం ఈ ఇవ్వ డంతో ఆ పిల్లాడు చేసేదేమిలేక అక్కడినుంచి వెళ్ళిపోయాడు. అయితే ఈ కథలో సారాంశం... అక్రమదారుల అవినీతికి, అధికారుల నిర్లక్ష్యానికి ప్రజలు మృత్యు ఒడిలోకి చేరుకుంటు న్నారనేది నిజం. అంతేగాకుండా ఈ రక్కసి చేతిలో ఎన్నో పచ్చని కుటుంబాలు నలిగిపోయాయి... నలిగిపోతున్నాయనేది జగమెరిగిన సత్యం...! పచ్చని పల్లెల్లో ఏరులై పారుతున్న గుడుంబా.. పచ్చని పల్లెలను మద్యం మంటలు దహించివేస్తున్నాయి. నాటు సారా మహమ్మారికి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కష్టాల కల్లోలంలో కి నెట్టేస్తున్నాయి. గ్రామంలో మంచినీరు దొరకని చోట కూడా సారా ఎరులై పారుతున్నది. బడుగు జీవుల ప్రాణాలను నిత్యం వేటాడుతున్నది. పల్లెలు పచ్చగా ఉంటే అందం. అక్కడ స్వచ్ఛమైన జలాలు పారితే. ప్రకృతి పులకరిస్తుంది. పుష్కలంగా పంటల సిరులు కురుస్తాయి. మరి అదే పల్లెల్లో గుడుంబా బట్టీలు వెలిస్తే.. ఆ

మిగతా 2లో..

## సౌదీ అరేబియాలో కిషన్ రెడ్డి పర్యటన

- ఘనంగా స్వాగతంపలికిన ప్రవాస భారతీయులు



హైదరాబాద్,జనవరి15 :సౌదీ అరేబియాలో భారతీయులు అందులో తెలుగు ప్రవాసీయులు కేవలం ఉపాధికి మాత్రమే పరిమితం కాకుండ వాణిజ్య, పరిశ్రమ రంగాలలో కూడా ఎదుగుతుండడం ఎంతో సంతోషం అని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిఅన్నారు. కుటుంబ సమేతంగా న్యూఢిల్లీలో సంక్రాంతి పండుగ జరుపుకోంటున్న తనను.. ప్రధాని నరేంద్ర మోదీ, వాణిజ్య మంత్రి పియూష్ గోయెల్ తో కలిసి తన ఇంటికు వచ్చి పండుగ జరుపుకోన్న తర్వాత భారత-సౌదీ సంబంధాల పటిష్ఠతలో తన సౌదీ పర్యటన ముఖ్యమని చెప్పారని అన్నారు. రియాధ్ లో ప్రవాసీయులు బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పండుగ మధ్యలో తాను సౌదీకి రావాల్సి వచ్చిందన్నారు. అయితే, మిగిలిన సంక్రాంతిని తోటి తెలుగు వారి మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని కిషన్ రెడ్డి అన్నారు. కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సంక్రాంతి మధ్యలో సౌదీ అరేబియా వెళ్లారు. ఖనిజ భవిష్యత్తుపై

మిగతా 2లో..

## తెలుగు రాష్ట్రాలకు కొత్తగా ఆరుగురు జడ్జిలు

- సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు
- తెలంగాణ హైకోర్టు సిజెగా జస్టిస్ట్ సంజయ్ పాల్ నియామకం

న్యూఢిల్లీ,జనవరి15 : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులకు జడ్జిలుగా పలువురి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. తెలంగాణ హైకోర్టుకు నలుగురు, ఏపీ హైకోర్టుకు ఇద్దరి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. తెలంగాణ

మిగతా 2లో..

## నౌకాదళం మరింత బలోపేతం

- అత్యాధునిక అస్త్రాల జోడింపు
- యుద్ధనౌకలను జాతికి అంకితం చేసిన మోడీ




ముంబయి,జనవరి15 : భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో మూడు అస్త్రాలు చేరాయి. అధునాతన యుద్ధ నౌకలు, ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లను బుధవారం నౌకాదళంలో చేర్చుకున్నారు. ముంబయిలోని నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరై.. యుద్ధ నౌకలను జాతికి అంకితం చేశారు. వీటి రాకతో నౌకదళ బలం మరింత పటిష్టం కానుంది. ఆయుధ తయారీ, సముద్ర భద్రతలో అగ్రగామి కావాలని ముందుకుసాగుతున్న భారత్ లక్ష్యసాధనకు ఇది పెద్ద ముందడుగుగా

మిగతా 2లో..

## కెటిఆర్‌కు సుప్రీంలో చుక్కెదురు

- క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన ధర్మాసనం
- మరోమారు నోటీసులు ఇవ్వనున్న ఎసిబి



న్యూఢిల్లీ,జనవరి15 :మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించిన కేసులో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. ఏసీబీ నమోదు చేసిన కేసును క్వాష్ చేయాలని తెలంగాణ హైకోర్టులో కేటీఆర్ ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. ఇందుకు ఉన్నత న్యాయస్థానం

మిగతా 2లో..

## బిఆర్ఎస్ కాదు..బి ఆర్ఎస్ఎస్

- గులాబీ పార్టీపై రేవంత్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,జనవరి15 : బీఆర్ఎస్ కాదని, అది బీఆర్ఎస్ఎస్ అని ముఖ్యమంత్రి రేవంత్

మిగతా 2లో..

## ఎపిలో కాంగ్రెస్ బలోపేతంపై చర్చించా

- ఇందిరాభవన్‌లో వైఎస్ పాదయాత్ర ఫోటోలు
- ఎంతగానో ఆకట్టుకున్నాయని షర్మిల పోస్ట్



న్యూఢిల్లీ,జనవరి15 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పార్టీ బలోపేతంపై రాహుల్, వైఎస్ షర్మిల ఇద్దరూ చర్చించారు. అలాగే ఏపీ తాజా రాజకీయ పరిస్థితులపై చర్చలు జరిపారు. అనంతరం కార్యాలయం ప్రారంభోత్సవంపై ఎక్స్ వేదికగా షర్మిల తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి

మిగతా 2లో..

## అక్రమార్కులకు అరదండాలు తప్పవు

- ఇసుక, లిక్కర్ కుంభకోణాల్లో చాలామంది జైలుకు
- రెడ్‌బుక్ తనపని తాను చేసుకుంటోంది
- చంద్రగిరి ముఖ్య నేతలతో లోకేశ్ సంచలన వ్యాఖ్యలు



తిరుపతి,జనవరి15 : రెడ్‌బుక్ మేరకు అక్రమార్కులపై చర్యలు తప్పవని పండుగ వేళ మంత్రి నారా లోకేష్ హెచ్చరించారు. ఇసుక, లిక్కర్ కుంభకోణాల్లో చాలా మంది త్వరలోనే జైలుకు వెళ్తారని నారా లోకేష్ సంచలన కామెంటగ్స్ చేశారు. ఇందులో ఎలాంటి డౌట్ లేదని ఉద్ఘాటించారు మంత్రి. రెడ్ బుక్‌ను మర్చిపోలేదని, తన పని చేసుకుపోతోందని వ్యాఖ్యానించారు. బుధవారం నాడు చంద్రగిరి ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన మంత్రి లోకేష్.. త్వరలోనే బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మిస్తా మన్నారు. కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు.

మిగతా 2లో..

## రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలపై నేతల చర్చ

- ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌తో నేతల భేటీ
- రాహుల్ పర్యటన, పార్టీ పదవులపైనా చర్చ
- వివరాలు వెల్లడించిన పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



న్యూఢిల్లీ,జనవరి15 : తెలంగాణలో రాహుల్ పర్యటనపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ రాష్ట్ర నేతలతో చర్చించారు. పార్టీ పటిష్టత తదితర అంశాలపైనా చర్చించినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసంలో

మిగతా 2లో..

## రైతుభరోసా తదితర పథకాల అమలు

కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ఈనెల 26 వ తేదీన ప్రారంభించాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు తగు కార్యాచరణపై జిల్లా కలెక్టర్లతో నేడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, ఈ నాలుగు ప్రతిష్టాత్మక పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో ఏవిధమైన అపోహలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఈ పథకాలన్నీ నిజమైన అర్హులకే దక్కేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతు భరోసాకు సంబంధించి భూముల వివరాలను రెవిన్యూ శాఖ ద్వారా వ్యవసాయ శాఖకు పంపడం జరిగిందని, సాగుయోగ్యంకానిభూములను క్షేత్ర స్థాయిలో తనిఖీ నిర్వహించాలని అన్నారు. సంయుక్త సందర్శనలు నిర్వహించి, గ్రామసభల్లో వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలు ప్రదర్శించి, చదివి వినిపించి ఆమోదం పొందాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి, ఉపాధిహామీ పథకంలో కనీసం 20 రోజులు పనిచేసిన భూమి లేని వ్యవసాయ కూలీల కుటుంబాల జాబితాను, గ్రామ సభల్లో ప్రకటించి ఆమోదం పొందాలని సి.ఎస్ తెలిపారు.రేషన్ కార్డుల మంజూరీకై రూపొందించిన లబ్ధిదారుల ముసాయిదా జాబితా గ్రామసభల్లో ఆమోదం పొందాలన్నారు. ఇదేవిధంగా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శక సూత్రాల ఆదేశాలకు అనుగుణంగా లబ్ధిదారుల ముసాయిదా జాబితా ను గ్రామాలలో ప్రదర్శించాలనిఅన్నారు. గ్రామీణ ప్రాంతాలలో, గ్రామపంచాయతీల వారిగా మరియు పట్టణ ప్రాంతాల్లో వార్డుల వారిగా సభలు నిర్వహించాలన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున, లబ్ధిదారుల జాబితా ఎంపిక, డాటా ఎంట్రీ, క్షేత్ర స్థాయి వెరిఫికేషన్ తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జీహెచ్ఎంసీ కమీషనర్ ను ఆదేశించారు. ప్పటివరకు, ఈ నాలుగు పథకాలకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలన, ప్రత్యేక బృందాల ఏర్పాటు, ముసాయిదా జాబితా తయారీ, డేటా ఎంట్రీ ఏర్పాట్లు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు చేసిన ప్రత్యేక శ్రద్ధని సి.ఎస్ అభినందించారు. ఈ నాలుగు పథకాల అమలుకై రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక అనుగుణంగా అమలయ్యేలా సంబంధిత కార్యదర్శులు పర్యవేక్షించాలని సి.ఎస్. శాంతి కుమారి ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో రెవిన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శిడి.ఎస్. చౌహాన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి బుద్ధప్రకాష్, పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, రాష్ట్రంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, జీహెచ్ఎంసి కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు మద్దతు ఇవ్వండి...



చర్యలు తీసుకుంటుందని, కేంద్రం కూడా సహకరించాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి శ్రీధర్ బాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు బుధవారం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ను ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీకి ముందుకొచ్చే పరిశ్రమలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, ఇతర అంశాలను మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలుస్తుందని తెలిపారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. పలు ప్రముఖ సంస్థలు తెలంగాణలో తమ డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొస్తాయని, ఇలాంటి తరుణంలో డేటా భద్రత కీలకంగా మారిందన్నారు. అందుకే 'నేషనల్ డిజాస్టర్ రికవరీ జోన్' ఏర్పాటు చేయడం ఆవశ్యమన్నారు. ఈ అంశంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సెమీ కండక్టర్ మిషన్ పురోగతిపై ఆయన అభినందనలు తెలిపారు. వచ్చే నెల 24న హైదరాబాద్ లో నిర్వహించనున్న బయో ఏషియా సదస్సుకు హాజరు కావాలని కోరారు.

## తెలుగు రాష్ట్రాలకు కొత్తగా ఆరుగురు జడ్జిలు

హైకోర్టుకు వై.రేణుక, నందికొండ నర్సింగరావు, తిరుమల దేవి, మధుసూదన్ రావు; ఏపీ హైకోర్టుకు హరిహరనాథ శర్మ, యడవల్లి లక్ష్మణరావు పేర్లు సిఫార్సు చేసింది. జ్యుడీషియల్ ఆఫీసర్ల కోటాలో ఈ ఆరుగురు పేర్లను కొలీజియం సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది.ఇదిలావుంటే తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్‌పాల్‌ను రాష్ట్రపతి నియమించారు. హైకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుజయ్‌పాల్‌కు సీజేగా బాధ్యతలు అప్పగిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే బాంబే హైకోర్టు సీజేగా బదిలీ అయ్యారు. 1964 జూన్ 21న జన్మించిన జస్టిస్ సుజయ్‌పాల్ బీకాం, ఎంఏ, ఎల్ఎల్‌బీ పూర్తిచేసి 1990లో మధ్యప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. పలు బ్యాంకులు, మానవ హక్కుల కమిషన్, బోర్డులకు సేవలు అందించిన ఆయన 2011 మే 27న మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా... 2014 ఏప్రిల్ 14న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుతో 2024 మార్చి 21న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. తాజాగా ఆయన హైకోర్టు సీజేగా నియమితులయ్యారు.

## సౌదీ అరేబియాలో కిషన్ రెడ్డి పర్యటన

జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొనడానికి వెళ్లారు. ఈ సందర్భంగా సౌదీ అరేబియా లోని తెలుగు ప్రవాసీ సమాజం కిషన్ రెడ్డికి నీరాజనం పలికింది. సౌదీలోని ప్రముఖ తెలుగు ప్రవాసీ సంఘం సాటా సెంట్రల్ ప్రతినిధులు రంజీత్, ముజ్జమ్మిల్, సుచరిత, ఆనందరాజు, పోకూరి ఆనంద్, శివారెడ్డి, సత్తిబాబులతో పాటు తెలుగు కళా క్షేత్రం అధ్యక్షులు రేవల్ అంథోని, విజయ చౌదరి, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌదీ అరేబియా (తాసా) అధ్యక్షుడు స్వర్ణ తిరుపతి స్వామి, ఉర్దూ టోస్ట్ మాస్టార్స్ ప్రతినిధులు మోబీన్, వాసీఫ్ హైదరాబాద్ నగరానికి చెందిన ప్రవాసీ ప్రముఖులు సుల్తాన్ మజ్హరోద్దీన్ తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రవాసీ ప్రముఖులు కూడ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 20 నిమిషాల పాటు ప్రసంగించి మంత్రి వెళ్ళిపోతారని నిర్వాహకులు ప్రకటించినా తెలుగు వారి అప్యాయతతో రెండు గంటల పాటు కిషన్ రెడ్డి అందరితో కలిసి మెలిసి గడిపారు. తొలిసారి తెలుగు రాష్ట్రాలకు చెందిన ఒక కేంద్ర మంత్రి సౌదీకు వచ్చి ఆత్మీయంగా గడపడం అనందం కల్గించిందని అనేక మంది తెలుగు ప్రవాసీయులు ఈ సందర్భంగా పెర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని భారతీయ ఎంబసీ సౌజన్యంతో రియాధ్ లోని హైదరాబాద్ నగరానికి చెందిన వ్యాపారవేత్త మోహమ్మద్ నయీమోద్దీన్ నిర్వహించారు.

## బిఆర్ఎస్ కాదు..బి ఆర్ఎస్ఎస్

రెడ్డి అన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరాభవన్ ప్రారంభోత్సవానంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జాతీయ స్థాయిలో బీజేపీ కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తే.. తెలంగాణలో బీఆర్ఎస్ అదే ఫాలో అవుతోందని విమర్శించారు. ఆ పార్టీ తమకు నేర్పించాల్సిన అవసరం లేదన్నారు. తమ ప్రభుత్వం చట్ట ప్రకారం ముందుకెళుతోందని చెప్పారు. తెలంగాణలో ఎక్కడ శాంతిభద్రతల సమస్య ఎదురైనా అక్కడ పోలీసులు ఉంటారని చెప్పారు. తమకు పక్షపాత ధోరణి లేదని కుండబద్దలు కొట్టారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ పార్టీ ఆఫీసులపైనా దాడులు జరిగాయని అన్నారు. బీజేపీ జూటా మాటలు చెప్పే పార్టీ అని విమర్శించారు. బీజేపీ నేతల వ్యాఖ్యలపై ఫోకస్ పెట్టాల్సిన అవసరం లేదన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ స్వాతంత్ర్య విషయంలో మోహన్ భగవత్ వెంట ఉంటారా..? లేక దేశం కోసం ప్రాణాలు అర్పించిన స్వాతంత్ర్య సమర యోధుల పక్షాన నిలుస్తారా..? అన్నది తేల్చాలని సీఎం డిమాండ్ చేశారు. 140 ఏండ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు సొంత భవనం కల సాకారమైందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏ స్వార్థం లేకుండా దళితులు, గిరిజనులు, మైనార్టీల సంక్షేమం కోసం కాంగ్రెస్ పనిచేస్తోందని అన్నారు. నిన్న గాక మొన్న వచ్చిన ప్రాంతీయ పార్టీలతో పాటు బీజేపీ సైతం సొంత కార్యాలయ భవనాలను సమకూర్చుకున్నాయని చెప్పారు. ప్రాంతీయ పార్టీల ఆర్థిక స్థితిగతులు ఏవిధంగా ఉన్నాయో చూడాలని అన్నారు. దేశ భవిష్యత్తు కోసం ప్రణాళికా రచన ఈ ఆఫీసు నుంచే జరగబోతోందని చెప్పారు.

# జాదురావుపేటలో గుప్పుమంటున్న గుడుంబా రక్కసి.

ఊర్లన్నీ జీవచ్ఛవాలతో నిండిపోయి స్మశాన నిశబ్దాలకు నెలవవుతాయి. బతుకులు చితికిపోయి పచ్చని కాపురాలు పాడెక్కు తున్నాయి. కాటారం మండలంలోని చాలా గ్రామాల్లో గుడుంబా కోరలు చాస్తూనే ఉంది.

**జాదురావుపేటలో గుడుంబా రక్కసి..**

ఆ గ్రామానికి చెందిన హార్వెస్టర్ యజమాని ఈ గుడుంబా దందా నిర్వహిస్తున్నట్లు సమాచారం..! ప్రమాదకరమైన కెమికల్స్ తో తయారు చేసిన నాటుసారా తాగడంవల్ల జాదురావ్ పేటలో రోడ్లపై పడిపోతున్నారు తమ ప్రాణాలమీదకు తెచ్చుకుంటూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తీరా కుంటుంబంలో పెద్దదిక్కు కోల్పోయి ఎన్నో కుటుంబాలు వీధిపాలు అవుతున్నాయి. గుడుంబాను శాశ్వతంగా నివారించామని గొప్పలు చెప్పుకునే ఎక్సైజ్ అధికారులు పల్లెల వైపు కన్నెత్తి చూడకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. పల్లెల్లో నాటుసారా తయారు చేస్తూ విక్రయిస్తున్నారని అధికారులకు సమాచారం అందించడం, అధికారులు వారిని పట్టుకొచ్చి అందినకాడికి దండుకుని వారిని వదిలిపెట్టడం మారింది. కాటారం మండలంలోని ఏ పల్లె చూసినా గుడుంబా గుప్పుమంటున్నాయి. నిద్ర లేచినప్పటినుండి రాత్రి పడుకునే వరకు పల్లె ప్రజలు గుడుంబాకు బానిసలవుతున్నారు. పల్లెల్లో, తండాల్లో శివారులోని పంట పొలాల్లో, చేనుల వద్ద గుడుంబా బట్టీలను రహస్యంగా ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి వేళల్లో గుడుంబా బట్టీలనుండి ప్రమాదకరమైన కెమికల్స్ తో తయారైన నాటు సారాను పల్లె ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారన్న సమాచారం.. వినబడుతోంది. కొందరు గుడుంబా వ్యాపారం చేసే వ్యక్తులు పల్లె ప్రజలను బానిసలను చేసి గుడుంబా మత్తులో దించి వారి జీవితాలలో చెలగాటమాడుతున్నారు. నిత్యం గుడుంబాకు బానిసై ప్రజలు ఇంట్లో కుంటుంబాన్ని పోషించలేక రోడ్డున పడుతూ వారి కుటుంబాలు చిందరవందరం అవుతున్నాయి. గుడుంబాకు బానిసైన కుటుంబాల్లో పెద్ద దిక్కును కోల్పోయి కుటుంబాన్ని పోషించుకోలేని స్థితిలో కొన్ని కుటుంబాలు ఉన్నాయంటే గుడుంబా మహమ్మారి ఎంతగా వ్యాపిస్తుందో ఇట్టే అర్థమవుతోంది. మండలంలోని పలు గ్రామాలు తండాల్లో గుడుంబా మహమ్మారి విచ్చలవిడిగా కొనసాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**యువతపై ప్రభావం**

30 ఏండ్లు కూడా నిండని యువకులు, వృద్ధులు సారాయికి బానిసై తనవులు చాలిస్తున్నారు. గుడుంబా ధాటికి గూడు చెదిరి చల్లా చెదురవుతున్నాయి. అమ్ముకునేటోడు లాభం చూసుకుంటున్నడు. మరి తాగేటోల్లు పానం కోసం ఎందుకు ఆలోచించరు అన్న ఆ బాధిత కుటుంబీకుల ప్రశ్నకు బదులు చెప్పేదెవరు..? ఇప్పటికీ ఎన్నో ప్రాణాలు గుండుబా రక్కసి కోరలకు చిక్కి గోడమీద ఫొటోలో కెక్కుతున్నారు. చదువుకోవాల్సిన వయస్సులో కుటుంబ భారం మీదపడి మరికొందరు మహిళలు బతుకుతో, సమాజంతో ఒంటరి పోరాటం చేస్తున్నారు. తాగు డుకు బానిసైన తమ భర్తలు, తండ్రులు, అన్నదమ్ములను మార్చుకోలేకపోయిన మహిళలు గుడుంబా కాసే వారిని కలిసి తమ వాళ్లకు గుడుంబా విక్రయించవద్దని మొరు పెట్టుకున్న కనికరించడం లేదు. మా వ్యాపారం మాదే అంటున్నారు. దీంతో కళ్లముందే ఇంట్లో వారు తాగుడుకు తగలబడిపోతుంటే ఏం చేయలేక మహిళలు కన్నీరుమున్నీరవడం తప్ప ఏమీ చేయలేక పోతున్నారు.

**పల్లెల్లో గుడుంబా అరికట్టడంలో అధికారుల నిర్లక్ష్యం.**

కాటారం మండలంలో ఎక్సైజ్ శాఖ అధికారులు గుడుంబా స్థావరాలపై సమాచారం అందిచినప్పటికీ తూతూ మంత్రంగా తనిఖీలు చేపడుతూ గుడుంబా అరికట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి గుడుంబాను తయారు చేస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్నప్పటికీ వారిపై ఎలాంటి కేసులు పెట్టకుండా బేరసారాలాడి వదిలిపెట్టిన సంఘటనలు ఎన్నో ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా గుడుంబా నివారణకు ప్రత్యేక స్థాయిలో రహస్య స్థావరాలలో తయారు చేసునతన్న గుడుంబా బట్టీలను ధ్వంసంచేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# కెటిఆర్‌కు సుప్రీంలో చుక్కెదురు

నిరాకరించింది. దీంతో ఈ నెల 8న ఆయన సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. కేటీఆర్ పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ ప్రసన్న వ్లగ్÷ ధర్మాసనం విచారణ జరిపింది. దీంతో ఆయనకు ఇక ఎసిబి విచారణ తప్పదు. అలాగే అరెస్ట్ చేయడం కూడా ఖాయమని అంటున్నారు. రాజకీయ కారణాలతోనే కేసు నమోదు చేశారని.. ప్రస్తుతం కేటీఆర్ విపక్షంలో ఉన్నారని ఆయన తరపు న్యాయవాది సుందరం సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్ష నేతగా ఉండటంతోనే కేసులు పెడుతున్నారని వాదించారు. అయితే.. ప్రతిపక్ష నేతగా ఉంటే కేసులు ఎదుర్కోవాలి కదా..? అని జస్టిస్ బేలా ఎం త్రివేది ప్రశ్నించారు. హైకోర్టు తీర్పులో తాము జోక్యం చేసుకోలేమంటూ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. పిటిషన్ వెనక్కి తీసుకుని.. మళ్లీ హైకోర్టును ఆశ్రయించేందుకు అవకాశం ఇవ్వాలని కేటీఆర్ తరపు న్యాయవాది కోరారు. పిటిషన్ విత్ డ్రా చేసుకునే అవకాశం కల్పించిన ధర్మాసనం.. మళ్లీ హైకోర్టుకు వెళ్లే స్వేచ్ఛ ఇవ్వలేమని స్పష్టం చేసింది. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని కేటీఆర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. విచారణలో భాగంగా కేటీఆర్ తరపున న్యాయవాది సిదార్థ వాదనలు వినిపించారు. ఈ ఫార్ములా కారు రేసు కేసులో హెచ్ఎండీఏను, ఇతరులను పేర్కొనలేదని కేవలం ఇద్దరు అధికారులను, కేటీఆర్‌ను మాత్రమే నిందితులుగా చేర్చారని కోర్టు ముందు ప్రస్తావించారు. ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపు కేసు అని.. కేటీఆర్ ఒక్క రూపాయి తీసుకున్నారని ఎవరూ చెప్పడం లేదని న్యాయవాది తెలిపారు. ఇలాంటప్పుడు అవినీతి నిరోధక చట్టంలోని 13(1)ఏ ఎలా వర్తిస్తుందని.. ఇందులో పీసీ యాక్ట్ 13(1ఎ) వర్తించనే వర్తించదని కేటీఆర్ తరపు న్యాయవాది వాదించారు. వెంటనే జోక్యం చేసుకున్న జస్టిస్ బేలా త్రివేది.. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై ఎలాంటి జోక్యం చేసుకోబోమని స్పష్టం చేశారు. దీంతో ఈ కేసుకు సంబంధించి సుప్రీం కోర్టులో కాస్త ఊరట లభిస్తుందని భావించిన కేటీఆర్‌కు ఎదురుదెబ్బ తగిలింది. సుప్రీం నిర్ణయంతో ఈ కేసులో ఏసీబీకి మరింత దూకుడు పెంచే అవకాశం ఉంది. అయితే కేటీఆర్ కంటే ముందే రాష్ట్ర ప్రభుత్వం కూడా సుప్రీంలో కేవియట్ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఒకవేళ కేటీఆర్ సుప్రీం కోర్టును ఆశ్రయిస్తే.. విచారణ సందర్భంగా ముందు తమ వాదనలు వినాలని తెలంగాణ ప్రభుత్వం కేవియట్ పిటిషన్‌ను ముందస్తుగానే దాఖలు చేసింది. హైకోర్టులో క్వాష్ పిటిషన్ నిరాకరణకు గురైనప్పటికీ.. సుప్రీం స్టే విధిస్తుందని కేటీఆర్ భావించినట్లు తెలుస్తోంది. కానీ హైకోర్టు ఇచ్చిన ఆర్డర్‌లో తాము జోక్యం చేసుకునేది లేదని సుప్రీం ధర్మాసనం తేల్చి చెప్పడంతో ఏసీబీ మరోసారి నోటీసులు ఇస్తే ఆ విచారణకు కేటీఆర్ ఖచ్చితంగా హాజరుకావాల్సి ఉంటుంది. గతంలో ఈ కేసుకు సంబంధించి కేటీఆర్‌ను దాదాపు ఎనిమిది గంటల పాటు ఏసీబీ విచారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సుప్రీం కోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ అయిన నేపథ్యంలో.. మాజీ మంత్రి అరెస్ట్ తప్పదనే వార్తలు వినిపిస్తున్నాయి. కాగా.. ఈ కేసుకు సంబంధించి ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌తో పాటు, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్‌ను ఈడీ, ఏసీబీ అధికారులు విచారించిన విషయం తెలిసిందే. వీరి నుంచి పలు కీలక సమాచారాన్ని ఏసీబీ, ఈడీ అధికారులు రాబట్టినట్లు తెలుస్తోంది. ఇదిలావుంటే ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు మరోసారి నోటీసులు ఇచ్చేందుకు ఏసీబీ సిద్ధమైంది. ఆయనతోపాటు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలకు మరో సారి నోటీసులు ఇచ్చే యోచనలో ఉంది. సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ కావడంతో నోటీసులపై ఏసీబీ ముందుకెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ ముగ్గురిని ఏసీబీ విచారించిన విషయం తెలిసిందే.

# నౌకాదళం మరింత బలోపేతం

నిలిచింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'దేశ రక్షణలో సైనికుల సేవలు ఎనలేనివి. దేశ భద్రత కోసం వారు ప్రాణాలను సైతం లెక్క చేయరు. నౌకాదళం బలోపేతానికి నేడు మరో ముందడుగు పడింది. తొలిసారిగా.. రెండు యుద్ధ నౌకలు, జలాంతర్గామిని ఒకేసారి మనం ప్రారంభించుకున్నాం. ఇవన్నీ భారత్‌లో తయారైనవే. వీటితో నౌకాదళానికి నూతన బలం, దార్శనికత అందుతుంది' అని వివరించారు. 'సముద్ర తీర రక్షణకు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. గత పదేళ్లలో 33 యుద్ధ నౌకలు, ఏడు జలాంతర్గాములు నేవీలో చేరాయి. రక్షణరంగ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నాం. దేశ రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.25 లక్షల కోట్లు దాటింది. మన రక్షణ పరికరాలను 100కు పైగా దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. మాదక ద్రవ్యాలు, ఆయుధాలు, ఉగ్రవాదం నుంచి సముద్రతీరాలను రక్షించడంలో మనం ప్రపంచ భాగస్వామిగా మారాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు.ఐఎన్ఎస్ సూరత్.. పీ15బీ గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ ప్రాజెక్ట్ కింద అభివృద్ధి చేస్తున్న నాలుగో యుద్ధనౌక. ప్రపంచంలోనే భారీ, అత్యాధునిక డిస్ట్రాయర్ యుద్ధ నౌకల్లో ఇదొకటి. ఇందులో స్వదేశీ వాటా 75 శాతం. ఈ యుద్ధ నౌకలో అధునాతన ఆయుధ-సెన్సర్ వ్యవస్థలు ఉన్నాయి. నెట్‌వర్క్ సెంట్రిక్ సామర్థ్యం దీని సొంతం.ఐఎన్ఎస్ నీలగిరి.. పీ17ఏ స్టెల్త్ ఫ్రిగేట్ ప్రాజెక్టులో తొలి యుద్ధనౌక. శత్రువును ఏమార్చే స్టెల్త్ పరిజ్ఞానంతో దీన్ని తయారుచేశారు. ఐఎన్ఎస్ వాఘ్‌షీర్.. పీ75 కింద రూపొందిస్తున్న ఆరో, చివరి జలాంతర్గామి. ఫ్రాన్స్‌కు చెందిన నేవల్ గ్రూప్ సహకారంతో దీన్ని అభివృద్ధి చేశారు.

## ఎపిలో కాంగ్రెస్ బలోపేతంపై చర్చించా

మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఏఐసీసీ కేంద్ర నూతన కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఆమె ఢిల్లీకి చేరుకున్నారు. ఉదయం 10:30 గంటలకు జరిగిన కార్యక్రమంలో షర్మిలా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ అగ్రనేతలు, ముఖ్యమంత్రులు, మంత్రులు పెద్దఎత్తున హాజరయ్యారు. కాగా, ఏఐసీసీ కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం రాహుల్ గాంధీతో షర్మిల భేటీ అయ్యారు. 'ఢిల్లీలోని కోట్లా రోడ్డులో ఆరు అంతస్తుల్లో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన కాంగ్రెస్ పార్టీ కొత్త కార్యాలయం 'ఇందిరా భవన్'ని అగ్ర నాయకురాలు శ్రీమతి సోనియా గాంధీ ప్రారంభించడం సంతోషంగా ఉంది. ఇలాంటి చారిత్రాత్మక కార్యక్రమంలో నేనూ పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ ఆరు అంతస్తుల భవనంలో 140 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ చరిత్రకు సంబంధించిన అద్భుతమైన ఫొటోలు ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్రకు సంబంధించిన ఫొటోలు కార్యాలయంలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. పాదయాత్ర ఫొటోలు కొత్త కార్యాలయంలో పెట్టడం వైఎస్ రాజశేఖర్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న గౌరవాన్ని తెలియజేస్తోంది. కొత్త ఏడాదిలో ప్రారంభించు కున్న ఈ నూతన భవనం నుంచే కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందనే ధీమా వ్యక్తమవుతోంది' అంటూ ట్వీట్ చేశారు. బుధవారం ఉదయం ఏఐసీసీ నూతన కార్యాలయాన్ని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ప్రారంభించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నూతన భవనంలో పార్టీ జెండా ఎగురవేశారు. ఈ భవనానికి ఇందిరాభవన్‌గా నామకరణం చేశారు. ఈ వేడుకలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. ఏపీకి చెందిన పలువురు నేతలు సైతం హాజరయ్యారు. ప్రారంభోత్సవానికి సుమారు 400 మంది ఆహ్వానితులు వచ్చినట్లు తెలుస్తోంది. కాగా, ఆరు అంతస్తులో ఆధునిక సౌకర్యాలతో ఏఐసీసీ నూతన కార్యాలయాన్ని నిర్మించారు.

# అక్రమార్కులకు అరదండాలు తప్పవు

నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఫీడ్ బ్యాక్ తీసుకుని కష్టపడిన వారికి గుర్తింపునిస్తామన్నారు. ఫిబ్రవరి నుంచి పార్టీని బలోపేతం చేసే పని ప్రారంభిస్తామన్నారు. పార్టీ కోసం అధిక సమయం కేటాయిస్తానని లోకేష్ చెప్పారు. చంద్రగిరి నియోజకవర్గం నారావారిపల్లెలో ముఖ్యనాయకులు, కార్యకర్తలతో మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి లోకేష్.. ఇలా తన చుట్టూ తిరగడం వల్ల పదవులు రావని పార్టీ నాయకులకు తేల్చి చెప్పారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే పదవులు వస్తాయన్నారు. పార్టీలో సంస్కరణలు తేవాల్సి ఉందన్నారు. టర్మ్ లిమిట్స్ ఉండాలన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా తాను 3వసారి కొనసాగుతున్నానని లోకేష్ గుర్తు చేశారు. గ్రామం నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీలో వ్యవస్థాగతంగా మార్పులు రావాలని ఆయన అభిప్రాయపడ్డారు. పొలిట్ బ్యూరోలో ప్రతి రెండేళ్లకు ఒకసారి 30శాతం కొత్తవారు రావాలని.. అప్పుడే పార్టీలో మూమెంట్ వస్తుందన్నారు. అహర్నిశలు పాటుపడ్డవారికే గత ఎన్నికల్లో టిక్కెట్లు ఇచ్చామని లోకేష్ తెలిపారు. ఫీల్డ్‌లో ఏం జరుగుతుందో ఎప్పటిప్పుడు తెలుసుకుం టామన్నారు. 994 తర్వాత టిడిపి గెలవని నియోజకవర్గం చంద్రగిరి అని.. ఈ సారి మాత్రం భారీ మెజారిటీతో గెలిచామని పార్టీ శ్రేణులను అభినందించారు మంత్రి లోకేష్. గత ప్రభుత్వంలో ప్రజలు, కార్యకర్తలు ఇబ్బంది పడ్డారన్నారు. యువగళం, నిజం గెలవాలి కార్యక్రమాలను విజయవంతం చేశారన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమికి ఎన్నడూ లేని విధంగా 164 సీట్లు ఇచ్చారన్నారు. భారీ మెజారిటీతో గెలిచాం కదా అని తప్పులు చేయొద్దని పార్టీ కేడర్‌కు లోకేష్ హితవు చెప్పారు. 'మనమంతా ఒళ్లు దగ్గరపెట్టుకొని పనిచేయాలి. ప్రజలు ఆశతో మనవైపు చూస్తున్నారు' అని చెప్పుకొచ్చారు.'యువగళంలో పోలీసులు ఎన్ని ఇబ్బందులు పెట్టారో నాకు తెలుసు. తప్పు చేసిన ఎవరినీ వదలే ప్రసక్తిలేదు. అనవసరంగా కేసులు పెట్టడం మన విధానం కాదు. సోషల్ మీడియా చూసి మీరు కంగారుపడి నన్ను కంగారుపెట్టొద్దు. తిరుపతి పార్లమెంటు పరిధిలో దొంగఓట్ల వ్యవహారాన్ని కూడా వదిలిపెట్టం. ఫిబ్రవరి నుంచి స్వర్ణాంధ్ర పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఇందులో పార్టీ కేడర్ అంతా భాగస్వాములు కావాలి. మనం చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లండి. కూటమి ప్రభుత్వంలో మనది పెద్దన్న పాత్ర, మిత్రధర్మంతో పనిచేస్తున్నాం. కొంతమంది ఆవేశంతో మాట్లాడినా ఓర్పుగా ఉండాలి. ఆవేశపడితే రాష్ట్రం, ప్రజలు నష్టపోతారు. ఈ అయిదేళ్లు ఓపికగా, సంయమనంతో రాష్ట్రాన్ని ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది. నెలాఖరుకు నామినేటెడ్ పోస్టులు భర్తీచేస్తాం. ఎఎంసిలను కూడా త్వరలో నియమిస్తాం. సీనియర్లు, జూనియర్లను సమానంగా ప్రోత్సహిస్తాం. పనిచేసేవాళ్లను గౌరవిస్తాం. గతంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ ? భవిష్యత్తుకు గ్యారంటీ, సభ్యత్వనమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్న కేడర్‌కు గుర్తింపునిస్తాం.' అని పార్టీ శ్రేణులకు మంత్రి లోకేష్ చెప్పారు.

## రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలపై నేతల చర్చ

తెలంగాణ ముఖ్యనేతల కీలక సమావేశం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. సుమారు గంటన్నర పాటు వివిధ అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో చర్చించారు.

ఫిబ్రవరి తొలి లేదా రెండో వారంలో రాష్ట్రంలో రాహుల్ గాంధీ సభ ఉంటుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కేసీ వేణుగోపాల్‌తో కాంగ్రెస్ నేతల భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'సూర్యాపేట లేదా ఖమ్మంలో రాహుల్ సభ ఉండే అవకాశముంది. ఈ నెలాఖరులోపు నామినేటెడ్, కార్పొరేషన్ ఛైర్మన్ల భర్తీ ఉంటుంది. కేబినెట్ విస్తరణపై సీఎం, అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుంది. పీసీసీ కార్యవర్గం కూర్పుపై చర్చించాం. ప్రజల్లో ఉన్నవారికే డీసీసీ అధ్యక్ష పదవులు' ఇస్తాం అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫిబ్రవరిలో తెలంగాణలో పర్యటించనున్నారు. ద

ఈ మేరకు ఆయన పర్యటన ఖరారుపై ఢిల్లీలో కేసీ వేణుగోపాల్ తో రాష్ట్ర మంత్రులు, ఇతర నేతలు చర్చించారు. ఢిల్లీలోని కేసి వేణుగోపాల్ నివాసంలో తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై చర్చించారు. సంస్థాగత అంశాలతో పాటు, శాఖల వారీగా పనితీరుపై సమీక్ష చేపట్టారు. కేసీ వేణు గోపాల్ మంత్రులతో ముఖాముఖి భేటీలు నిర్వహించారు.

మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఈ నెలాఖరు లేదా ఫిబ్రవరి మొదటి వారంలో సూర్యాపేట లేదా ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. 'సంవిధాన్ బచావో' ర్యాలీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొననున్నారని అన్నారు. ఈ సమావేశంలో ఈ నెలాఖరు కల్లా నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

అంతేకాకుండా.. పీసీసీ కార్యవర్గం ఏర్పాటు పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే నిజమైన కార్యకర్తలకే జిల్లా కాంగ్రెస్ కమిటీ' (డీసీసీ) అధ్యక్ష పదవులివ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

డీసీసీ అధ్యక్షులు ప్రతిపాదించి, సిఫార్సు చేసే వారికే ప్రాధాన్యతనిచ్చి, వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇవ్వనుంది అధిష్ఠానం. వచ్చే జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం దిశగా సమిష్టిగా సన్నద్ధం కావాలని నిర్దేశర చేశారన్నారు. మంత్రివర్గ విస్తరణ, మార్పులు, చేర్పులు పై అధిష్ఠానం, ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

సంక్రాంతి

# పండగంటే..పందాలేనా ..!

## సంపాదకీయం



సంక్రాంతి క్రమంగా కళావిహీనం అవుతుందా అన్న ఆందోళన కలుగుతోంది. పందాలు, తాగుడు, జూదాలు ఇవే సంక్రాంతి అన్నట్లుగా పండగలు సాగుతున్నాయి. ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో ఏటా వివిధ రకాల పందాలు యధావిధిగా సాగాయి. కోడి పందాలు,జూదాలు సాగాయి. మద్యం ఏరులై పారింది. తెలంగాణ లో సైతం మద్యం ఏరులై పారింది. మటన్ చికెన్ ధరలకు రెక్కలు వచ్చాయి. ఏటేటా సంక్రాంతికి ధరలు పెరుగుతూనే ఉన్నాయి. కోళ్లు, గొర్లు, మేకల పెంపకం తగ్గడంతో పాటు ఉత్పత్తి తగ్గుతూ వస్తోంది. దీంతో ధరలు పెరుగుతున్నాయి. పంటలు, జంతువుల పెంపకంపై ఆసక్తి తగ్గుతోంది. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగాల వైపు చూస్తున్నారు. అలా కాకుండా సొంతంగా వ్యాప్యారం చేసుకోవాలన్న స్పృహ కోల్పోతున్నారు. దీంతో తినేవారు ఎక్కువై..ఉత్పత్తి చేసే వారు తగ్గుతున్నారు. ఈ రంగంలో ఉపాధికి అవకాశాలు ఉన్నా..యువత దృష్టి సారించడం లేదు. ఇదిలావుంటే ప్రజల్లో మాత్రం సంక్రాంతి జోష్ తగ్గలేదు. ప్రతి ఒక్కరూ గ్రామాలకు తరలారు. దీంతో తెలుగు పల్లెలు సందడిగా మారాయి. బస్సులు కిటకిటలాడాయి. సొంతవాహనాలు రోడ్డెక్కాయి. అయినా రైల్సు, బస్సుల్లో చోటు దొరకలేదు. ప్రైవేట్ వాహనాదారులు బాగా సంపాదించారు. సంక్రాంతి తెలుగువారి పెద్ద పండగ. పండగ సందడితో ప్లలెలు శోభాయమానంగా రూపుదిద్దుకున్నాయి. సంక్రాంతి అంటే రంగవల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దులు, హరిదాసులు, భోగి మంటలు, పిండి వంటలు సందడిగా కనిపించింది. సంక్రాంతి పండగ సంప్రదాయ కళలకు, సాంస్కృతిక కార్యక్రమాలకు, గ్రామీణ క్రీడలకు నెలవు. ఇటువంటి సరదాల పండగలో వేల కోట్ల రూపాయలు చేతులు మారే భయంకర జూదం ఏటికేడు కొత్త పుంతలు తొక్కుతూ స్థిరపడుతుండటం ఆందోళన కలిగిస్తుంది. ఇలాంటి జూదాలతో కలగలపి ఉన్న కోడిపందాలకు పాలకులు అండదండగా నిలవడం,పలువురు ప్రత్యక్షంగా పాల్గొనడం, నిర్వహించడం ఆందోళన కలిగిస్తోంది. ఏటా గోదావరి జిల్లాల్లో ఇది అధికంగా కనిపిస్తోంది. కోర్టు ఆర్డర్లు, పోలీస్ ఆంక్షలు ఏవీ పనిచేయడం లేదు. ఎవరు అధికారంలో ఉన్నా ఆనవాయితీ మరింత జోరుగా కొనసాగడం ఆవేదనకు గురి చేస్తుంది. కోర్టు ఆదేశాలు, చట్టాలు, పోలీస్ నిఘా ఇవేవీ భారీ జూదానికి అడ్డు కాకపోవడం ఆశ్చర్య పరుస్తున్నది. సంక్రాంతి అనగానే స్ఫురణకు వచ్చేవి కోడి పందేలు. అక్కడక్కడ ఎడ్ల, పొట్టేళ్ల, గుర్రాల ఇత్యాది పందేలూ నిర్వహిస్తారు. సంప్రదాయాల పేరిట నిర్వహించే ఈ పందేల కేంద్రంగా అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలే ప్రధానంగా నిలుస్తు న్నాయి. చీట్ల పేక, గుండాట దగ్గర నుంచి అత్యాధునిక కేసినో వరకు జూద క్రీడలదే హవా. రెండు మూడు రోజుల్లో కోట్లు కొల్లగొట్టడానికి అవకాశం ఉండడంతో ఏటా వీటిపై నిర్వాహకులకు అధిక మక్కువ చూపుతున్నారు. ఈయేడు కూడా యధావిధిగానే ఇలాంటివన్నీ సాగాయి. కోడి పందేలనగానే టక్కున గుర్తుకొచ్చేవి గోదావరి జిల్లాలు. కోడి పందేలకు రాజధానిగా భీమవరం విరాజిల్లుతుండగా ఆ సంప్రదా యాన్ని మరోమారు ఈ యేడు కూడా కొనసాగించారు. రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాలు కూడా ఇలాంటి పందాలను తెరచాటుగా నడిపించాయి. ఎక్కడో మారుమూలన రహస్యంగా జరిగే పందేలు రానురాను జాతీయ, రాష్ట్ర రహదారుల మీదికొచ్చేశాయి. కొన్ని చోట్ల నగర, పట్టణ నడుబొడ్డున ఎలాంటి భయం లేకుండా పందేలు నిర్వహించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే బరులు క్రికెట్ స్టేడియాలను తలపింపజేసాయి. పెద్ద హీరోల సినిమాల ప్రీ రిలీజ్ ఫంక్షన్లకు ఎంత మాత్రం తీసిపోవడం లేదు. సినిమా సెట్టింగ్‌లను మించిన వైభోగం కోడి పందేల బరుల వద్ద కనిపించిది. ఎకరాలకు ఎకరాల్లో నిర్వహించే పందేల వీక్షకుల కోసం గ్యాలరీలు, ఎల్ఇడి స్క్రీన్లు, రాత్రిపూట పందేల నిర్వహణ కోసం మిరుమిట్లు గొల్పే ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసారు. పందెం రాయుళ్ల సౌకర్యార్థం జిఎస్‌టి, ఇడి, ఐటి వంటి ఇబ్బందుల్లేకుండా స్పాట్ క్యాష్ విధానం, బ్లాక్ మనీ చెలామణి వంటి సదుపాయాలు పుష్కలంగా అమల్లోకి వచ్చాయి. ఎక్కడెక్కడి నుంచో ఈ పందాలను చూసి సరదా తీర్చుకునే వారు సైతం సొంత వాహనాలు వేసుకుని ఆయా ప్రాంతాల్లో తిష్టవేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, ఆఫ్‌లైన్ ముందస్తు ఒప్పందాలు యధావిదిగానే సాగాయి. హోటళ్లు నిండిపోయాయి. పూర్తిగా వ్యాపారాం సజావుగా సాగింది. ఇదంతా కోట్లల్లో ఉంటుందంటే నమ్మగలమా అని అనుమానాలు కలుగుతున్నాయి. పందాలలో పాల్గొనే వారు ఆస్తుల తనఖా, బంగారు ఆభరణాల తాకట్టు సౌలభ్యం కూడా అందుబాటులోకి రావడం మరో పరాకాష్ట. ఇంత యధేచ్ఛగా జూదం బరితెగించినా, ఏటా దీని విస్తృతి పెరుగుతున్నా అడ్డుకున్న దాఖలాలు కానరావడం లేదు. ఈ మూడు రోజుల పాటు రాష్ట్రంలో నిర్వహించిన జూదం విలువెంతో వెలకలట్టడం కష్టమే. రూ. ఐదారు వేల కోట్లకు పైమాటేనన్నది ఆరి తేరిన కన్‌స్టలెన్సీల, ఆన్‌లైన్ బెట్టింగ్ ఏజెన్సీల మాట. ఆ అంచనా కూడా తక్కువేనని, అంతకు నాలుగైదు రెట్లని చెప్పేవారూ కూడా ఉన్నారు.సంక్రాంతి జూదంలో ఆస్తులు, డబ్బు పోగొట్టుకొని అప్పుల పాలైన, వీధిన పడ్డ కుటుంబాలనేకం ఏటా కనబుడుతున్నా వారిలో పరివర్తన రావడం లేదు. జూదంతోనే ఆగట్లేదు. మద్యం వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతుంది. ఈ ముసుగులో అక్రమ, నాసిరకం మద్యం విచ్చలవిడిగా ఏరులై పారింది. సారాపై నిషేధం ఉన్నా కాపుసారా కోడి పందేల బరులను ముంచెత్తింది. జూదాలకు తోడు మందు, ఉక్క లేనిదే బరులవద్ద అడుగు పడలేదు. జిల్లాలు, రాష్ట్రాలు దాటి కార్లలో సైతం వచ్చి కోడి పందేల్లో పాల్గొంటున్నారంటే అది ఎంతకు దారితీస్తుందో అన్న భయాందోళనలు కూడా కనిపిస్తున్నాయి. జాక్ పాట్ తగులుతుందన్న ఆశ...ఒక వైపు, తక్కువ సమయంలో అధిక మొత్తం చేజిక్కించుకోవాలన్న దురాశ కారణంగా పందాలకు గిరాకీ పెరుగుతోంది. ఇటువంటి దారుణ పరిస్థితులను అడ్డుకోవడం ఇప్పట్లో సాధ్యం కాకపోవచ్చు. సంక్రాంతి సందడి అంటే ఇదేనంటూ సాగేలా ముమ్మందు రూఢి కానుంది.

# 20న ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు

**భారీగా ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం**

**ప్రపంచవ్యాప్తంగా ప్రముఖుల హాజరు**

**భారత్ తరపున విదేశాంగా మంత్రి జైశంకర్ హాజర్**

**టెక్ దిగ్గజాలు సైతం హాజరవుతున్నట్లు సమాచారం**



వాషింగ్టన్,జనవరి15 : అమెరికా అధ్యక్షుడిగా మరోమారు విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ జనవరి 20న అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. అధికార మార్పిడి కార్యక్రమం సులువుగా సాగేలా బైటెన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అమెరికా అధ్యక్ష బాధ్యతల స్వీకార కార్యక్రమానికి బిలియనీర్లు, టెక్ దిగ్గజాలు ఎలాన్‌మస్క్, మార్క్ జుకర్‌బర్గ్ , జెఫ్ బెజోస్ హాజరవుతారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. వీరే కాకుండా అనేకమంది దేశవిదేశాల ప్రతినిధులు, ప్రముఖులు హాజరవుతారు. జనవరి 20న అమెరికా 47వ నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి అమెరికా క్యాపిటల్ భవనంలోని వెస్ట్ ఫ్రంట్ ప్రాంతం వేదిక కానుంది. ఈ కార్యక్రమానికి భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రపంచ దేశాల అధినేతలు ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి రానున్నట్లు సమాచారం. కాగా ఈ కార్యక్రమంలో భారత్ తరపున విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ హాజరుకానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్‌కు, ట్రంప్‌నకు పొసిగేది కాదు. బెజోస్ యాజమాన్యంలోని వాషింగ్టన్ పోస్ట్ దిన పత్రిక ట్రంప్ విధానాలను విమర్శించేది. మెటా అధిపతి మార్క్ జుకర్‌బర్గ్‌కు, ట్రంప్‌నకు మధ్య కూడా విభేదాలు ఉండేవి. 2021లో అమెరికా పార్లమెంటు భవనంపై ట్రంప్ అనుయాయులు దాడి చేయడంతో ఆయన్ను ఫేస్ బుక్ నుంచి బహిష్కరించారు. 2023లో ట్రంప్ ఫేస్ బుక్ ఖాతాను పునరుద్ధరించారు. అయినా జుకర్ బర్గ్‌పై ట్రంప్ విరుచుకుపడేవారు. కానీ, ఇప్పుడు ఉభయుల మధ్య సయోధ్య సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ట్రంప్ తిరిగి అధ్యక్షుడిగా ఎన్నికవడంతో ఈ టెక్ దిగ్గజాలు పాత విభేదాలను పక్కనపెట్టి ఆయనకు దగ్గరవుతున్నారు. ట్రంప్ పదవీ స్వీకార సమయంలో వేడుకలు, ఇతర ప్రారంభోత్సవ కార్యక్రమాల నిర్వహణ నిధికి ఇప్పటికే జెఫ్ బెజోస్, జుకర్ బర్గ్ మొదలైనవారు విరాళాలు ఇచ్చారు. అమెజాన్ ప్రైమ్‌లో ట్రంప్ పదవీ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ప్రసారం చేస్తుందని కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం వీరిరువురూ ట్రంప్‌ను వ్యక్తిగతంగా కలిసి చర్చలు జరిపారు.

## ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో

# సందడే సందడి

**పుణ్యస్నానాల కోసం భారీగా తరలివస్తున్న భక్తులు**

**ఒక్కరోజే మూడున్నర కోట్ల మంది పుణ్యస్నానాలు**



ప్రయాగ్‌రాజ్,జనవరి15 : ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వేదికగా ప్రారంభమైన 'మహా కుంభమేళా' కు భక్తులు పోటెత్తుతున్నారు. ఉత్తరాయణ పుణ్యకాలంతో భక్తులు భారీగా తరలిచ్చారు. మంగళవారం మకర సంక్రాంతి పురస్కరించుకుని వివిధ అఖాడాల నుంచి వేలాదిగా వచ్చిన సాధువులు తొలి పుణ్య స్నానాలు ఆచరించారు. తెల్లవారుజామునే 3 గంటల సమయంలో బ్రహ్మ ముహూర్తంలో పుణ్యస్నానాలు ప్రారంభమయ్యాయి. నేడు ఒక్కరోజే దాదాపు 3.5 కోట్ల మంది భక్తులు త్రివేణి సంగమానికి తరలివచ్చినట్లు యూపీ ప్రభుత్వం వెల్లడించింది. కుంభమేళా సమయంలో పుణ్యస్నానాలకు ప్రత్యేక స్థానముంది. పెద్ద సంఖ్యలో వివిధ అఖాడాల నుంచి సాధువులు తరలి వచ్చి సామూహిక స్నానాలు ఆచరిస్తారు. కేవలం కుంభమేళా సమయంలోనే వారు దర్శనమిస్తారు. ఈ క్రమంలోనే మంగళవారం ఒంటినిండా భస్మాన్ని పూసుకుని ఈటెలు, త్రిశూలాలు చేతపట్టుకుని డమరుక నాదాల నడుమ వేలమంది నాగ సాధువులు ఊరేగింపుగా పుణ్యస్నానాలకు తరలివచ్చారు. తొలుత పంచాయతీ అఖాడా మహానిర్వాణీ, శంభు పంచాయతీ అటల్ అఖాడాకు చెందిన సాధువులు స్నానమాచరించారు. మహా కుంభమేళాలో 13 అఖాడాలు పాల్గొంటున్నాయి. మరోవైపు.. హెలికాప్టర్ల ద్వారా భక్తులపై పూలవర్షం కురిపించారు. మకర సంక్రాంతి సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించిన సాధువులు, భక్తులకు ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు. అదేవిధంగా ఈ కార్యక్రమాలు విజయవంతం గా పూర్తయ్యేలా చర్యలు తీసుకున్న యంత్రాంగానికి కృతజ్ఞతలు చెప్పారు. అయితే, మహా కుంభమేళా ఏర్పాట్లపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పెదవి విరిచారు. భారీ ఎత్తున ఏర్పాట్లు చేశామని ప్రభుత్వం చెబుతున్న మాటలు వాస్తవానికి దూరంగా ఉన్నాయని విమర్శించారు. తాగునీరు, ఆహారం, వసతి వంటి కనీస సౌకర్యాల కోసం భక్తులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

# ఊరంతా సంక్రాంతి పండగా

**ఏటేటా మూడ్రోజుల పాటు పండగే పండగ**

**ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంప్రదాయం**

నిజామాబాద్,జనవరి15 : ఆ ఊరిలో సంక్రాంతి సంబరాలు కలసికట్టుగా, ఏటేటా నిర్వహిస్తు న్నారు. ఎవరెక్కడ ఉన్నా తప్పకుండా సొంతూరుకు వచ్చి మూడ్రోజులు గడిపి పండగ చేసుకోవడం ఆనవాయితీగా చేసుకున్నారు. కన్న తల్లిని, జన్మభూమిని ఎప్పటికీ మరవద్దన్న ఆదర్శాన్ని ఆ



గ్రామస్తులు పాటిస్తున్నారు. దేశ, విదేశాల్లో ఎక్కడున్నా ప్రతి సంక్రాంతికి స్వగ్రామానికి చేరుకొని అంతా కలిసి ఘనంగా వేడుకలు జరుపుకుంటున్నారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామానికి చెందిన వారంతా జన్మభూమి చారిటబుల్ ట్రస్ట్ పేరిట 12ఏళ్లుగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. మనుషుల మధ్య సంబంధాలు తెగిపోయి ప్రజలు తమ మూలాలు మర్చిపోతున్నారు. జన్మభూమిని, కన్న తల్లిదండ్రులను, చిన్ననాటి జ్ఞాపకాలను మర్చిపోవద్దనే ఉద్దేశ్యంతో జన్మభూమి ట్రస్ట్‌ను నెలకొల్పామని తెలిపారు. 12ఏళ్లుగా సంక్రాంతి సంబరాలను స్వగ్రామంలో చిన్ననాటి మిత్రుల మధ్య జరుపుకుంటున్నాం. దేశ, విదేశాల్లో ఉన్నవారంతా ఊరికి తరలివచ్చి పండగలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఏటా సంక్రాంతిని ఊరూరా పెద్దలు, పిన్నలు, మహిళలు అంతా కలిసి సంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. ఈ యేడు కూడా అదే సంప్రదాయం కొనసాగించి, పల్లె వాతావరణాన్ని పరిమళింప చేశారు. గ్రామానికి చెందిన ఉద్యోగులు, గ్రామస్తులు కలిసి 2013 జనవరిలో జన్మభూమి చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. గ్రామ యువత, పిల్లలు గ్రామీణ ప్రాంత పండుగలు, సంస్కృతి సాంప్రదాయాలను మర్చిపోకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ ట్రస్టును ఏర్పాటు చేసినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. జన్మభూమి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా సంక్రాంతి పండుగను సంబురంగా జరుపుకుంటున్నారు. మూడు రోజులపాటు స్వాగత తోరణాలు, డీజే పాటలతో ఊరంతా సందడిగా మారుతుంది. మంగళవారం సంక్రాంతి పండగను, బుధవారం కనుమ పండగను అందరం కలసి జరుపుకున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.. గ్రామానికి చెందిన వారు చాలామంది విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంకా కొందరు దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ స్థిరపడ్డారు. ఎవరు ఎక్కడున్నా ఏడాదికి ఒకసారి సంక్రాంతికి సొంతఊరికి రావాలని నిర్ణయించుకున్నారు. 12 ఏండ్ల కింద ఈ నిర్ణయం తీసుకోగా ప్రతిఒక్కరూ విధిగా పండుగకు ముందు ఊరికి చేరుకుంటున్నారు. ఈ యేడు కూడా ఎక్కడెక్కడో ఉన్నవారంతా సంక్రాంతికి రెండు రోజుల ముందే గ్రామానికి చేరుకున్నారు. యోగక్షేమాలతు, పలకరింపులతో సరదాగా గడిపారు. ఏడాదంతా పనుల్లో తీరిక లేకుండా గడిపిన వారంతా బంధువులను, పాత మిత్రులను కలుసుకుని సంబరపడ్డారు. చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. పండుగ వేడుకల్లో భాగంగా వివిధ రకాల పోటీలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీ, తాడాట, కుర్చీలాట, పురుషులకు ఖోఖో, కబడ్డీ, రన్నింగ్, షటిల్ లాంటి పోటీలు పెట్టారు. కనుమ నాడు ఊరంతా ఒకదగ్గరే భోజనాలు చేపట్టారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు.

# మోహన్ భగవత్ వ్యాఖ్యలు దేశద్రోహం కిందకే వస్తాయి

**రామమందిర నిర్మాణం రోజే నిజమైన స్వాంత్ర్యం అంటారా**

**కాంగ్రెస్ ప్రధాన కార్యాలయ ప్రారంభోత్సవంతో రాహుల్ విమర్శలు**



న్యూఢిల్లీ,జనవరి15 : అయోధ్యలో రామమందిరం ప్రతిష్ఠాపన రోజునే భారత్ నిజమైన స్వాతంత్ర్యాన్ని పొందిందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. వీటిని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. తాజాగా ఆ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. భాగవత్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన వ్యాఖ్యలు దేశద్రోహం కిందకే వస్తాయని అన్నారు. దిల్లీలో కాంగ్రెస్ నూతన ప్రధాన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. దీనికి ఇందిరాభవన్ గా నామకరణం చేశారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్‌పై ధ్వజమెత్తారు. 'దేశంలో రెండు సిద్ధాంతాల మధ్య యుద్ధం జరుగుతోంది. ఒకటి మా రాజ్యాంగ సిద్ధాంతం, మరొకటి ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం. 1947లో దేశానికి స్వాతంత్ర్యం రాలేదంటూ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ దేశ ప్రజలందరినీ అవమానించారు. బ్రిటీష్ వారిపై పోరాడిన యోధులందరినీ ఆయన కించపరిచారు. ఆయన వ్యాఖ్యలు దేశద్రోహం కిందకే వస్తాయి. ఇకనైనా ఇలాంటి పిచ్చి మాటలు వినడం ఆపాలి' అని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ నేతలు తమ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నారని ఆయన ఈసందర్భంగా గుర్తుచేశారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేవారిని ఆపగలిగేది తమ పార్టీ మాత్రమేనని అన్నారు. తమ పోరాటంలో న్యాయం ఉందని, దాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ తీరుపైనా రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే అసెంబ్లీ ఎన్నికల సమయానికి మహారాష్ట్రలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. దానికి సంబంధించిన సమాచారం ఇచ్చేందుకు ఈసీ నిరాకరిస్తోంది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడం ఈసీ బాధ్యత. మన ఎన్నికల వ్యవస్థలో తీవ్రమైన సమస్యలు ఉన్నాయని రాహుల్ ఆరోపించారు. అనంతరం నూతన ప్రధాన కార్యాలయం గురించి స్పందిస్తూ.. ఈ కొత్త భవనం కాంగ్రెస్ కార్యకర్తల రక్తంతో రూపుదిద్దుకుంది. ఇది ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు చెందుతుందని పేర్కొన్నారు. ఏఐసీసీ నూతన కార్యాలయం ప్రారంభమైంది. బుధవారం ఉదయం పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నూతన భవనంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ భవానానికి ఇందిరాభవన్‌గా నామాకరణం చేశారు. నూతన కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీ, కెఎస్ వేణుగోపాల్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం 1947లో రాలేదని, రామ్ మందిర్ నిర్మాణం జరిగినప్పుడే వచ్చిందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారని, దేశంలో రెండు భావజాలాలు ఉన్నాయని, అందులో ఒకటి రాజ్యాంగబద్ధమైన భావజాలం తమదని, మరొకటి ఆర్‌ఎస్‌ఎస్ భావజాలమని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ భావజాలంలో పెద్ద, చిన్న కులాలు, తర తమ బేధాలు ఉండవని, రాజ్యాంగంలో అదే రాసి ఉందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఆర్‌ఎస్‌ఎస్‌లో పూర్తిగా కేంద్రీకృతమైన విధానాలు, నిర్ణయాలు ఉంటాయన్నారు. మోహన్ భగవత్ రాజ్యాంగం చెల్లుబాటు కాదని చెబుతున్నారని, బ్రిటీష్ మీద జరిగిన పోరాటాన్ని గుర్తించడం లేదని విమర్శించారు. వారికి త్రివర్ణ పతాకంపై గౌరవం లేదని, రాజ్యాంగ విలువలపై నమ్మకం లేదని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడే ఏకైక పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ పార్టీయేనని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ భావజాలం ఇవాల్టిదో.. నిన్నటిదో కాదని.. వేల సంవత్సరాల ఆర్‌ఎస్‌ఎస్ ఐడియాలజీని వ్యతిరేకిస్తూ వేల ఏళ్లుగా మా ఐడియాలజీ కొనసాగుతూ వచ్చిందని అన్నారు. గురునానక్, గౌతమ బుద్ధుడు, కృష్ణుడు.. వీళ్లంతా ఆర్‌ఎస్‌ఎస్ ఐడియాలజీనా.. అని ప్రశ్నించారు. ఈ కొత్త భవనం కాంగ్రెస్ భావజాలానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఈ భవనంలో ఉన్న అందరూ ఆ భావజాలాన్ని కాపాడేవారేనని.. బీజేపీకి లొంగిపోయేవారు కాదని అన్నారు. ఈ భవంతి బయట మిలియన్ల కొద్దీ ప్రజలు మన భావజాలానికి మద్దతుగా ఉన్నారని, ఈ భావజాలం దేశం నలుమూలలకు మరింతగా విస్తరించాలని రాహుల్ గాంధీ పిలుపిచ్చారు. ఆ తర్వాత ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నూతన ప్రధాన కార్యాలయం గురించి స్పందిస్తూ.. ఈ కొత్త భవనం పార్టీ కార్యకర్తల రక్తంతో రూపుదిద్దుకుంది అన్నారు.. ఇది ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు చెందుతుంది అని రాహుల్ గాంధీ వెల్లడించారు.

# మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్

## మారనున్న మెట్రో ముఖచిత్రం

హైదరాబాద్, : గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఉన్న ఔటర్‌ను అనుసంధానం చేస్తూ 36 వరకు రోడ్డు మార్గాలు, నాలుగు చోట్ల రైలు మార్గాలు ఉన్నాయి. రోడ్డు, రైలు మార్గాలతో పాటు మెట్రో మార్గం కలిస్తే భవిష్యత్ ప్రజా రవాణా వ్యవస్థ మెరుగ్గా ఉండే అవకాశాలున్నాయి. ఆ దిశగానే సీఎం రేవంత్ రెడ్డి ఉత్తర హైదరాబాద్ వైపు రెండు మెట్రో కారిడార్లు, దక్షిణ హైదరాబాద్ వైపు మరో కారిడార్‌కు డీపీఆర్‌లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో మెట్రోరైలు సౌకర్యం ఔటర్ రింగు రోడ్డును దాటి నగర శివారు ప్రాంతాలకు అందుబాటులోకి రానుంది. హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు మొదటి దశలోని జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ మార్గంలో 11 కిలోమీటర్లు ప్రస్తుతం నగరవాసులకు అందుబాటులో ఉంది. రెండో దశలో చేపట్టబోయే జేబీఎస–శామీర్‌పేట (22 కి.మీ), ఎంజీబీఎస నుంచి చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ), చాంద్రాయణ గుట్ట నుంచి ఇన్నర్ రింగు రోడ్డు మీదుగా ఆరాంఘర్, శంషాబాద్ టౌన్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు లోపలి వరకు (35 కి.మీ), అదేవిధంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీ(ఫ్యూచర్ సిటీ) వరకు (40 కి.మీ).. ఇలా మొత్తం 115 కిలోమీటర్ల మెట్రో మార్గం ఉత్తర దిక్కున ఉన్న శామీర్‌పేట ఔటర్ రింగు రోడ్డు నుంచి దక్షిణ దిక్కున ఉన్న ఫోర్త్ సిటీతో అనుసంధానం అవుతుంది. దీంతో గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఉన్న ఔటర్ రింగు రోడ్డుకు ఉత్తరాన ఉన్న శామీర్‌పేట నుంచి సికింద్రాబాద్, ముషీరాబాద్, ఎంజీబీఎస్, చార్మినార్ మీదుగా చాంద్రాయణగుట్ట, శంషాబాద్



విమానాశ్రయం అక్కడి నుంచి ఫోర్త్ సిటీ వరకు మెగా మెట్రో కారిడార్ అవతరించనుంది. హైదరాబాద్ మహానగరంలో ఉత్తర–దక్షిణ దిక్కులను కలిపే మెగా మెట్రో కారిడార్‌లో ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్ స్టేషన్‌లు, ఎంఎంటీఎస్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగించే సికింద్రాబాద్, ఫలక్‌నుమా, బుద్వేల్, శంషాబాద్, అల్వాల్, బొల్లారం వంటి రైల్వే స్టేషన్‌లతో అనుసంధానం అవుతుంది. ఇక అత్యంత కీలకమైంది శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం. భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా విమానాల నెట్‌వర్క్ కలిగిన విమానాశ్రయంతో కూడా ఈ మెట్రో కారిడార్ కలిస్తే అన్ని రకాల ప్రజా రవాణా వ్యవస్థలు ఒకే మార్గంలో ఉండనున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్న ప్రాంతాలను కలపడమే కాకుండా నివాస, వ్యాపార వాణిజ్య కేంద్రాలను, ఔటర్ రింగు రోడ్డు ఇంటర్‌చేంజ్ కేంద్రాలను కలిపేలా మెగా మెట్రో మార్గం అందుబాటుకి వస్తే హైదరాబాద్ మహానగరంలో ప్రజా రవాణా వ్యవస్థ ముఖ చిత్రం సమూలంగా మారిపోనుంది.

# కరీంనగర్ లో ఎడిబుల్ కప్స్



కరీంనగర్, జనవరి 15: మనం కప్పులో టీ తాగుతాం. ఆ కప్పు ప్లాస్టిక్‌ది అయితే పడేస్తాం. స్టీల్ లేదా గ్లాస్ లేదా మట్టితో చేసింది అయితే.. కడిగి జాగ్రత్తగా దాచిపెట్టుకుంటాం. కానీ ఇప్పుడు తినే ఎడిబుల్ కప్స్ మార్కెట్లోకి వచ్చాయి. టీ తాగాక ఆ కప్‌ను తినేయవచ్చు. అలాంటి కప్పులు కరీంనగర్ జిల్లాలోనే తయారు చేస్తున్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం ఆధ్వర్యంలో.. అన్నారం గ్రామంలో ఎడిబుల్ టీ కప్స్ తయారీ కేంద్రాన్ని స్థాపించారు. ఇటీవల జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఓ సమావేశానికి సంఘం అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, డైరెక్టర్లు హాజరయ్యారు. అక్కడ ఎడిబుల్ కప్పులో టీ పోశారు. ఇవేవో బాగున్నాయనిపించి ఎక్కడ నుంచి తెప్పిస్తున్నారని అడిగారు. రాజమండ్రి నుంచి ఈ టీ కప్పులను సరఫరా చేసుకుంటున్నారని తెలుసుని.. వెయ్యి కప్పులకు ఆర్డర్ పెట్టారు. జిల్లాలోని ఆసుపత్రులు, బ్యాంకులు, సామాజిక వ్యక్తులు, పెద్ద పెద్ద హోటళ్ల నిర్వాహకులను కలిసి వాటిని చూపించారు. మంచి స్పందన రావడంతో.. సహకార సంఘం ఆధ్వర్యంలో అన్నారంలో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మూలధనం రూ. 3.75 లక్షలతో మిషన్‌ను, లక్ష రూపాయలతో తయారీ సామగ్రిని కొనుగోలు చేశారు. మూడు నెలల కిందట ఎడిబుల్ టీ కప్పుల తయారీ కేంద్రాన్ని ప్రారంబించారు. ఒక్క గ్లాసుకు 3.5 రూపాయలు ఖర్చవుతుండగా.. నాలుగు రూపాయలకు అమ్ముతున్నారు. కరీంనగర్, ఖమ్మం, కొత్తగూడెం, నాగర్ కర్నూల్, నల్లగొండ, సంగారెడ్డి, మహబూబ్ నగర్, పెద్దపల్లి జిల్లాల్లో హోటల్లో ఆర్డర్స్‌పై ఈ కప్పులను సరఫరా చేస్తున్నారు. ఇది రాష్ట్రంలోనే మొదటి ఎడిబుల్ కప్పుల తయారీ కేంద్రం కావడం విశేషం. కప్పులను చిరుధాన్యాలు రాగులు, మొక్కజొన్న పిండి, బియ్యంపిండి, మైదా పిండిలో తగినంత చక్కెరను కలిపి తయారు చేస్తుంటారు. రోజుకు వెయ్యి గ్లాసులను తయారు చేసేందుకు 40 కిలో పిండి అవసరముంటుంది. 10 గ్లాసులను ఒక్క ప్యాకెట్‌గా తయారు చేసి.. 40 రూపాయలకు విక్రయిస్తుంటారు. విద్యుత్ సరఫరా సక్రమంగా ఉంటే రోజుకు వెయ్యి గ్లాసులకు తయారు చేస్తారు. తయారు చేసిన గ్లాసులను ప్యాకింగ్ చేసి ఆర్డర్స్ పై సరఫరా చేస్తారు. ప్రస్తుతం ఒక్క గ్లాసుకు 50 పైసల లాభం వస్తోంది. మార్కెట్ పుంజుకుంటే అప్పుడు ధరను నిర్ణయిస్తామని నిర్వాహకులు తెలిపారు. గతంలో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీలో స్టాల్స్ ఏర్పాటు చేస్తే మంచి స్పందన వచ్చింది. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సమావేశం కాగా.. ఆయన సహకారం సంఘ పాలకవర్గాన్ని అభినందించి ప్రోత్సహించారు. ఈ కప్పులో టీ తాగడమే కాకుండా కప్పును తినవచ్చు. తినక పడేసినా అది తొందరగా భూమిలో కలిసిపోతుంది. పేపర్ గ్లాసులో టీ తాగడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. మిషన్‌లో పిండిని నింపేటప్పుడు దాని మీద పడ్డ పిండి.. గ్లాసు తయారు అయిన తర్వాత వేస్ట్ రూపంలో కిందపడుతుంది. దాన్ని ఆవులు, గేదలకు వేస్తే ఎంతో ఇష్టంగా తింటున్నాయని నిర్వాహకులు తెలిపారు. అన్నారం గ్రామంలో రైతు సహకారం సంఘం అధ్వర్యంలో మూడు నెలల కిందట టీ కప్పు తయారీ కేంద్రాన్ని నెలకొల్పామని.. త్వరగానే మార్కెట్ పుంజుకుందని రైతు సహకార సంఘం అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి చెబుతున్నారు. ప్రస్తుతం ఎనిమిది జిల్లాలకు సరఫరా చేస్తున్నామని.. ఇందులో టీ తాగడం ఆరోగ్యానికి మంచిదన్నారు. త్వరలో మొక్కజొన్న పిండి, గమ్ ఇస్తారాకుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వివరించారు.

# కనుమ వేడుకల్లో పశువులకు పూజలు



అమరావతి,జనవరి15 : తెలుగు రాష్ట్రాల్లో కనుమ వేడుకలు ఘనంగా మొదలయ్యాయి. పాడి పంటలతో పచ్చగా కళకళలాడాలని కోరుకుంటూ అన్నదాతలు గోవులకు పూజలు చేసారు. భోగి, సంకాంత్రిని సందడిగా చేసుకున్న ప్రజలు బుధవారం కనుమ హడావిడిలో ఉన్నారు. మందు, ముక్క వైపు పరుగులు పెట్టారు. దీంతో చికెన్, మటన్ షాపులకు రద్దీ పెరిగింది. తెలుగు రాష్ట్రాల్లో తెల్లవారుజాము నుంచే చికెన్, మటన్ షాపుల వద్ద నాన్ వెజ్ ప్రియులు క్యూ కట్టారు. దీంతో షాపులు పూర్తిగా రద్దీగా మారాయి. చికెన్, మటన్ షాపులతో పాటు ఫిష్ మార్కెట్స్ కూడా కిటకిటలాడుతున్నాయి. నాటు కోళ్లు, బాయిలర్ కోళ్ల కూడా భారీగా డిమాండ్ పెరిగింది. ప్రధానంగా నాటు కోళ్లను కొనుగోళ్లు చేసేందుకు నాన్ వెజ్ ప్రియులు ఆసక్తి చూపుతున్నారు. కేజీ రూ. 900 చెబుతున్నా కొనుగోళ్లు చేస్తున్నారు. మరోవైపు లైవ్ నాటు కోళ్లను కూడా అమ్ముతున్నారు. బాయిలర్ కోళ్ల మాంసాన్ని కేజీని రూ. 300 వరకూ వ్యాపారులు చెబుతున్నారు. అయినా వెనక్కి తగ్గేది లేదని కొనుగోలు చేస్తున్నారు. కనుమ పండగ సందర్భంగా నాటు కోళ్లు భారీగా అమ్ముడు పోతున్నాయని, దీంతో పూర్తిగా

## మటన్, చికెన్ ధరలకు రెక్కలు

దొరకడం లేదని మాంసం ప్రియులు వాపోతున్నారు. పండగ వేళ చేపలు ధరలు కూడా భారీగా పెరిగాయి. వ్యాపారులు మార్కెట్లో కేజీ రూ. 200 చెబుతున్నారని జనం అంటున్నారు. రేట్లు ఘోరంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీగా వచ్చిన జనాన్ని చూసి పలు చోట్ల ఇప్పటికే హౌస్ ఫుల్ బోర్డు పెట్టేశారు. తాము అంచనా వేసుకుని తెచ్చుకున్న కోళ్లు ఇంత త్వరగా అయిపోతాయని తాము ఊహించలేదని చెబుతున్నారు. తమ వద్ద ఉన్న కోళ్లను అమ్మిన తర్వాత తామూ కూడా కనుమ పండగను ఆనందంగా జరుపుకుంటామని కొందరు షాపుల యజమానులు చెబుతున్నారు. రోవైపు మద్యం ప్రియుల రద్దీ కూడా భారీగా పెరిగింది. చికెన్, మటన్ కాంబోలో ఒక్క చుక్క మద్యం కోసం ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో ఉదయం నుంచే మద్యం షాపులకు వెళుతున్నారు. భారీగా మద్యం షాపుల వద్ద క్యూ కట్టారు. దీంతో మద్యం షాపులు కూడా ఫుల్ రద్దీగా కనిపిస్తున్నాయి. ఈ ఒక్క రోజే భారీగా ఆదాయం వస్తుందని మద్యం షాపుల యజమానులు చెబుతున్నారు.



# భవన నిర్మాణ అనుమతులు మరింత సరళం

విజయవాడ,జనవరి 15,: ఏపీలో భవన నిర్మాణాలు,లే ఔట్ల అనుమతుల జారీలో నిబంధన లు సులభతరం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ బిల్డింగ్ రూల్స్ –2017, ఏపీ ల్యాండ్ డెవలప్మెంట్ రూల్స్ – 2017 లో సవరణలు చేస్తూ వేరు వేరుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా భవన, లే అవుట్ల అనుమతుల్లో మార్పులు తీసుకొచ్చినట్టు మంత్రి నారాయణ చెప్పారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పెరిగేలా కీలక సంస్కరణలతో ఉత్తర్వులు జారీ చేశామని, సంక్రాంతి కానుకగా బిల్డర్లు, డెవలపర్లు, ప్రజలకు అనుకూలంగా ఉండేలా నిబంధనలు మార్పులు జీవోలు జారీ చేసినట్టు చెప్పారు. లే అవుట్లలో వేసే రోడ్లకు గతంలో ఉన్న12 మీటర్లకు బదులు 9 మీటర్లకు కుదిస్తూ సవరణ చేశారు. 500 చ.మీ. పైబడిన స్థలాల్లో చేపట్టే నిర్మాణాల్లో సెల్లారుకు అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. టీడీఆర్ బాండ్ల జారీ కమిటీలో రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ ల ప్రమేయాన్ని తొలగిస్తున్నట్టు ప్రకటించారు. రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారులను ఆనుకుని ఉన్న స్థలాలు డెవలప్ చేసేందుకు 12 మీటర్ల మేరకు సర్వీస్ రోడ్డు విడిచిపెట్టాలనే నిబంధన తొలగిస్తున్నట్టు ప్రకటించారు. బహుళ అంతస్తుల భవనాల సెట్ బ్యాక్ నిబంధనల్లో మార్పులు చేశారు. వీటితో పాటు మరిన్ని నిబంధనలు సరళతరం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం పెరిగేలా చేసేందుకు సంస్కరణలు చేపట్టి.. ఈ నిర్ణయం తీసుకుంది. గతంలో లే అవుట్లలో రోడ్లకు గతంలో 12 మీటర్లు ఉండగా.. ఇప్పుడు దానిని 9 మీటర్లకు తగ్గించారు. అలాగే 500 చదరపు మీటర్ల పైన స్థలాల్లో నిర్మాణాన్ని సెల్లారుకు అనుమతించారు. నేషనల్ హైవే, స్టేట్ హైవేలను ఆనుకుని ఉన్న స్థలాలు డెవలప్ చేసేందుకు 12 మీటర్ల సర్వీస్ రోడ్డు ఏర్పాటు నిబంధనను కూడా తొలగించారు. బహుళ అంతస్తుల భవనాల సెట్ బ్యాక్ నిబంధనల్లో మార్పులు చేసింది ప్రభుత్వం. టీడీఆర్ బాండ్ల జారీ చేసే కమిటీ నుంచి రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్‌లను తొలగించారు. ప్రజలకు, బిల్డర్లు, డెవలపర్లకు అనుకూలంగా ఉండేలా నిబంధనల్లో మార్పులు చేస్తూ వేర్వేరు జీవోలు జారీ చేసినట్లు మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ తెలిపారు. నిబంధనల్ని సులభతరం చేశామని.. అందరితో చర్చించి ఈ నిబంధనలు జారీ చేశామన్నారు. సంక్రాంతి కానుకగా ఈ జీవోలను తీసుకొచ్చామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు, బిల్డర్లు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు మంత్రి నారాయణ. కూటమి ప్రభుత్వం ఆ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అపార్ట్‌మెంట్లు, లే అవుట్‌లలో కొనుగోలుకు సంబంధించి వినియోగదారులు మోసపోకుండా రెరా అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు మంత్రి నారాయణరియల్ ఎస్టేట్ అసోసియేషన్ ల ప్రతినిధులతో చర్చించి తుది నిబంధనలు జారీ చేసినట్టు మంత్రి నారాయణ వివరించారు. తాజా ఉత్తర్వులతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం వేగం పుంజుకుంటుందని చెప్పారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని గత ఐదేళ్లలో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతిందని దానిని తిరిగి గాడిన పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. భవన నిర్మాణాలు, లే అవుట్లు అనుమతులను సులభతరం చేస్తూ జీవో లు జారీ చేసినట్టు వివరించారు. రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, భవన నిర్మాణాల కోసం ఆఫీసుల చుట్టూ తిరిగే పని లేకుండా సింగిల్ విండో విధానం అమల్లోకి తెస్తున్నట్టు తెలిపారు. మార్చి నాటికి సింగల్ విండో విధానం అమల్లోకి వస్తుందని చెప్పారు. ప్రతి ఏటా రెండు సార్లు రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ల ప్రతినిధులతో సమావేశం అవుతానని మంత్రి నారాయణ చెప్పారు. నిర్మాణ రంగానికి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# సొంత క్యాడర్ నుంచి చికాకులు

విజయవాడ, జనవరి 15: తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు ఆర్నెల్లుగా ప్రధాన ప్రతిపక్షం వైసీపీ నుంచి పెద్దగా చికాకులు ఎదురు కాలేదు. ఒకటి రెండు సందర్భాలు వచ్చినా వాటిని సులువుగానే టీడీపీ అధినేత అధిగమించగలిగారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీ అధ్యక్షుడు ప్రభుత్వం మీద దూకుడుగా వెళ్లాలని ప్రయత్నించినా ఆ పార్టీ క్యాడర్ పెద్దగా స్పందించలేదు. అధికార పార్టీతో ఎందుకొచ్చిన గొడవ అనుకుని నేతలు కూడా సైలెంట్ అయిపోయారు. సొంత డబ్బులు ఖర్చు పెట్టాల్సి వస్తుందని చాలా మంది అజ్ఞాతంలోకి జారుకున్నారు. వైసీపీ నుంచి సోషల్ మీడియాలో తప్ప బయట పెద్దగా ప్రతిఘటన లేకపోవడం, ఆ తర్వాత సోషల్ మీడియా దుష్ప్రచారాలను కట్టడి చేయడానికి పెద్ద ఎత్తున పోలీస్ కేసులు నమోదు కావడంతో ప్రత్యర్థుల నుంచి ఆ దూకుడు కూడా తగ్గిపోయింది. ఈ క్రమంలో హుషారుగా ఉండాల్సిన టీడీపీ అధినేతకు సొంత క్యాడర్ నుంచి చికాకులు ఎక్కువయ్యాయి. సోషల్ మీడియాలో ప్రత్యర్థుల కంటే సొంత పార్టీ నాయకులు, పార్టీ అభిమానులు, ప్రతిపక్షంలో ఉండగా టీడీపీని భుజాన మోసిన కార్యకర్తలు సోషల్ మీడియా వేదికలపై చెలరేగిపోతున్నారు. టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్టుల్లో చాలామంది తాము అధికారంలో ఉన్నామనే సంగతి మరిచి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాలు, సంకీర్ణ ధర్మంలో భాగంగా తీసుకున్న విధానపరమైన అంశాలను కూడా తప్పు పడుతున్నారు. ఐదేళ్ల పాటు టీడీపీ నినాదాల్ని, వాదనల్ని సమర్థవంతంగా వినిపించిన క్యాడర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కూడా కాక ముందే అసంతృప్తి గళాలను వినిపిస్తున్నారు. కొద్ది మంది వైసీపీని నిందించే క్రమంలో టీడీపీనే తప్పు పడుతున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉన్న సంగతి మరిచి ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. కొద్ది నెలలుగా టీడీపీ క్యాడర్‌లో ఈ తరహా అసంతృప్తి పెరిగిపోతోంది. పార్టీ అధి నాయకత్వం తమను నిర్లక్ష్యం చేస్తోందనే భావన కార్యకర్తలు, దిగువ శ్రేణి నాయకుల్లో ఉంది. వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులకు గురైన వారు బదులు తీర్చుకోవాలని తహతహలాడుతున్నారు. ఈ క్రమంలో అలాంటి చర్యలు వద్దని ముఖ్యమంత్రి పదేపదే వారించడం వారికి రుచించడం లేదు. వైసీపీ పంథాలో సాగితే తే?డా ఏముంటుందని, రాష్ట్ర ప్రయోజనాలు అభివృద్ధిపై దృష్టి సారించాలని నచ్చచెప్పే ప్రయత్నాలు వారికి రుచించడం లేదు. ఇక టీడీపీ అనుకూల మీడియాలో సైతం ప్రభుత్వాన్ని ఇరుకున పడేసే కథనాలతో చంద్రబాబు సతమతం అవుతున్నారు. తమ వారనుకునే వారి నుంచి ఎదురవుతున్న విమర్శలు, కథనాలతో చంద్రబాబు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రస్తుతం ఏపీలో బీజేపీ–జనసేనలతో కలిసి టీడీపీ ప్రభుత్వాన్ని నడుపుతోంది. విధానపరమైన నిర్ణయాలను మూడు పార్టీలు కలిసి తీసుకోవాల్సి వస్తోంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, డిప్యూటీ సీఎం జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఏపీ ప్రభుత్వంలో ముఖ్య నాయకుడిగా నారా లోకేష్ వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో చాలా వరకు ఆయన భాగస్వామ్యం ఉంటోంది. చంద్రబాబు రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకునే క్రమంలో లోకేష్ క్రియాశీలకంగా ఉన్నారు. ప్రభుత్వ శాఖలపై పట్టు సాధించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే చంద్రబాబు తర్వాత టీడీపీ పగ్గాలు ఏదొ? ఒక సమయంలో లోకేష్ అందిపుచ్చుకోవాల్సి ఉంటుందనే అంచనా అందరిలో ఉంది. అదే సమయంలో టీడీపీ తీరుపై ఆ పార్టీ క్యాడర్ చేస్తోన్నవిమర్శలు, లోపాలను ఎత్తి చూపే క్రమంలో ప్రభుత్వాన్ని నిందిస్తున్న తీరు టీడీపీకి మేలు కంటే చేటు ఎక్కువగా చేస్తున్నాయి. ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లేందుకు సోషల్ మీడియాను వాడుకోవడం మొదలైన తర్వాత అన్ని రాజకీయ పార్టీలు గత పదేళ్లుగా సోషల్ మీడియాను విస్తృతంగా వాడుతున్నాయి. సోషల్ మీడియా వినియోగంలో సీబీఎన్ ఆర్మీ పేరిట ఐటీ ప్రొఫెషనల్స్ 2014 ముందు నుంచి విస్తృతంగా పనిచేస్తున్నారు. స్వచ్ఛంధంగా చాలామంది చంద్రబాబు కోసం ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలపై కాంపెయిన్ చేస్తున్నారు. 2019లో టీడీపీ ఓటమి పాలై తిరిగి పుంజుకోడానికి కూడా సోషల్ మీడియా బలంగా పనిచేసింది. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపక్ష పాత్ర నుంచి ప్రభుత్వంలో ఉన్నామనే స్పృహలోకి రావడంలో టీడీపీ అనుకూల సోషల్ మీడియా కన్ఫ్యూజ్ అయినట్టు కనిపిస్తోంది. ఇప్పటికీ విధానపరమైన అంశాల్లో లోపాలకు ఆర్నెల్ల క్రితం అధికారం పోగొట్టుకున్న వైసీపీని నిందించే పనిలోనే ఉన్నారు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను తప్పు పట్టడంలో వారే ముందు ఉంటున్నారు. మద్యం విక్రయాలు, ఇసుక, బ్యూరోక్రసీ, ప్రభుత్వ సేవలు, విద్యా వైద్యం వంటి అంశాల్లో సొంత పార్టీ వారి నుంచి పలు సందర్భాల్లో విమర్శలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం తమకు నచ్చని ఏ పని చేసినా విమర్శించడానికి వెనుకాడటం లేదు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అధికారుల నియామకాలు, పోస్టింగుల నుంచి ప్రమోషన్లు, బదిలీల వరకు ప్రతి అంశాన్ని తప్పు పట్టడం మొదలైంది. ప్రతి ఒక్కరు సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో చంద్రబాబు నిర్ణయాలను నేరుగా విమర్శించడం సాధారణమై పోయింది. ఈ క్రమంలో వారికి తెలియకుండానే చంద్రబాబును కార్నర్ చేస్తున్నామనే సంగతి మరిచి పోతున్నారు. ఐఏఎస్ అధికారుల పోస్టింగులు, గత ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన వారిని తిరిగి ప్రభుత్వంలో చేర్చుకోవడం, ఆరోపణలు ఉన్న వారికి పోస్టింగులు ఇవ్వడం, తమను వేధించిన పోలీసులకు కీలక స్థానాల్లో బాధ్యతలు అప్పగించడం వంటి నిర్ణయాలను సోషల్ మీడియా వేదికలపై తూర్పారబడుతున్నారు. గత ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఎక్కువగా బెంగుళూరులోనే గడుపుతున్నారు. తాడేపల్లి నివాసంలో అడపాదడపా సమీక్షలు చేస్తున్నారు. జనవరి చివరి నుంచి జిల్లా పర్యటనలు చేపట్టనున్నారు. టీడీపీలో జరుగుతున్న పరిణమాలు ఖచ్చితంగా జగన్మోహన్ రెడ్డికి సంతోషం కలిగిస్తుండవచ్చు. ఆర్నెల్లలో జగన్ పెద్దగా బయటకు రాకపోయిన ప్రభుత్వం పై ఎంతో కొంత వ్యతిరేకత రావడానికి టీడీపీ వర్గీయులే ఎంతో కొంత కారకులు కావడం జగన్‌కు కలిసి వస్తుంది. ఈ క్లారిటీ టీడీపీ వర్గీయులకు రాకపోతే మున్ముందు సమస్య తీవ్రం కావొచ్చు.

### రామగిరి మండలంలో ఘనంగా సంక్రాంతి కనుమ వేడుకలు

కమాన్ పూర్ జనవరి 15: రామగిరి మండలం లో మంగళ, బుధ వారాలలో ఘనంగా సంక్రాంతి,కనుమ వేడుకలు జరిగాయి. ఆయా గ్రామాలలో దేవాలయాలలో పూజలు నిర్వహించారు. మహిళలు ఇండ్లలో వ్రతాలు నిర్వహించారు. కనుమ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు ఒకరింటికి ఒకరు వెళ్లి కుంకుమ బొట్టు పెట్టుకుంటూ, నోముకున్న వస్తువులను అందించి, కుటుంబం సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. బంధువులు, చుట్టాలతో ప్రతి ఇంటింటా సంబరాలు ఘనంగా జరిగాయి.



# క్యూ ఆర్ కోడ్ లో రేషన్ కార్డులు



కర్నూలు, జనవరి 15,: ఏపీలో త్వరలోనే నూతన రేషన్ కార్డులు అందుబాటులోకి రానున్నాయి. నవ దంపతులకు కొత్త కార్డులు జారీ చేయనుండగా, పేర్ల మార్పు చేర్పులకు అవకాశం కల్పిస్తూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు రాజకీయ పార్టీల రంగులతో ఇచ్చిన రేషన్ కార్డులకు చరమగీతం పాడడంతో పాటు అత్యాధునిక కార్డులను అందించేందుకు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ సన్నాహాలు ప్రారంభించారు.ఆరునెలల పాలనా కాలంలో క్రమంగా అధికార యంత్రాంగాన్ని గాడిన పెడుతూ వస్తున్న కూటమి ప్రభుత్వం.. క్రమంగా ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ వస్తోంది. అందులో భాగంగా పౌర సరఫరాల శాఖలోని అవినీతిపై పెద్ద ఎత్తున దాడులు చేస్తూ.. అక్రమార్కుల ఆట కట్టించింది. ఇక ఇప్పుడు.. నూతన లబ్ధిదారుల ఎంపిక, వారికి జారీ చేయనున్న కార్డుల విషయమై కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్ని నెలలుగా రాష్ట్రంలో రేషన్ కార్డుల జారీ ఆగిపోగా.. అనేక మంది లబ్దిదారులకు కార్డులు జారీ కాలేదు. అలాంటి వారందరికీ ఇప్పుడు.. సరికొత్త కార్డులు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.కొత్తగా పెళ్లైన దంపతులకు, రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్ల మార్పులు, చేర్పులకూ అవకాశం కల్పించనున్నారు. ఇందు కోసం.. ప్రత్యేకంగా.. ఆన్ లైన్ పోర్టల్ ప్రారంభించనున్నారు. అందుబాటులోని సాంకేతికతను వినియోగించుకుని.. ఇకపై రేషన్ కార్డుల్ని క్రెడిట్ కార్డుల తరహాలో క్యూఆర్ కోడ్ లతో జారీ చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే.. సన్నాహాలు కూడా పూర్తయ్యాయి. ఈ నెల చివర్లో కానీ, వచ్చే నెల ప్రారంభంలో కానీ.. రాష్ట్ర వ్యాప్తంగా కార్డుల్ని జారీ ప్రక్రియ మొదలు పెట్టనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు.కార్డులపై క్యూఆర్ కోడ్ ఉండనుండగా.. అందులో కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాలు ఉండనున్నాయి. రేషన్ పంపిణీ సమయంలో ఆ కోడ్ ను స్కాన్ చేస్తే పూర్తి వివరాలు తెలిసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ఈ ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపితే.. వెంటనే కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ప్రస్తుతం.. అధికార యంత్రాగం, ప్రభుత్వం వివిధ పనుల్లో బిజీబిజీగా గడుపుతోంది. తీరికలేని హడావిడిలో ఉండడంతోనే.. కార్డుల ఆమోదం, జారీ ప్రక్రియ ఆలస్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు.ప్రభుత్వం హయంలో కొత్తగా పెళ్లైన వాళ్లకు వెనువెంటనే రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించారు. కానీ.. కొన్ని నెలలకే ఆ విధానాన్ని పక్కన పెట్టేశారు. ఆరునెలలకు ఓ సారి మాత్రమే కొత్త కార్డులు జారీ చేస్తామని ప్రకటించారు. దాంతో.. రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా మంజూరు చేయాల్సిన కొత్త కార్డులు చాలానే మిగిలిపోయాయి. ఈసారి వాటిని జారీ చేయడంతో పాటు వెనువెంటనే నూతన దంపతులకు కార్డులు మంజూరు చేసే అవకాశాన్ని కల్పించనున్నట్లు సమాచారంరాష్ట్రంలోని చాలా రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు తప్పుల తడకగా మారాయి. దాంతో.. అనేక పథకాల లబ్ధిదారులు నష్టపోతున్నారు. పేర్లు తేడాగా ఉంటున్న కారణంగా చాలా పథకాలకు అనుసంధానించేందుకు వీలు కావడం లేదు. పైగా..ఆన్ లైన్ విధానాన్ని సైతం ఆపేయడంతో.. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి. ఈ సమస్యలన్నింటినీ ఈ సారి నూతన కార్డుల జారీ సమయంలో పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1.48 కోట్ల రేషన్ కార్డులు ఉండగా.. 3.36 లక్షల రేషన్ కార్డు సమస్యలు పెండింగ్ లో ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. వీటిలో.. 70 వేలకు పైగా నవదంపతుల నుంచి అందిన దరఖాస్తులుగా చెబుతున్నారు. కార్డుల్లో విభజన కోసం 46 వేలకు పైగా, కొత్త సభ్యుల చేరికలకు 2 లక్షల 13 వేలు, సభ్యులను తొలగించేందుకు 36 వేలు, అడ్రస్ మార్పుల కోసం 9 వేలకు పైగా దరఖాస్తులు అందగా.. రేషన్ కార్డుల్ని సరెండర్ చేసేందుకు 685 మంది సిద్ధంగా ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇలా.. అన్ని రకాలుగా చూస్తే మరో 2 లక్షల రేషన్ కార్డులు ఇవ్వాల్సి వస్తుందని అధికారుల అంచనా. దాంతో.. రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.50 కోట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

# నేషనల్ హైవేలు, రాష్ట్ర రహదారులపై ఫోకస్



కడప, జనవరి 15,: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేషనల్ హైవేలు, రాష్ట్ర రహదారులపై ఫోకస్ పెట్టింది. కొత్త ప్రాజెక్టులతో పాటుగా గతంలో అనుమతులు వచ్చిన వాటి పనుల్ని వేగవంతం చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించి కీలకమైన బెంగళూరు–కడప–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు స్పీడ్ అందుకున్నాయి. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే పనుల్ని 2026నాటికి పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు.. ఈ మేరకు పనులు కొనసాగుతున్నాయి. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేతో అమరావతి నుంచి బెంగళూరుకు కనెక్టివిటీ ఉంటుంది. విజయవాడ నుంచి వెళ్లాలంటే గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం, కడప మీదుగా వెళ్లొచ్చు. అలాగే గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి మీదుగా బెంగళూరుకు వెళ్లొచ్చు.కేంద్రం నేషనల్ హైవేల నిర్మాణంలో భాగంగా బెంగళూరు–కడప–విజయవాడకు కొత్తగా హైవే కనెక్టివిటీ ఉండాలని భావించింది. అందుకే రెండేళ్ల క్రితం ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేకు రూ.1930 కోట్ల అంచనాతో గ్రీన్ సిగ్నల్ రావడంతో పనులు ప్రారంభమయ్యాయి. ఈ హైవేకు సంబంధించి.. విజయవాడ నుంచి బాపట్ల జిల్లా జే.పంగులూరు మండలం ముప్పవరం వరకు 113 కి.మీ జాతీయ రహదారులతో ఈ గ్రీన్ ఫీల్డ్ వేను కనెక్ట్ చేయనున్నారు. అలాగే బెంగళూరు నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా కొడికొండ వరకు ఉన్న 73 కి.మీ కూడా జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తారు. మొత్తం 529 కిలో మీటర్ల దూరం మార్గంలో ఇప్పటికే రెండు వైపులా ఉన్న రెండు నేషనల్ హైవేల 186 కి.మీ. మినహా మరో 343 కిలోమీటర్లు పనులు చేపట్టాల్సి ఉంది.బెంగళూరు–కడప–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేను 14 భాగాలుగా చేశారు. బాపట్ల జిల్లా జే.పంగులూరు మండలం ముప్పవరం నుంచి తాళ్లూరు మండలం తూర్పు గంగవరం వరకు నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. బాపట్ల జిల్లాలో 10 కిలోమీటర్లు, ప్రకాశం జిల్లాలో 18.5 కిలోమీటర్లు ఈ పనులు జరుగుతున్నాయి. ఈ హైవే పొడవునా ఎక్కడా కట్టడాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే ఈ గ్రీన్‌ఫీల్డ్ వేకు సంబంధించి భూములు కోల్పోయిన వారికి పరిహారం కూడా చెల్లించారు. ఈ వే వెంట ఉన్న ప్రతి ఊరికి బ్రిడ్జి ఏర్పాటు చేస్తు?నారు. అలాగే గుండ్లకమ్మ నదిపై బాపట్ల జిల్లా అద్దంకి మండలం వేలమూరిపాడు–మణికేశ్వరం మధ్యలో 360 మీటర్ల పొడవున భారీ బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ వే నిర్మాణం పూర్తయితే అమరావతి నుంచి బెంగళూరు త్వరగా వెళ్లొచ్చు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి నుంచి హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు కనెక్టివిటీని పెంచేందుకు సిద్దమైంది.. ఈ మేరకు హైవే ప్రాజెక్టు పనులు వేగవంతం చేసింది.

# ఐదు జిల్లాల్లో కరువు పరిస్థితులు

కర్నూలు, జనవరి 15,: ఆంధ్రప్రదేశ్‌లో గత ఏడాది నెలకొన్న ఖరీఫ్ కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసిన కేంద్ర నుంచి సాయం అందించే విషయంలో ఉదారంగా స్పందించాలని ఏపీ రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్, ఆర్పీ సిసోడియా కోరారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులను రెవిన్యూ కార్యదర్శి సిసోడియా కేంద్ర బృందానికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు జిల్లాల్లోని 54 మండలాల్లో గత ఏడాది కరువు పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. అన్నమయ్య జిల్లాలో – 19మండలాలు, చిత్తూరులో – 16 మండలాలు, శ్రీ సత్య సాయిలో – 10 మండలాలు, అనంతపురంలో – 7 మండలాలు, కర్నూలులో – 2 మండలాలను ఇప్పటికే ఇప్పటికే కరువు మండలాలు ప్రకటించారు. వాటిలో 27 తీవ్ర కరువు మండలాలు, 27 మధ్యస్థ కరువు మండలాలుగా సిసోడియా పేర్కొన్నారు.కేంద్ర కరువు మాన్యువల్ ప్రకారం సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం, వర్షాభావంతో అత్యధిక డ్రైస్పెల్స్, రిమోట్ సెన్సింగ్, సాయిల్ మోయిశ్చర్, హైడ్రాలజీ, పంట నష్టం 33% అంతకంటే ఎక్కువ ఉన్న మండలాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం కరువు ప్రాంతాలను ప్రకటించిందని వివరించారు.కరువు ప్రభావంతో పత్తి, జొన్న, వేరుశెనగ, ఎర్ర శనగలు, మొక్కజొన్న మొదలైన 14 రకాల పంటలు దెబ్బతిని ఐదు జిల్లాల్లోని 1.06లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 1.44 లక్షల మంది రైతులు నష్టపోయారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సుమారు 1 లక్ష మంది రైతులకు రూ.16.67 కోట్ల వ్యయంతో సుమారు 1 లక్ష మంది రైతులకు 80% సబ్సిడీపై విత్తనాలు, రూ.55.47 కోట్ల వ్యయంతో పశుగ్రాసం, పశుగ్రాస విత్తనాల సరఫరా, 60% సబ్సిడీపై , 40% సబ్సిడీపై చాఫ్ కట్టర్లు, మందుల సరఫరా వంటి ఉపశమన చర్యలు చేపట్టినట్లు కేంద్ర బృందానికి సిసోడియా వివరించారు.వ్యవసాయ శాఖ ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రూ. 90.62కోట్లు, రూరల్ వాటర్ సప్లై రూ. 0.78 కోట్లు, అర్బన్ వాటర్ సప్లై రూ. 4.89 కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.55.47 కోట్లు ఆర్థిక సహాయం అవసరమన్నారు. క్షేత్రస్థాయిలో కరువు నష్టానికి సంబంధించి వాస్తవిక వివరాలను అందించామని, రైతులను ఆదుకోడానికి సత్వరమే రూ.151.77 కోట్లు సాయం చేయాలని కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు.అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లోని కరువు మండలాల్లో రైతులతో మాట్లాడి వాస్తవ పరిస్థితులను గమనించామని తమ నివేదికలో కేంద్రానికి అన్ని విషయాలను సమగ్రంగా తెలుపుతామని అన్నారు. జిల్లాల్లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ కరువు పరిస్థితుల తెలియజేశాయని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతులు కరువు వల్ల తమకు జరిగిన నష్టాన్ని వివరించారని చెప్పారు. త్వరగా కమిటీ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించి వీలైనంత మేర ఆదుకోవడానికి తమవంతు సహకారాన్ని అందిస్తామని పెరిన్ దేవి స్పష్టం చేశారు.

# కొలికపూడి సంగతేంటీ...

విజయవాడ, జనవరి 15,: తెలుగుదేశం పార్టీ అత్యంత క్రమశిక్షణ కలిగిన పార్టీ. ప్రాంతీయపార్టీ కావడంతో అధినేత ఆగ్రహానికి గురి కాకూడదని ఎవరైనా భావిస్తారు. కానీ ఈ టర్మ్ లో మాత్రం ఎమ్మెల్యేలు మాత్రం నోరు జారిపోతున్నారు. తాడిపత్రిలో షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న జేసీ ప్రభాకర్ రెడ్డి ప్రతి రోజూ ఏదో ఒక వివాదాస్పద వ్యాఖ్యలు చేసి కూటమి పార్టీలకు తలనొప్పిగా తయారయ్యారు. మూడు పార్టీల్లోనూ ఇబ్బందికరమైన పరిస్థితులను ఎమ్మెల్యేలు సృష్టిస్తున్నారు. కానీ అధినాయకత్వం ఏ చర్యలు తీసుకోలేకపోతుంది. ఆదోని బీజేపీ ఎమ్మెల్యే పార్థసారథి ఆ పార్టీ లైన్ కు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. జనసేనలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానానాజీ ఏదో ఒక వివాదంలో చిక్కుకుంటున్నారు. ఇక టీడీపీలో కృష్ణాజిల్లాలోని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కూడా అంతే. ఆయనను కట్టడిచేయడం ఎవరి వల్ల కావడం లేదు. తొలిసారి గెలిచిన కొలికపూడి శ్రీనివాసరావు సొంత పార్టీ నేతలను ఇబ్బంది పెడుతున్నారు. అమరావతి రాజధాని ఉద్యమంలో పాల్గొని చంద్రబాబుకు దగ్గరై కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు టిక్కెట్‌ను సంపాదించారు. చివరకు సీనియర్ నేతలు జవహర్‌ను కూడా పక్కన పెట్టి కొలికపూడికి చంద్రబాబు టిక్కెట్ ఇచ్చారు. కొలికపూడి శ్రీనివాసరావు ఎమ్మెల్యే అయిన వెంటనే తన వైఖరిని పూర్తిగా మార్చారు. సొంతపార్టీ నేతలనే వేధింపులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. తిరువూరు నియోజకవర్గంలో ఒక ఇంటిని కూల్చివేయడానికి తానే కుర్చీ వేసుకుని కూల్చేందుకు చేసిన ప్రయత్నం కూడా విమర్శలకు దారి తీసింది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొలికపూడి శ్రీనివాసరావును పిలిచి క్లాస్ పీకినట్లు వార్తలు వచ్చాయి. ఇక ఇటీవల కొలికపూడి కమ్మ సామాజికవర్గం నేతలపై చేసిన వ్యాఖ్యలు పెద్దదుమారమే రేపాయి. తిరువూరులో తక్కువ శాతం ఉన్న కమ్మ సామాజికవర్గం నేతల ఆధిపత్యం ఏంటని ఆయన బహిరంగంగానే ప్రశ్నించారు. అన్నిపదవులు, ప్రధానమైనవన్నీ కమ్మవారికే కావాలంటే ఎలా? అని ప్రశ్నించారు. టీడీపీ గెలుపునకు కారణమైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పదవులు ఎలా వస్తాయని, కమ్మోళ్లను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని కూడా ఆయన గట్టిగా కృష్ణా జిల్లాలో ప్రశ్నించడంతో ఆయన వైఖరిపై తెలుగుదేశంపార్టీ అధినాయకత్వం గుర్రుగా ఉంది. కొలికపూడి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ విషయాన్ని తిరువూరులోని ముఖ్య నేతలతో పాటు కమ్మ సామాజికవర్గం నేతలు కూడా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. లోకేష్ కూడా ఆయన వైఖరిని తప్పుపట్టినట్లు చెబుతున్నారు. తాజాగా తిరువూరు నియోజకవర్గంలోని గొపాలపురంలో ఒక రహదారికి సంబంధించి ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తలదూర్చారు. వారిలో ఒక వర్గానికి అండగా నిలబడ్డారు. అయితే ఎమ్మెల్యే కొలికపూడి తమను కొట్టి అవమానపర్చారంటూ భూక్యా చంటి పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. వైసీపీ వార్డు సభ్యురాలిగా ఉన్న భూక్యాచంటిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో ఎమ్మెల్యే తలదూర్చి పార్టీకి తలనొప్పిగా మారారంటున్నారు. అయితే భూక్యాచంటికి ప్రమాదం తప్పిందని వైద్యులు చెప్పారు. దీనిపై కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు అందింది. ఈ వివాదానికి సంబంధించి కొలికపూడి నుంచి వివరణ తీసుకోవాలని చంద్రబాబు పార్టీనేతలను ఆదేశించారు. మొత్తం మీద ఎమ్మెల్యే కొలికపూడి పార్టీకి తలనొప్పిగా తయారయ్యారు. ఆయనకు ఎన్నిసార్లు చెప్పినా ఆగేట్లు లేదని, ఆయనను వదిలించుకోవడమే మేలన్న అభిప్రాయం పార్టీ అధినాయకత్వంలో మొదలయిందంటున్నారు.

# పండుగ వేళ రెండు కుటుంబాల్లో విషాదం

తిరుపతి: సంక్రాంతి పండుగ వేళ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. వేర్వేరు ఘటనల్లో ఇద్దరు బాలురు మృతి చెందడంతో ఆ కుటుంబాల్లో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. చంద్రగిరి పట్టణం బీడీ కాలనీకి చెందిన సమీర్ అనే బాలుడు మరో స్నేహితుడితో కలిసి గాలిపటం ఎగురవేస్తుండగా, ప్రమాదవశాత్తు బాలుడు కిందపడటంతో గాయపడ్డాడు. దీంతో గాయపడిన ఆ బాలుడిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో గాయపడిన బాలుడి పక్కనే ఉన్న సమీర్ను మేనమామ కోపంతో గదిలో పెట్టి గొళ్లెం వేశాడు. మళ్లీ తిరిగి వచ్చిన తర్వాత కొడతాడన్న భయంతో సమీర్(12) గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అన్నమయ్య జిల్లామదనపల్లె గ్రామంలో ఓ బాలుడు గాలిపటం ఎగురవేస్తున్న క్రమంలో కరెంటు షాక్ కొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటనలతో పండుగ పూట ఆ బాలుర కుటుంబాల్లో విషాదం నెలకొంది.

# బృందావన్ లో బస్సు దగ్ధం

## నిర్మల్ వాసి సజీవ దహనం

నిర్మల్: ఉత్తర్ ప్రదేశ్ బృందావన్ లో జరిగిన బస్సు ప్రమాదం ఘటనలో నిర్మల్ జిల్లావాసి సజీవ దహనం అయ్యాడు. ఆగివున్న బస్సులో మంటలు చెలరేగడంతో కుబీర్ మండలం పల్సికి చెందిన శీలం దుర్పతి(70) అనే వృద్ధుడు సజీవదహనం అయ్యాడు. ఈనెల 1న తీర్థయాత్రలకు భైంసా నుంచి 50మంది ప్రయాణికులు బయలుదేరాడు. బృందావన్ లో దర్శనానికి భక్తులు వెళ్లిన తరువాత అగ్నిప్రమాదం జరిగింది. వృద్ధుడు అనారోగ్యంతో బస్సులోనే ఉండిపోయాడు. మృతుని భార్య మిగతా భక్తులతో దర్శనం కోసం ఆలయానికి వెళ్లింది. ఘటనలో సహా ప్రయాణికుల సామగ్రి, డబ్బులు, బట్టలు, బ్యాగులు కాలి బూడిదయింది. దాంతో యాత్రికులు కట్టుబట్టలతో మిగిలిపోయారు. యాత్రికులకు దుప్పట్లు, ఆహారం, వసతి, ట్రాన్స్పోర్ట్ లను ఆర్.ఎస్.ఎస్, యూపీ పోలీసులు ఏర్పాటు చేసారు.

# అన్ని పార్టీలు బల్దియాపై గురి...

హైదరాబాద్, జనవరి 15,: హైదరాబాద్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇప్పటి నుంచే ఎత్తుకు పైఎత్తులు వేస్తోంది.ఎట్టి పరిస్థితుల్లో హైదరాబాద్ మేయర్ పీఠం కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ ఉవ్విళ్లూరుతుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ పరిధిలోని సీట్లన్నీ గెలుచుకున్న బీఆర్ఎస్..అదే సత్తా చూపించి ఉఊఓఅ ఎన్నికల్లో కూడా పైచేయి సాధించాలని ప్లాన్ చేస్తోంది. అర్బన్ ఏరియాల్లో పట్టున్న బీజేపీ ఈసారి బల్దియా ఎన్నికలపై పెద్ద కసరత్తే చేస్తోంది. ఇక పాత పట్నంలో బలంగా ఉన్న ఎంఐఎం మేయర్ పీఠం విషయంలో కింగ్ మేకర్‌గా ఉండేందుకు తన వంతు ప్రయత్నాలు చేస్తూనే ఉంది.అధికారంలోకి వచ్చినప్పటి నుంచే కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌పై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి..గ్రేటర్ హైదరాబాద్‌లో పొలిటికల్ వ్యవహారాలను తన కంట్రోల్‌లోకి తెచ్చుకునేందుకు వ్యూహాలు రచిస్తూనే ఉన్నారు. హస్తం పార్టీ హైదరాబాద్‌లో బలహీనంగా ఉండటంతో..గ్రేటర్ పరిధిలోని కొంతమంది నేతల చేరికలతో బలోపేతం చేసే ప్రయత్నం చేశారు. ఉఊఓఅ మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు ఇప్పటికే హస్తం గూటికి చేరారు.మేయర్ పీఠాన్ని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ డెవలప్‌మెంట్‌పై ఫోకస్ పెట్టారు సీఎం రేవంత్. బడ్జెట్‌లో ప్రత్యేకంగా 10 వేల కోట్లు కేటాయించి..మూసీ సుందరీకరణ వంటి అంశాలతో ముందుకు వెళ్తున్నారు. మరోవైపు పొలిటికల్‌గా కూడా..ఆచితూచి వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్‌లో ఎంఐఎం సపోర్ట్ లేనిదే వర్కౌట్ అయ్యే పనికాదనే ఆలోచనతో..వారితో సఖ్యతగా ఉంటున్నారు. ఎంఐఎంతో కలుపుకొని వెళ్లే దిశగా అడుగులు వేస్తున్నారు.ఇప్పటికే పార్టీ క్యాడర్‌ను కూడా అప్రమత్తం చేసే దిశగా..పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వరుస సమీక్షలు చేస్తున్నారు.గ్రేటర్ హైదరాబాద్‌లో మొత్తం 150 డివిజన్లకు గాను..40 డివిజన్లకుపైగా ఓల్డ్ సిటీలోనే ఉంటాయి. ఇవన్నీ కూడా ఎంఐఎంకు కంచుకోటగా ఉంటాయి. మ్యాజిక్ ఫిగర్ 75ను అందుకోవాలంటే కాస్త కష్టమయ్యే పనే. అందుకే అవసరమైతే ఎన్నికల ఫలితాల తర్వాత ఎంఐఎంతో కలిసి అయినా సరే మేయర్ పీఠం దక్కించుకోవాలని కాంగ్రెస్ గట్టి కసరత్తు చేస్తుంది.ఇక రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ కూడా వ్యూహ ప్రతి వ్యూహాలకు పదును పెడుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యే స్థానాలన్నింటినీ బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో నగర ఓటర్లు కచ్చితంగా తమవైపే ఉంటారని ఆశలు పెట్టుకుంటుంది.ఒకవేళ మేయర్ పీఠం దక్కకపోయినా..కింగ్ మేకర్‌గా ఉండాలని ఆలోచనలో బీఆర్ఎస్ ఉంది. ఇక మరో ప్రధాన పార్టీ బీజేపీ గ్రేటర్ హైదరాబాద్ పీఠంపై గంపెడు ఆశలు పెట్టుకుంది. గత ఎన్నికల్లో చెప్పుకోదగ్గ ఫలితాలు సాధించిన కమలం పార్టీ..ఈసారి మరింత గట్టిగా పనిచేసి..గతంలో కంటే ఎక్కువ సీట్లు సాధించాలని చూస్తోంది.ఉఊఓఅ ఎన్నికల్లో ఏ పార్టీకి మ్యాజిక్ ఫిగర్ సీట్లు రాకపోతే..మేయర్ పీఠం విషయంలో హంగ్ తప్పనిసరి. అప్పుడు కాంగ్రెస్, ఎంఐఎం ఒకటైతే.. అనివార్యమైతే బీఆర్ఎస్, బీజేపీ చేతులు కలిపే అవకాశం లేకపోలేదనే చర్చ పొలిటికల్ సర్కిల్‌లో జరుగుతోంది. ఎన్నికల తర్వాత వచ్చే సీట్లను బట్టి పొలిటికల్ పార్టీల స్టాండ్ మారే అవకాశం ఉంది.ఇప్పటికైతే కాంగ్రెస్, ఎంఐఎం ఒకే దారిలో నడుస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎడమొహం, పెడమొహంగా ఉన్న బీఆర్ఎస్, బీజేపీలు ఉఊఓఅ ఎన్నికల ఫలితాల తర్వాత హంగ్ వస్తే మాత్రం..మేయర్ పీఠం కోసం ఒకటి కాక తప్పదన్న చర్చ జరుగుతోంది. చూడాలి మరి మేయర్ పీఠం దక్కించుకునే విషయంలో ఏ పార్టీ అప్పర్ హ్యాండ్ సాధిస్తుందనేది.



## ఎట్టకేలకు తీవ్ర ప్రతిగఘటనల మధ్య దక్షిణ కొరియా అధ్యక్షుడు అరెస్టు

సియెోల్ జనవరి 15: అభిశంసనకు గురైన దక్షిణ కొరియాఅధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. తీవ్ర ప్రతిగఘటనల అనంతరం యోల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో దక్షిణ కొరియా చరిత్రలో అరెస్టయిన తొలి అధ్యక్షుడిగా యోల్ నిలిచారు. అంతకుముందు బుధవారం తెల్లవారుజామున సియోల్‌లోని అధ్యక్ష భవనం వద్ద నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. యోల్‌ను అరెస్టు చేసేందుకు 3 వేల మందికిపైగా పోలీసులతో యాంటీ కరెప్షన్ ఇన్వెస్టిగేటర్లు ఆయన అధికార నివాసానికి చేరుకున్నారు. అయితే వారిని అధికార పార్టీకి చెందిన నాయకులు, యోల్ మద్దతుదారులు, వ్యక్తిగత సిబ్బంది,సైన్యం పోలీసులతోపాటు విచారణ అధికారులను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. తీవ్ర ప్రతిఘటనల నడుమ అధ్యక్ష భవనంలోకి ప్రవేశించిన అధికారులు యోల్‌ను అరెస్టు చేశారు. ఓ ఎరుపు రంగు బస్సులో ఆయనను అక్కడి నుంచి తరలించారు. ఆయన్ని ఎక్కడి తీసుకెళ్లారనే విషయాన్ని అధికారులు వెల్లడించలేదు. అయితే యోల్‌ను గవాచియాన్‌లోని కరప్షన్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్(అమో) కార్యాలయానికి తరలించే అవకాశం ఉన్నది. అక్కడ మార్షల్ లా విధింపు కేసులో విచారణ జరుపనున్నారు. అరెస్టు వారెంట్ నేపథ్యంలో 48 గంటలపాటు ఆయన్ని అదుపులో ఉంచుకునే అధికారం సీఐవోకు ఉంటుంది.సెంబర్ 3న దేశంలో ఎమర్జెన్సీ మార్షల్ లా విధించిన విషయం తెలిసిందే. దీంతో ఆయనపై నేషనల్ అసెంబ్లీ 204-85 ఓట్లతో అభిశంసన తీర్మానాన్ని ఆమోదించింది. మార్షల్ లాను ప్రకటించిన కేసులో విచారణకు సహకరించకపోవడంతో ఆయనపై అరెస్టు వారెంటు జారీ అయింది. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్టు చేసేందుకు అధికారులు ఈ నెల 3 విఫల యత్నం చేశారు. తెల్లవారుజామునే అధ్యక్ష భవనానికి చేరుకున్న అధికారులను సైన్యంతోపాటు ఆయన వ్యక్తిగత సిబ్బంది అడ్డుకున్నారు. సుమారు ఆరు గంటల పాటు.. అధ్యక్షుడి భద్రతా సిబ్బందితో పోలీసులు వాగ్వాదానికి దిగారు. చివరకు అరెస్టును వాయిదా వేసుకున్నపోలీసులు వెనక్కి మళ్లారు.

### ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నూతన కేంద్ర కార్యాలయం ప్రారంభం

న్యూ డిల్లీ జనవరి 15: ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నూతన కేంద్ర కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. 9ం కోట్లా రోడ్డు లో ఆరు అంతస్తుల్లో అత్యాధునిక సౌకర్యాలతో ఈ నూతన కార్యాలయాన్ని నిర్మించారు. కొత్త కార్యాలయాన్ని పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రారంభించారు. కొత్త భవనానికి 'ఇందిరా గాంధీ భవన్ 'గా పేరు పెట్టారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సహా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాష్ట్రాల చీఫ్‌లు మొత్తం 400 మంది లీడర్లు పాల్గొన్నారు.కాగా, గత ఐదు దశాబ్దాలుగా అక్బర్ రోడ్డు 24వ నెంబర్ బంగ్లాలో ఏఐసీసీ కార్యకలాపాలు కొనసాగాయి. అయితే, ప్రభుత్వ బంగ్లాల్లో పార్టీ కార్యాలయాలు ఉండకూడదన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో అందుకు అనుగుణంగా అన్ని పార్టీలు సొంత భవనాలను నిర్మించుకుంటున్నాయి. ఇక 2008లో దీన్ దయాల్ ఉపాధ్యాయ మార్గ్‌లో కాంగ్రెస్ పార్టీ నూతన భవన నిర్మాణానికి కేంద్రం స్థలం కేటాయించింది. దీంతో 2009లో కార్యాలయం నిర్మాణ పనులు మొదలు పెట్టగా.. 15 ఏళ్లుగా ఈ నిర్మాణ పనులు సాగాయి

# కూటమి వైపు వైసీపీ చూపులు



విజయవాడ, డిసెంబర్ 15,: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో ఏదో ఓ కూటమిలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇండియా కూటమి నేతృత్వం నుంచి కాంగ్రెస్ పార్టీ వైదొలిగి మమతా బెనర్జీ నాయకత్వంలోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాను సిద్దమేనని మమతా బెనర్జీ ప్రకటించిన తర్వాత అనూహ్యంగా పలు పార్టీలు మద్దతు పలికాయి. ఇండియా కూటమిలోని ప్రాంతీయ పార్టీలు దీదీ నాయకత్వానికి ఓకే అంటే సరే అనుకోవచ్చు కానీ జగన్ నేతృత్వంలోని వైసీపీ కూడా మద్దతు పలికడం రాబోతున్న మార్పులకు సూచనగా మారింది. ప్రస్తుతం ఇండియా కూటమి చీలిక దిశగా ఉంది. ఆమ్ ఆద్మీ పార్టీ కాంగ్రెస్ తో కలసి పని చేసేందుకు సిద్ధంగా లేదు. హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ ఆప్ ను పట్టించుకోలేదు. ఇప్పుడు ఆప్ .. కాంగ్రెస్ ను పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ ను కాదని ప్రాంతీయ పార్టీల నేతలే కూటమికి నేతృత్వం వహించాలని కోరుకుంటున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్, అఖిలేష్ యాదవ్ వంటి వారు ఈ డిమాండ్ ను సమర్థిస్తున్నారు. ఇతర పార్టీలు కూడా ఓకే అంటే.. నాయకత్వం మారే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ కూడా ఈ అంశంపై కూటమిని నిర్మించే బాధ్యత ప్రాంతీయ పార్టీలకు ఇచ్చే అవకాశాలనుపరిశీలించే చాన్స్ ఉందని అనుకుంటున్నారు. విజయసాయిరెడ్డి ఇండియా కూటమికి దీదీ నాయకత్వం వహిస్తే బాగుంటుందని ప్రకటించేశారు. మామూలుగా అయితే ఆ కూటమికి ఎవరు నేతృత్వం వహిస్తే మాకేంటి అంటారు కానీ ఆయన తీరు మాత్రం వేరుగా ఉంది. ప్రస్తుతం వైసీపీ అత్యంత బలహీనంగా ఉంది. అసెంబ్లీకి వెళ్లడం లేదు. ఈ పరిస్థితులు చూస్తే రానున్న రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోవడం ఖాయంగా కనిపిస్తోంది. వీటిని ఎదుర్కోవాలంటే తమకు ఓ కూటమి మద్దతు ఉండాలని అనుకుంటున్నారు. కాంగ్రెస్ ఉన్న కూటమిలో చేరడానికి ఇంత కాలం సంశయిస్తూ వస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో ధర్నా చేసినప్పుడు కాంగ్రెస్ మినహా మిగతా ఇండియా కూటమి పార్టీలన్నీ హాజరయ్యాయి. ఇప్పుడు ఆ వ్యూహం వెనుక ఉన్న రాజకీయం వెలుగులోకి వస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. మమతా బెనర్జీ నేతృత్వంలో త్వరలో ఇండియా కూటమి పునర్ వ్యవస్థీకరణ జరగనుంది. కాంగ్రెస్ పార్టీ ఉంటుందో ఉండదో కానీ.. వైసీపీ చేరడం మాత్రం పక్కా అని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి. మమతా బెనర్జీ కూడా నేరుగా జగన్ తో సంప్రదింపులు జరుపుతున్నారని అంటున్నారు. ఇంత కాలం బీజేపీతో లొల్లి పెట్టుకోవడానికి ఏ మాత్రం ఇష్టపడని జగన్ ఇప్పుడు ఆ పార్టీని నమ్మడానికి సిద్ధంగా లేరు. అందుకే ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారన్న అభిప్రాయం ఢిల్లీలో గట్టిగా వినిపిస్తోంది. కొత్త ప్రభుత్వం వచ్చి ఇంకా ఏడాది పూర్తి కాలేదు. రానున్న ఐదేళు పార్టీ నుంచి మరిన్ని ఒత్తిళ్లు ఉంటాయని భావిస్తున్నారట. పార్టీలో ఉండి కష్టాలు కోరి తెచ్చుకునే కంటే, రాజీనామా చేస్తే బెటరని అనుకుంటున్నారు. ఇటు పార్టీకి.. అటు ప్రభుత్వానికి దూరంగా ఉంటే ఎలాంటి సమస్యలు ఉండదన్నది ఆయా నేతల ఆలోచన.మరికొందరికి సొంత నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయి. అధిష్టానం వద్ద ఎంత మొరపెట్టుకున్నా, ఫలితం లేకపోయింది. ఫలితంగా ఫ్యాన్‌కి దూరంగా ఉండేందుకు సిద్ధపడుతున్నారు. ఇంకొందరు నేతలు ఏపీలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారు.ప్రస్తుతం కూటమి సర్కార్‌కు కేంద్రం నుంచి అన్నివిధాలుగా సహాయ సహకారాలున్నాయి. కూటమిలో చీలిక వచ్చే ప్రసక్తి లేదని భావిస్తున్నారు. ఒకవేళ వైసీపీ పుంచుకున్నా, మళ్లీ అధికారంలోకి రావడం కష్టమని, కాకపోతే బలమైన ప్రతిపక్షంగా తయారు కావచ్చనే అంచనాలు లేకపోలేదు. ఆ లెక్కన దాదాపు పదేళ్లు ప్రతిపక్షానికి పరిమితం కావాల్సి ఉంటుందన్నమాట.ఇప్పుడున్న పరిస్థితుల్లో అయితే టీడీపీ, లేదంటే జనసేన, ఇంకా లేదంటే బీజేపీ వైపు వెళ్తే సేఫ్‌గా ఉండవచ్చని భావిస్తున్నారట. ఇప్పటికిప్పుడు కాకపోయినా ఫ్యూచర్‌లో బెటర్ లైఫ్ ఉంటుందనేది నేతల భావన. రాబోయే ఐదేళ్లలో వైసీపీలో ఉండేదెవరు? వెళ్లిపోయేదెవరు? ఎందుకు ఆయా నేతలను ఆపే ప్రయత్నం చేయలేకపోతోంది? మొత్తానికి రాబోయే ఐదేళ్లు మాత్రం వైసీపీ గడ్డుకాలమేనని చెప్పక తప్పదు.

# కోడి పందెలలో డిష్యూం.. డిష్యూం

### చేతులెత్తేసిన కొత్తపేట పోలీసులు

విజయవాడ: విజయవాడ కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధి పాములు కాలవద్ద కోడి కత్తి క్రీడల ఆర్గనైజర్ పరుచూరి ప్రసాదు బరిలో ఓ వ్యక్తిని అకారణంగా కొడుతున్న దృశ్యం మీడియా కంటపడింది. వాళ్లే కొట్టుకొని చస్తారులే అని కొత్తపేట పోలీసులు చేతులెత్తేశారని ఈ ప్రాంతంలో గుసగుసలు బలంగా వినపడుతున్నాయి.

గత సంవత్సరం కోడిపందాలు నిర్వహించడంతో ఓ వ్యక్తి కొత్తపేట పోలీసులు ఆర్టిఏ యాక్ట్ ద్వారా అడగగా కోడిపందాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని కొత్తపేట పోలీసులు వివరణ ఇచ్చారు.. సోషల్ మాధ్యమాల్లో మరియు పత్రికల్లో వచ్చిన కథనాలను ఆధారాలుగా పెట్టుకుని మరల ఆర్టిఏ యాక్ట్ ద్వారా కోడిపందాలకు అనుమతులు ఏమైనా జారీ చేశారా లేదా అని వివరణ కోరి కొత్తపేట పోలీసులు సమాచారాన్ని బట్టి హైకోర్టును ఆశ్రయించేందుకు కొంతమంది సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# వ్యూహాలు... ప్రతి వ్యూహాలు

హైదరాబాద్, జనవరి 15, : తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఆధిపత్య పోరు ఆగడం లేదు. బీఆర్ఎస్ ఎన్నికల్లో ఓడినా.. ఆ పార్టీ వ్యూహాల ముందు.. అధికార కాంగ్రెస్ ప్లాన్స్ ఫెయిల్ అవుతున్నాయి. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును జైలుకు పంపాలన్న రేవంత్‌రెడ్డి ఎత్తులు ఫలించకపోగా, చోటామోటా నాయకులను కూడా జైల్లో పెట్టలేకపోతున్నారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్ ఎత్తులు.. ప్రతిపక్ష బీఆర్ఎస్ వ్యూహాల ముందు చిత్తవుతున్నాయి. తెలంగాణను పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ నేతలు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పటి నుంచి ఆరోపిస్తూనే ఉన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చారు. సీఎంగా ఉన్నారు. కానీ, గత పాలకులు చేసిన ఒక్క అవినీతిని కూడా నిరూపించలేకపోతున్నారు. కాళేశ్వరం, విద్యుత్‌కొనుగోళ్ల ఒప్పందాలపై వేసిన కమిషన్ల విచారణ కొనసా?.గుతోంది. ఇక ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కొలిక్కి రాలేదు. ఫార్ములా ఈ కార్ రేసులో అనుమతి లేకుండా విదేశీ సంస్థకు నిధులు కేటాయించడం వ్యవహారంలో కేసు నమోదు.. ధరణిలో అక్రమాలు, గొర్రెల పంపిణీ పథకం, మిషన్ భగీరథలో అక్రమాలు ఇలా చాలా అంశాలు ఉన్నాయి. కానీ, ఇప్పటి వరకు ఒక్క అవినీతిని కూడా రేవంత్ సర్కార్ నిరూపించలేకపోయిందిఇదిలా ఉంటే.. అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నా.. బీఆర్ఎస్ నేతలు తామే అధికారంలో ఉన్నట్లు ప్రభుత్వంపై ఆధిపత్యం చెలాయిస్తున్నారు. కేటీఆర్, హరీశ్‌రావు ఇద్దరే సీఎం రేవంత్‌రెడ్డితోపాటు, ఆయన క్యాబినెట్‌లోని 10 మందిని ముప్పు తిప్పలు పెడుతున్నారు. బీఆర్ఎస్ విమర్శలు, ఆరోపణలను మంత్రులు, ఎమ్మెల్యేలు తిప్పికొట్టడంలో విఫలమవుతున్నారు. దీంతో బీఆర్ఎస్ నేతల దూకుడు కొనసాగుతోంది. కేటీఆర్, హరీశ్‌రావులకు తోడు.. ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్ తోడవడంతో అధికార పార్టీపై విమర్శల దాడి కొనసాగుతోంది.ఇక సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు కనీసం సీఎంగా చూడడం లేదు. నోటికి ఎంత వస్తే అంత మాట అనేస్తున్నారు. అయినా ఏమి చేయలేని పరస్థితిలో అధికార పార్టీ నేతలు ఉన్నారు. అప్పుడప్పుడు కేసులు పెడుతున్నా.. అరెస్టులు చేస్తున్నా.. అవన్నీ మొక్కుబడిగానే మారుతున్నాయి. బీఆర్ఎస్ నేతలను కంట్రోల్ చేయలేకపోతున్నాయి. లగచర్ల కేసులో పట్నం మహేందర్‌రెడ్డిని అరెస్టు చేసిన 20 రోజులకే బెయిల్ వచ్చింది. ఇక పాడి కౌశిక్‌రెడ్డిపై ఇప్పటికే పలు కేసులు పెట్టారు. అరెస్టు చేసిన ఒకటి రెండు రోజులకు మించి జైల్లో పెట్టలేకపోతున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై అధికారిక కార్యక్రమంలో కొట్టేంత పని చేసినా.. అధికార పార్టీ ఏమీ చేయలేని పరిస్థితిలో ఉంది. మూడు కేసులు పెట్టి అరెస్టు చేసినా.. వెంటనే బెయిల్ వచ్చేసింది.కౌశిక్‌రెడ్డిని ఈసారి ఎలాగైనా జైల్లో పెట్టాలని రేవంత్ సర్కార్ ప్లాన్ చేసింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబుల ఎందుటే పాడి కౌశిక్‌రెడ్డి జగిత్యాల ఎమ్మెల్యేను కొట్టినంత పనిచేశాడు. అయినా ఏమీ చేయలేని పరిస్థితి ఉంది. మంత్రులు ముగ్గురితో కేసులు పెట్టించినా.. సెలవు రోజు చూసి అరెస్టు చేసినా.. కనీసం ఒక్క రోజు కూడా జైల్లో ఉంచలేకపోయారు. దీంతో అధికార పార్టీలో సమన్వయలోపం.. అధికారులు అధికారులు, పోలీసులు అధికార పార్టీకి సహకరించడం లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# ప్రభుత్వ భూమి కలిసింది..

## సరెండర్ చేస్తున్న సిరిసిల్ల జనాలు

కరీంనగర్, జనవరి 15,: ఎక్కడైనా ఈ భూములు మాకొద్దు అంటూ కలెక్టర్ ను కలిసి వాపస్ చేసిన సీన్లు చూశారా?ఇప్పుడు చూపిస్తాం చూడండి..సుంచుల కుమారస్వామి. బీఆర్ఎస్ లోకల్ లీడర్. సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం సారంపల్లి పరిధిలోని సర్వే నంబర్ 464లోని 3 ఎకరాల ప్రభుత్వ భూమి ఈయన సొంతమైంది. సీన్ కట్ చేస్తే ఇప్పుడు సిరిసిల్ల జిల్లాలో ఇలా కబ్జాలు చేసిన వారంతా అరెస్టై జైలుకు వెళ్లారు. దీంతో కేసుల భయం ఎందుకని చెప్పి ఇదిగో ఇలా జిల్లా కలెక్టర్, ఎస్పీని కలిసి ఈ భూమి నాకొద్దు మహా ప్రభో అని సరెండర్ చేస్తున్నట్లు ప్రకటించారు. చాలా మంది చేసుకున్నట్లే నేను చేసుకున్నా.. ఇప్పుడు వద్దని ఇచ్చేస్తున్నా.. ఇదీ డైలాగ్.ఇదొక్క ఎగ్జాంపులే కాదు.. ఈ నెల 2న తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ మాజీ సర్పంచ్ మిట్టపల్లి పద్మ కూడా 2 ఎకరాల భూమిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు సరెండర్ చేశారు. కేసులు నమోదవుతుండడంతో కబ్జా, అక్రమ పట్టాదారుల్లో భయాలు మొదలయ్యాయి. దీంతో ఎందుకొచ్చిన తంటా అని చెప్పి భూముల్ని వాపస్ చేస్తున్నారు. అదీ మ్యాటర్. ఒకవైపు సిరిసిల్లలో అసైన్డ్ ల్యాండ్స్ ను కబ్జాలు చేసి ధరణి వచ్చాక తమపేర్లపై మార్చుకుని గులాబీ లీడర్లు చేసిన దందాలు బయటికొస్తున్నాయి. చెరువు, అటవీ, అసైన్డ్ ఇలా దేన్నీ వదల్లేదు. ధరణి వచ్చాక ఇంకింత రెచ్చిపోయారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన జీవోలను ఆసరాగా చేసుకుని చక్రం తిప్పుకున్నారు. ఇప్పుడు కటకటాలు లెక్కపెడుతున్నారు. నాడు కేటీఆర్ మంత్రిగా ఉండడంతో అధికారులు కూడా చూస్తూ ఉండిపోయారు. ఏమీ చేయలేకపోయారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మారింది. కథ మారింది. అందుకే అక్రమాలన్నీ ఒక్కొక్కటిగా తెరపైకి వస్తున్నాయి. సిరిసిల్ల లాండ్ ఫైల్స్ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.ఇక్కడ అన్నిటికంటే హైలెట్ ఏంటంటే.. కొట్టేసిన భూముల్ని వరుసగా ప్రభుత్వానికి సరెండర్ చేసేందుకు ముందుకొస్తున్నారు. అంటే అక్కడ ఏం జరిగిందో ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. సిరిసిల్ల జిల్లాలో అసైన్డ్, ప్రభుత్వ భూములను అక్రమంగా పట్టా చేసుకున్న బీఆర్ఎస్ లీడర్ల అరెస్ట్ లు కంటిన్యూ అవుతున్నాయి. బీఆర్ఎస్ సీనియర్ లీడర్ బొల్లి రామ్మోహన్, అగ్గి రాములు, జిందం దేవదాస్, సురభి నవీన్ రావుపై పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపారు ఈనెల 7న తంగళ్లపల్లి మండలం నేరేళ్ల బీఆర్ఎస్ నేత పూదూరి భాస్కర్ ను రిమాండ్ కు తరలించారు. భాస్కర్ మండేపల్లిలో 20 గుంటల అసైన్డ్ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారని రెవెన్యూ అధికారులు తేల్చడంతో కటకటాలు లెక్కిస్తున్న పరిస్థితి.

అంతే కాదు తంగళ్లపల్లి మండలానికి చెందిన మరో నలుగురు లీడర్లు పరారీలో ఉన్నారని కూడా చెబుతున్నారు.తంగళ్ళపల్లి మండలం తాడూరులోని సర్వే నంబర్ 1148లో సురభి నవీన్ రావు 3 ఎకరాలు, సురభి దేవేందర్ రావు పేరిట 3 ఎకరాలు మొత్తం 11 ఎకరాలు కబ్జా అయ్యాయని నిర్ధారించారు. కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించారు. 11 ఎకరాలను తిరిగి ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో మార్చారు కలెక్టర్. ఇక బొల్లి రామ్మోహన్ ఈయన సిరిసిల్ల జిల్లాలో సీనియర్ బీఆర్ఎస్ లీడర్. సర్దాపూర్, బద్నేపల్లిలో ఏడు ఎకరాలను మాయ చేసి పట్టా పొందారు. దీంతో ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేశారు.ధరణి వచ్చే టైంలో నాటి బీఆర్ఎస్ సర్కార్ ఓ ఉత్తర్వు ఇచ్చింది. దాని ప్రకారం 2017 డిసెంబర్ 31 కంటే ముందు ఎవరైనా భూమిలేని పేదవారు అసైన్డ్ భూమి కొనుగోలు చేస్తే, వారిని ఆ భూమి నుంచి తొలగించకుండా వారికే అసైన్మెంట్ పట్టా జారీ చేయొచ్చని భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ అదే మంచి సమయం అనుకున్న చాలా మంది బీఆర్ఎస్ లీడర్లు.. అసైన్డ్ భూములను చాలా తక్కువ ధరకు పేదల నుంచి రాయించుకుని.. పాస్ బుక్స్ పొందారు. ఇదే జీవోను అడ్డం పెట్టుకుని సిరిసిల్ల జిల్లా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి తమ్ముడు జిందం దేవదాసు లాండ్ పొందారు.తంగళ్లపల్లి మండలం సారంపెల్లి శివారులోని 164/3లో 3 ఎకరాలు కొన్నాడు. ప్రభుత్వ రూల్స్ ప్రకారం.. అసైన్డ్ ల్యాండ్ కొనాలంటే ఆ వ్యక్తి స్థానికుడై ఉండాలి. భూమి లేని పేద రైతుఅయిఉండాలి.అదేభూమిపై ఆధారపడితేనే రీఅసైన్ చేయాలి. కానీ జిందం దేవదాసు ఐటీ రిటర్న్స్ ఫైల్ చేస్తున్న బడా కాంట్రాక్టర్. అప్పట్లోనే అతడికి నోటీసులు ఇచ్చి కేసు నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ అప్పటి తహసీల్దార్ పట్టించుకోకుండా పాస్‌బుక్ జారీ చేశారు. ఎందుకంటే నాటి ప్రభుత్వంలో బలమైన లీడర్లుగా చెలామణి అవడమే. అంతే కాదు నాడు మంత్రిగా ఉన్న కేటీఆర్ సొంత నియోజకవర్గం సిరిసిల్లకు వచ్చినప్పుడల్లా వెంట ఉండే వారు కావడంతో అధికారులు కూడా ఏమీ చేయలేకపోయారు.ప్రభుత్వ భూములను పట్టా చేయించుకున్నవారిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రధాన అనుచరుడు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేరు కూడా ఉంది. ఆయన భార్య పేరిట ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపురంలోని 119/4 సర్వే నంబర్ లో 3.20 ఎకరాల భూమికి లావుణీ పట్టా జారీ అయింది. వెంకటాపురంలో సర్కార్ భూమిని అసైన్డ్ చేయడానికి అర్హులైన పేదలు, కూలీలు ఎంతో మంది ఉన్నా.. ఎల్లారెడ్డిపేటలో ఉండే బీఆర్ఎస్ లీడర్, ఆర్థికంగా బలంగా ఉన్న ఆగయ్య కుటుంబానికి లావుణీ పట్టా మంజూరు చేయడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో గత నెలలో ఈ భూమిని ప్రభుత్వ భూమిగా ధరణి రికార్డుల్లో మార్చేశారు. అదీ మ్యాటర్. సో ఇవన్నీ దొరికినవే. ఇంకా దొరకనివి, దొరకాల్సినవి ఎన్నో ఉన్నాయి.సిరిసిల్ల జిల్లాలో జరిగిన భూ భాగోతాలపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఎంక్వైరీ చేస్తుండడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఇదే జిల్లాలో దాదాపు 300 నుంచి 500 ఎకరాల అసైన్డ్ భూములను అక్రమంగా పట్టాలు చేయించుకున్నారంటున్నారు. ఇంకా తవ్వి తీస్తే మొత్తం 2 వేల ఎకరాల దాకా బయటపడుతుందంటున్నారు. ఇప్పటికే సిరిసిల్ల జిల్లా పెద్దూర్, సర్ధాపూర్, తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లె, అంకుషాపూర్, తాడూర్, లక్ష్మీపూర్, పాపయ్యపల్లె, ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామాల్లో భూముల హాంఫట్ కథలు బయటికొచ్చాయి.ఇదే మ్యాటర్ పై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా రియాక్ట్ అయ్యారు. సిరిసిల్ల జిల్లాలో పేదల పేరుతో బీఆర్ఎస్ లీడర్లు 2 వేల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా చేశారన్నారు. ఈ భూములను ఉద్దేశపూర్వకంగానే వందల మంది పేర్లపై అసైన్డ్ భూమిగా నమోదు చేశారని చెప్పారు. సీసీఎల్ఏ ఆఫీస్ నుంచి ప్రత్యేక టీములను సిరిసిల్ల లాండ్ స్కామ్స్ పై ఎంక్వైరీకి పంపిస్తున్నారు.సిద్దిపేటలో దళితులు, పేదలు ఉన్న 484 ఎకరాల ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వం ప్రైవేటు పరం చేస్తే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిషేధిత జాబితాలో చేర్చిందన్నారు మంత్రి పొంగులేటి. 2014 నుంచి 2023 వరకు రాష్ట్రంలో జరిగిన భూ అక్రమాలు, లావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించి సర్కారు భూములు స్వాధీనం చేసుకుంటామని మరోసారి క్లారిటీ ఇచ్చారు. ఇందుకోసం మహారాష్ట్ర, తెలంగాణకు చెందిన సంస్థల్ని ఎంపిక చేయబోతున్నారు.గత ప్రభుత్వ హయాంలో పలు భూములకు సంబంధించి కోర్టుల నుంచి ఆదేశాలు లేకున్నా ఉన్నట్లు సృష్టించి భూములు స్వాధీనం చేసుకున్న వాటిపైనా నజర్ పెడుతున్నారు. మాజీ సైనికుల పేరుతోనూ నకిలీ ఎన్ఓసీలతో స్థలాలు మాయం చేశారన్నారు. సో ఈ భూమి మాకొద్దు అని వాపస్ ఇస్తున్నారంటే గత ప్రభుత్వ హయాంలో ఏం జరిగిందో అంతా అర్థం చేసుకోవాలని కాంగ్రెస్ నేతలు గుర్తు చేస్తున్నారుసిరిసిల్ల నియోజకవర్గంలో కేటీఆర్ మంత్రిగా ఉన్న టైంలోనే వేల ఎకరాల్లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి ఆరోపించారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను ఈనెల 4న పరిశీలించారు. బీఆర్ఎస్ పదేళ్ల ప్రభుత్వంలో రెవెన్యూ వ్యవస్థను నాశనం చేశారన్నారు. ధరణి పోర్టల్ తీసుకొచ్చి అనుచరులకు వేల ఎకరాల అసైన్డ్ భూములను పట్టాలు చేశారని ఆరోపించారు. కేటీఆర్ హయాంలో పదేళ్లలో ప్రభుత్వ భూములకు పట్టాలు ఇచ్చారని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టేందుకు సిట్ ఏర్పాటు చేయాలన్నారు.

### పూలచింత గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు అధిక సంఖ్యలో జనాభా తరలి రావాలి

ఎమ్మిగనూరు: పట్టణంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఎమ్మిగనూరు నియోజకవర్గం కర్నూలు జిల్లా ఉపకార్యం నందు జై భీమ్ ఎమ్మార్పీఎస్ పూలచింత గ్రామ నాయకులు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, ఈ సందర్భంగా జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లా నందవరం మండలం పూలచింత గ్రామంలో రేపు అనగా 16-1- 2025వ తేదీన ఉదయం 10 గంటలకు జై భీమ్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత,అన్ని కులాల సమాన మానవ ఆరాధ్య దైవం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ ప్రారంభోత్సవం ఉంటుంది. కావున రాష్ట్ర నలమూలల నుండి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఓసి కులాలు అందరు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిస్తూ, గ్రామం ఎంట్రన్స్ నుండి శాంతియుతంగా ర్యాలీ చేపట్టి,విగ్రహావిష్కరణ చేసి, సభ దగ్గరికి వెళ్లి, వక్తలు అమూల్యమైన సందేశాన్ని ఇచ్చి, అంబేద్కర్ అందరివాడు రాబోయే రోజుల్లో బడుగు బలహీన వర్గాలను ఐకమత్యం చేసి, అంబేద్కర్ కలలు కన్న రాజ్యం సాధించడం తధ్యమని, ప్రశ్నించే తత్వాన్ని, పోరాడే తత్వాన్ని, నేర్పించి రాష్ట్ర వ్యాప్తంగా త్యాగ ఉద్యమాలకు సిద్ధమయ్యే విధంగా బోధిస్తామని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో జై భీమ్ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా కార్యదర్శి చిలకలడోన మాదిగ రత్నం, జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండల ప్రధాన కార్యదర్శి శావల శాంతిరాజు మాదిగ, జై భీమ్ ఎమ్మార్పీఎస్ నందవరం మండల కన్వీనర్ పురంపోగు సురేష్ మాదిగ, జై భీమ్ ఎమ్మార్పీఎస్ పూలచింత గ్రామ ఇన్చార్జి ఇర్మియా మాదిగ, జై భీమ్ ఎమ్మార్పీఎస్ పూలచింత గ్రామ నాయకుడు ఈరన్న మాదిగలు తదితరులు పాల్గొన్నారు.

# కేరళ స్కూళ్లు చైతన్య కేంద్రాలు



పాఠశాలలంటే? ఎత్తైన భవనాలు, చుట్టూ ప్రహరీ గోడలు, ఖరీదైన స్కూల్ యూనిఫామ్‌లు కాదు. మానవ జీవితాలను తీర్చిదిద్ది, జాతి భవితను రూపొందించే జీవన నిలయాలు, చైతన్య కేంద్రాలు. మానవీయ విలువల్ని పాదుకొలిపే ఆధునిక దేవాలయాలు. అలాంటి విద్యా విధానాన్ని కేరళలో ప్రత్యక్షంగా అధ్యయనం చేశాం. అక్టోబర్ 30, 31న కోజికోడ్‌లో కేరళ బాలల సంఘం 7వ రాష్ట్ర మహాసభల సందర్భంగా సౌహార్ద సందేశకులుగా పాల్గొన్నాం. అక్కడ చదువులే కాదు. ఆటపాటలతో పాటు జీవిత పాఠాలనూ నేర్పుతారు. తరగతి గదుల్లోనే నిజమైన పౌరులను తీర్చిదిద్దుతున్నారు. మంచి వాతావరణం, సారవంతమైన నేలలో నాణ్యమైన విత్తనాలు విత్తితేనే, చక్కటి ఫలాలనిచ్చే వృక్షాలుగా ఎదుగుతాయి. తల్లిని నేల/నీరుగా.. తండ్రిని విత్తనంగా భావిస్తే.. ఉపాధ్యాయుడు సూర్యరశ్మి లాంటివాడు. వీరు ముగ్గురు మాత్రమే చిన్నారులను మంచి పౌరులుగా మలచగలుగుతారు. ఈ ముగ్గురి భాగస్వామ్యంతో నడుస్తున్నదే కేరళ విద్యా వ్యవస్థ.మనిషి తత్వం, ప్రేమతత్వం, సోదరత్వం తోటి వారికి తోడ్పడాలన్న దృఢ సంకల్పంతో ఏర్పడినదే కేరళ బాలల సంఘం. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, జాతీయోద్యమ స్ఫూర్తితో కుల, మత, ప్రాంత, భాష లింగ వివక్ష లేని ప్రపంచ శాంతి, ప్రకృతి పర్యావరణ ఎజెండాగా, ఉచిత ఆహారం, బస్సు సౌకర్యం, సంపూర్ణ అక్షరాస్యత దిశగా%ౌ% బాలల హక్కుల్ని వివరిస్తూ అడుగులు వేసింది. పల్లెల్లో ఉన్న ప్రతి పిల్లవాడికి భరోసా అయ్యింది. బాలల సంఘం కేరళ మొత్తం విస్తరించింది. 14 జిల్లాలలో 210 ప్రాంతాలలో 2,279 గ్రామాలలో 31,258 యూనిట్లలో 13 లక్షల మంది బాలలతో విస్తరించింది.గౌతమ బుద్ధుని నుండి మహాత్మా గాంధీ వరకు మాంటిస్సోరి నుండి గిజూబాయి వరకు ఎందరో మహనీయుల బాటలో బాలబాలికలను తీర్చిదిద్దుతున్నారు. అక్కడ పెద్దలు పిల్లలతో స్నేహం చేస్తారు. పిల్లలు చెప్పింది శ్రద్ధగా వింటారు. పిల్లల అభిప్రాయాలను తల్లిదండ్రులు, పెద్దలు ఆలకించే సాంప్రదాయం వారి సంస్కృతిలోనే ఉంది. ఆంగ్ల భాషతో పాటు అన్య భాషలు ఎన్ని నేర్చినా.. పాలనలో బోధనలో మాతృభాషపై మమకారం తగ్గలేదు.

విద్యపై విజన్: విద్యపై చేసే ఖర్చులను భావితరాల భవిష్యత్తుకు పునాదిగా చూస్తున్నది కేరళ వామపక్ష ప్రభుత్వం. బడిని బాగు చేయడాన్ని రేపటి పెట్టుబడిగా గుర్తించింది. చదువుల విప్లవం తెచ్చింది. బాల కార్మిక రహిత రాష్ట్రంగా బాల కార్మికుల అక్రమ రవాణాపై పోరాడేందుకు బాలల సంరక్షణ యూనిట్‌ను ఏర్పరిచింది. అక్రమ రవాణా, పిల్లల యాచన, అర్ధాంతరంగా చదువు ఆపేసిన విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిం చింది. డ్రాపౌట్లు లేకుండా చూసే బాధ్యత చైల్డ్ హెల్ప్ డెస్క్ రెస్క్యూ ఫోర్స్ సహాయం సమన్వయంతో అధికారులు 24 గంటలు షిఫ్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. కార్మికుల జాడ కోసం వారానికి మూడు రోజులు తనిఖీలు నిర్వహిస్తారు. బాల కార్మికులు కనిపిస్తే విడిపించి యాజమాన్యాలపై కేసులు పెడతారు. పిల్లలు పనిలో కాదు. బడిలో ఉండాలి. బడికి రాని పిల్లలందరూ బాల కార్మికులే. బాల్యం ఒక హక్కు. పిల్లల చదువుల ప్రాధాన్యతపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించి, కేరళ సమాజాన్ని ఒప్పించి "బాల్యం బడిలోనే" ఉండాలని తీర్మానం చేశారు. పాఠశాల మాత్రమే పిల్లలను పట్టించుకునే ఏకైక సంస్థగా గుర్తించింది. పిల్లల సర్వతోముఖ వికాసానికి తగినట్టుగా పాఠశాలలను అభివృద్ధి చేసింది. అంతర్జాతీయ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది. చదువుతోపాటు ఆటపాటలు, ఆట స్థలాలు లేని స్కూళ్లకు అనుమతులుండవు. ప్రతి పాఠశాలలో పి.ఇ.టి, డ్రామా, స్క్రిప్ట్, డాన్స్ టీచర్ తప్పకుండా ఉండాలి. ఆధునిక విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. వీటికి సంబంధించిన శిక్షణ తరగతులు, ప్రణాళిక ప్రతి బిడ్డకు ఉపయోగపడేలా చూస్తారు. సమాజం భాగస్వామ్యం కాకుండా కేవలం ప్రభుత్వ కృషి ఫలితాలివ్వదు. అందుకే అన్ని రంగాల్లో ప్రజల భాగస్వామ్యంతోనే ప్రణాళికలు అమలు జరుగుతాయి. విద్యార్థులు ఫెయిల్ అయితే ఉపాధ్యాయులే ఫెయిల్, విద్యా విధానం ఫెయిల్ అయినట్టుగా చూస్తారు. పిల్లల మనోధైర్యానికి మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తారు. ప్రాచీన నృత్యాలలో శిక్షణ ఇస్తారు. అర్థం కాని పాఠ్యాంశాలను కళారూపాల ద్వారా మనసులో నాటుకునేలా చెప్తారు. దాంతో ఆటపాటలు చిన్నారుల నిత్య జీవితంలో భాగమైనాయి. 'సమగ్ర' అనే పోర్టల్ ద్వారా కేరళ విద్యాశాఖ వెయ్యికి పైగా ప్రభుత్వ పాఠశాలలను డిజిటల్ పాఠశాలలుగా మార్చి 45 వేల స్మార్ట్ రూములను నిర్మించింది. లిటిల్ కైట్స్, ఐ.టి క్లబ్బులను ఏర్పాటు చేసి యానిమేషన్, షార్ట్ ఫిలిమ్స్, సైబర్ భద్రత వంటి అంశాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి విద్యార్థికి మధ్యాహ్న భోజనంలో గుడ్డు, వారానికి ఒకరోజు చికెన్ పెడతారు. 3 వేల మంది పిల్లలు ఒకేసారి కలిసి భోజనం చేసే డైనింగ్ హాల్, పేరెంట్స్ విజిటింగ్ హాల్, పెద్ద కిచెన్ వుంటాయి. పరిశుభ్రత విషయంలో పక్కాగా వుంటారు. స్కూల్ ఆవరణలో ఒక ఆకు పడ్డా విద్యార్థులే ఏరి చెత్త బుట్టలో వేస్తారు. ప్రతి స్కూల్లో ఇండోర్ స్టేడియం వుంటుంది. విద్య ఒకటే కాదు. ఏ విద్యార్థికి ఏ రంగంలో ఆసక్తి ఉంటే ఆ రంగంలో తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించగలిగేలా శిక్షణనిస్తారు. ఒక మాటలో చెప్పాలంటే? ఒక నిరుపేద విద్యార్థికి అంతర్జాతీయ స్థాయి విద్య ఉచితంగా అందుతుంది.

భవితకు బలం బాలల సంఘాలే: పిల్లల సాంస్కృతిక ఉత్సవాలు 'వేనలుంబికల్' (వీధి నాటకాలు) ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే నెలలో జరుగుతాయి. నాలుగు వేల మంది బాల కళాకారులు 210 బృందాలుగా బాలల సామాజిక సమస్యలపై లక్షలాది మందితో ప్రదర్శనలిచ్చి పెద్దలలో సైతం చైతన్యం కల్పిస్తారు. ఆటపాటల్లో సత్తా చాటుతున్న వారిని చిన్న వయస్సులోనే చేరదీసి ప్రోత్సహిస్తున్నారు. శిక్షణలిచ్చి విశ్వ క్రీడల్లో విజేతలుగా నిలబెడుతున్నారు. వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపులను శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్నారు.

మలయాళంలో బాల సాహిత్య అకాడమీ ఏర్పరిచారు. బాలల రచనలు, ముద్రణలు అక్కడి నుంచి వెలువడతాయి. ప్రతి ఇంట్లో లైబ్రరీ క్యాంపెయిన్ నిర్వహించి పఠనాసక్తిని పెంచుతారు. బాలల కార్యక్రమంలో కుటుంబాలు, పెద్దలు పాల్గొంటారు. రాజ్యాంగ పీఠికను చదివించడం బాలల అసెంబ్లీ, పార్లమెంటు కార్యక్రమాలు, లౌకిక, మానవత్వ, సమతా మమతల పండుగలు, వనభోజనాలు నిర్వహిస్తారు. సూర్యచంద్ర గ్రహణాలు, మూఢనమ్మకాలను సవాల్ చేస్తూ పది వేల మంది పిల్లలు రోడ్ల మీదకొచ్చి గ్రహణాన్ని వీక్షించారు. సైన్స్ వండర్ షోలు, ఒక్క మాటలో చెప్పాలంటే? ఈ ప్రపంచం పిల్లలదే. ఎదగడానికి ఎల్లలు లేవు అన్నట్లుగా విజ్ఞాన ఆధారిత సమాజ నిర్మాణంలో కేరళ ప్రణాళిక బద్ధంగా ముందడుగు వేస్తున్నది.

అందరికీ విద్య, సమాన విద్య, నాణ్యమైన విద్య, ఉచిత విద్యా వెలుగులు అందిస్తున్నప్పటికీ మత శక్తులు మళ్లీ చీకట్లోకి తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తానే ఉన్నాయి. విజ్ఞాన వెలుగుల్లోనే "మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును" అనే దృక్పథంతో బాలల సంఘాల పిల్లలే పిల్లల్ని, పెద్దల్ని పురోగమన సంస్కృతి వైపు అడుగులు వేయిస్తున్నారు. నవ సమాజం వైపు భవితను నడుపుతున్నారు. మంచి రోజులకు మంచి విధానాలకు కేరళ ఒక తీపి గుర్తు.

## కాశీ వెళ్తున్న బస్సులో మంటలు

### నిర్మల్‌వాసి సజీవ దహనం

హైదరాబాద్, జనవరి 15 : తెలంగాణవాసుల కాశీయాత్రలో విషాదం చోటుచేసుకున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి కాశీకి వెళ్తున్న ప్రైవేటు బస్సు ఉత్తరప్రదేశ్‌లోని బృందావనంలో ప్రమాదానికి గురైంది. షాట్ సర్క్యూట్ కారణంగా బస్సులో మంటలు చెలరేగడంతో ఓ వ్యక్తి సజీవ దహనం అయ్యారు. మృతుడిని నిర్మల్ జిల్లా పల్సికి చెందిన శీలం దుర్పత్తిగా గుర్తించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని భైంసా నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రం కాశీకి పర్యాటకులతో బస్సు బయల్దేరింది. ఈ క్రమంలో యూపీలోని బృందావనం సమీపంలో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్రమంగా అవి బస్సు మొత్తం విస్తరించడంతో అది పూర్తిగా దగ్ధమైంది. దీంతో అందులో ఉన్న వ్యక్తి సజీవ దహనమయ్యాడు. కాగా, ప్రమాద సమయంలో 50 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తున్నది. ప్రమాదాన్ని గుర్తించిన బస్సు డ్రైవర్ అప్రమత్తం చేయడంతో వారంతా అందులోనుంచి దిగిపోయారు. అయితే బస్సులో ఉండిపోయిన శీలం దుర్పత్తి మాత్రం మృతిచెందాడు. దీంతో అతని కుటుంబంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

## మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయండి

### ఆదిలాబాద్ జిల్లాలో మహిళల ఆందోళన

ఆదిలాబాద్, జనవరి 15 : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి.. ముందు మహాలక్ష్మి పథకం కింద ఇస్తానన్న రూ. 2500 ఇవ్వాలంటూ మహిళలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ పండుగనూ సంతోషంగా జరుపుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయాలంటూ ముగ్గులు వేసి నిరసన తెలిపారు. రూ. 4 వేల పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, కల్యాణలక్ష్మి, తులం బంగారం, రూ. 15 వేల రైతుబంధు, రైతు కులీలకు రూ. 12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే అన్ని పండుగలను సంతోషంగా జరుపుకునేవాళ్లమని చెప్పారు. మళ్లీ కేసీఆరే రావలని ముక్త కంఠంతో చెప్పారు.

## నిజామాబాద్‌లో ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు

నిజామాబాద్,జనవరి 15 : నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు వెలవడం స్థానికంగాకలకలం రేపింది.ఎన్నికలసందర్భంగా నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వాల్ పోస్టర్లలో ప్రస్తావిస్తూ ఓటర్లు నిలదీశారు. రూపాయికి వైద్యం ఎక్కడ? యువతకు ఉపాధి ఎక్కడ, నియోజకవర్గంలోని ప్రతి నిరుపేదకు ఇల్లు ఎక్కడ? అంటూ నిలదీశారు. ఆర్మూర్ నియోజకర్గంతోపాటు నందిపేట్ మండలంలో సైతం పోస్టర్లు అంటించారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా పోస్టర్ల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

## భూభాగోతాలకు చెక్...

వరంగల్, డిసెంబర్ 31, : భూ సమస్యల పరిష్కారం, భూముల పరిరక్షణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకువచ్చింది. ఈ పోర్టల్ ద్వారానే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అయితే ధరణి కారణంగా చాలా మంది భూముల నమోదులో పొరపాట్లు జరిగాయి. ఎక్కువ తక్కువ భూములు నమోదయ్యాయి. సాగులో లేని భూములను కూడా సాగు భూములుగా చూపించారు. దీంతో రైతులు అధికారుల చుట్టూ ఏళ్లుగా తిరుగుతున్నారు. సీసీఎల్ఏ కొన్ని సమస్యలు పరిష్కరించినా.. ఇప్పటికీ కలెక్టర్ల వద్ద వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక చాలా ప్రభుత్వ భూములు నాయకుల పేరిట పట్టాలు అయ్యాయి. ఈ నేపథ్యంలో భూ అక్రమాలకు చెక్ పెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా భూ భారతి చట్టం అమలు చేయాలని నిర్ణయించింది. ఇటీవలే అసెంబ్లీ, శాసన మండలిలో బిల్లు ఆమోదం పొందింది. గవర్నర్ ఆమోదం కోసం ప్రభుత్వం పంపించింది. గవర్నర్ ఆమోదించగానే చట్టంగా మారుతుంది. అయితే కొందరు అధికారుల తీరుతో భూ రికార్డుల్లో తప్పులు జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. లంచాలకు ఆశపడి, ప్రభుత్వ పెద్దల మాటలు విని, బెదిరింపులకు భయపడి ఇతర కారణాలతో కొందరు అధికారులు రికార్డులు మారుస్తున్నారు. ఈ క్రమంలో భూ వివాదాలు పెరుగుతున్నాయి. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టంతో భూ సమస్యలకు చెక్ పెట్టాలని భావిస్తోంది.భూ భారతి చట్టాని రాష్ట్ర రెవెన్యూ అధికారులు వ్యతిరేకిస్తున్నారు. అయినా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. భూముల వివరాలు తప్పుగా నమోదు చేసే అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా చట్టంలో నిబంధన పొందుపరిచారు. ఏ అధికారి స్థాయిలో తప్పు జరిగితే ఆ అధికారిపైనే చర్యలు తీసుకునేలా చట్టం ఉంది. అవసరమైతే ఆ అధికారిని ఉద్యోగం నుంచి తొలగించేలా నిబంధన చేర్చారు. ఇందుకు ఐఏఎస్ ఆఫీసర్లు కూడా అతీతులు కాదని సెక్రటేరియేట్ వర్గాలు తెలిపాయి.ఇక భూ సమస్యలను చాలా వరకు గ్రామస్థాయిలోనే పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గ్రామాల్లో వీఆర్వోల స్థానంలో జే ఆర్వోలను నియమించాలని నిర్ణయిం చింది. ప్రతీ రెవెన్యూ గ్రామానికి ఒక జేఆర్వో ఉంటారు. గత ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా జేఆర్వో వ్యవస్థను తీసుకు రావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా4 11 వేల మందిని నియమించేలా కసరత్తు చేస్తోంది

## ఆదాయం కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్



### మార్చిలోగా రూ.10 వేల కోట్లకు కసరత్తు

అమరావతి : ఆదాయాన్ని పెంచుకునేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగామార్చి నెలాఖరుకు కనీసం పదివేల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. రిజర్వ్‌బ్యాంకు, కాగ్, అక్కౌంటెంట్ జనరల్ కార్యాలయం అధికారులు వెలువరిస్తున్న గణాంకాలు కూడా ఇదే అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. సొంత పన్నుల ఆదాయం పడిపోవడం, కేంద్రం నుంచి కూడా నిధుల రాబడి తగ్గిపోవడం వంటి కారణాలతో ఎక్కువగా అప్పులపైనే ఆధారపడాల్సి వస్తోంది. మరోవైపు ఖజానాకు వాస్తవంగా రావాల్సిన ఆదాయం కూడా తగ్గుతోందని ఆర్థికశాఖ అధికారులు అంటున్నారు. దీంతో బకాయిలపై ప్రధానంగా దృష్టి సారించాలని ఆర్థికశాఖ నిర్ణయించింది. రాష్ట్ర ఖజానాకు వాస్తవంగా రావాల్సిన నిధుల్లో ఎక్కువగా అమ్మకపు పన్ను, జిఎస్‌టి, గనులు, విద్యుత్ బకాయిలు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు వంటి శాఖల నుంచే బకాయిలు ఉన్నాయని అధికారులు అంటున్నారు. ఒక్క గనుల శాఖ నుంచే నాలుగు వేల కోట్ల వరకు ఆదాయం రావాల్సి ఉందని ఆర్థికశాఖ అధికారి ఒకరు చెప్పారు. లీజు నిధులే కాకుండా, రాయల్టీ, ఇతర వసూళ్లలో కూడా లోటు కనిపిస్తున్నట్లు చెబుతున్నారు. అందుకే పాత లెక్కలను వెలికితీసి బకాయిలుగా ఉన్న మొత్తాన్ని తిరిగి వసూలు చేయాలని నిర్ణయించినట్లు ఒక అధికారి వెల్లడించారు. ఇదే సమయంలో పెద్ద మొత్తంలో విద్యుత్ బకాయిలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, రిజిస్ట్రేషన్ల శాఖలో కూడా ఆదాయం తగ్గిందని చెబుతున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖకు రాకుండానే క్షేత్రస్థాయిలోనే ఒప్పందాలు జరిగిపోతున్నాయని, అందుకే ఆదాయానికి భారీగా గండిపడుతోందని గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు.కేంద్రం నుంచి 30 వేల కోట్లు రావాల్సి ఉండగా, కేవలం ఇప్పటివరకు పది వేల కోట్లు మాత్రమే రావడంపైనా ఆర్థికశాఖ దృష్టి సారిస్తోంది. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని కనీసంగా పది వేలకోట్ల రూపాయలను మార్చి లోగా సమకూర్చుకోవాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన ఒక సమీక్షలో కూడా ఇదే దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది.

## తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్‌పాల్

హైదరాబాద్,జనవరి 15 : తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సుజయ్‌పాల్‌ను రాష్ట్రపతి నియమించారు. హైకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుజయ్‌పాల్‌కు సీజేగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా బదిలీ అయ్యారు. 1964 జూన్ 21న జన్మించిన జస్టిస్ సుజయ్ పాల్ బీకాం, ఎంఏ, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. 1990లో మధ్యప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. పలు బ్యాంకులు, మానవ హక్కుల కమిషన్, బోర్డులకు సేవలందించారు. 2011 మే 27న మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2014 ఏప్రిల్ 14న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుతో 2024 మార్చి 21న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. తాజాగా హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమితులయ్యారు.

## గాలిపటం ఎగురవేస్తూ

### బిల్డింగ్‌పై నుంచి ఒకరి మృతి

యాదాద్రి భువనగిరి, జనవరి 15 : సంక్రాంతి పండగ పూట కొన్ని కుటుంబాల్లో విషాయాలు చోటుచేసుకుంటున్నాయి. గాలిపటాలు ఎగరవేయాలని యువకుల అత్యుత్సాహాలు ప్రమాదాలను కొనితెచ్చుస్తున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో పండుగపూట విషాదం నెలకొంది. గాలిపటం ఎగురవేస్తూ బిల్డింగ్ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మూటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామంలో గాలిపటం ఎగురవేస్తూ నరేందర్ అనే వ్యక్తి బిల్డింగ్ పైనుంచి జారిపడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నరేందర్ మృతితో బంధువుల రోదనలు మిన్నంటాయి. కాగా, గాలిపటాలు ఎగరవేసేటప్పుడు కింది జాగ్రతత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## విద్యామండలి కీలక ప్రకటన విడుదల

### టీజీ ఎప్‌సెట్ పరీక్షలకు తేదీలు ఖరారు, మే 2 నుంచి 5 వరకు ఇంజినీరింగ్ పరీక్షలు

హైదరాబాద్, జనవరి 15 : తెలంగాణ ఉన్నత విద్యామండలి కీలక ప్రకటన విడుదల చేసింది. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆయా కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే ప్రవేశ పరీక్షల తేదీలను ఖరారు చేసింది. ఈ మేరకు పరీక్ష తేదీలను ఉన్నత విద్యామండలి వెల్లడించింది. బీఈ, బీటెక్, బీ ఫార్మసీ, ఫార్మ్ డీ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎప్‌సెట్ పరీక్షలను ఏప్రిల్, మే నెలలో నిర్వహించనున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులకు సంబంధించి ఏప్రిల్ 29, 30 తేదీల్లో, ఇంజినీరింగ్ కోర్సులకు మే 2 నుంచి 5వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించనున్నారు. టీజీ ఈసెట్ ప్రవేశ పరీక్షను మే 12, టీజీ ఎడ్‌సెట్‌ను జూన్ 1, టీజీ లాసెట్, ఎల్‌ఎల్‌ఎం కోర్సులకు జూన్ 6, ఐసెట్ పరీక్షలను జూన్ 8, 9 తేదీల్లో, టీజీ పీజీఈసెట్ పరీక్షలను జూన్ 16 నుంచి 19 వరకు, టీజీ పీఈసెట్ ప్రవేశ పరీక్షలను జూన్ 11 నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యామండలి ప్రకటించింది.

## నిషేధించినా ఆగని చైనా మంజా విక్రయాలు

### చైనా మాంజాతో ఇద్దరికి తీవ్ర గాయాలు ఆసుపత్రికి తరలింపు

హైదరాబాద్,జనవరి 15 : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వం నిషేధించినా, పోలీసులు ఎన్ని కేసులు నమోదు చేసినా కొందరిలో మార్పు రావడం లేదు. చైనా మాంజా కారణంగా కుటుంబాల్లో విషాదాన్ని మిగుల్చుతోంది. కొంతమంది ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు తీవ్రగాయాలపాలవుతున్నారు. తాజాగా కామారెడ్డిలోని రామారెడ్డిలో బైక్‌పై వెళ్తున్న జావెద్ అనే వ్యక్తి గొంతుకు చైనా మాంజా తగిలి తీవ్ర రక్తస్రావం అయింది. గమనించిన స్థానికులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. జావెద్ సైలన్ బాబా కాలనీకి చెందిన వాసిగా గుర్తించారు. మరో ఘటనలో హైదరాబాదర్‌లోని నారాయణగూడ పీఎస్ లిమిట్స్‌లో మరో ప్రమాదం చోటు చేసుకుంది. లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్‌గా పని చేస్తున్న శివరాజ్ విధులు ముగించుకొని నారాయణగూడ ఫ్లైఓవర్ నుంచి దిగుతుండగా చైనా మాంజా మెడకు చుట్టుకుకోవడంతో కొంత మేర చర్మం చీలిపోయింది. క్షతగాత్రుడిని చికిత్స కోసం ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

## కాంగ్రెస్ కార్యాలయ ప్రారంభోత్సవంలో సిఎం

**కుటుంబ సమేతంగా వచ్చిన రేవంత్ రెడ్డి**



**న్యూఢిల్లీ,జనవరి15 :**
ఏఐసీసీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబసమేతంగా హాజరయ్యారు. గురు, శుక్రవారం రెండ్రోజులపాటు ఢిల్లీలోనే ఉంటారు. అనంతరం విదేశీ పర్యటనకు బయలుదేరి వెళతారు. కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం కాంగ్రెస్ పెద్దలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. తెలంగాణ మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీ కార్యవర్గం కూర్పు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలపై వారితో చర్చించనున్నట్లు సమాచారం. అలాగే పలువురు కేంద్ర మంత్రులను సీఎం కలవనున్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి వారితో మాట్లాడనున్నారు. కేంద్రమంత్రులను కలిసే సమయంలో సీఎం వెంట ఆయా శాఖల రాష్ట్ర మంత్రులు ఉంటారు. అనంతరం గురువారం రాత్రి ఢిల్లీ నుంచి సింగపూర్ పర్యటనకు రేవంత్ రెడ్డి వెళతారు. సింగపూర్‌కు చేరుకున్న తర్వాత రేవంత్ బృందం శుక్రవారం అక్కడ జరిగే బిజినెస్ మీట్‌లో పాల్గొంటారు. పలువురు పారిశ్రామిక వేత్తలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అవుతారు.

## నాచారం సురానా వైర్స్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

**తప్పిన ప్రాణాపాయం**





**హైదరాబాద్,జనవరి15 :**
హైడాబాద్ నాచారం పీఎస్ పరిధిలో అగ్నిప్రమాదం జరిగింది. సురానా వైర్స్ పరిశ్రమలో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అప్రమత్తమైంది. సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుంది. దీంతో మంటలు అదుపులోకి వచ్చాయి. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఇటీవల పరిశ్రమల్లో జరుగుతున్న అగ్నిప్రమాదాలతో భారీగా ఆస్తినష్టం సంభవిస్తుండడంతో పాటు ప్రాణనష్టం కూడా అధికంగానే ఉంటుంది. యాజమాన్యాలు నిబంధనలు పాటించకపోవడం.. భద్రతాప్రమాణాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం ఇందుకు కారణం. పారిశ్రామిక వాడలు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. ఆయా పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో తెలుగు రాష్ట్రాలతోపాటు బీహార్, గుజరాత్, ఒరిస్సా తదితర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. ముఖ్యంగా పటాన్‌చెరు, జిన్నారం, ఐడీఏ బొల్లారం, కంది, హత్నూర, సదాశివపేట తదితర మండలాల్లో భారీ పరిశ్రమలు ఉన్నాయి. ఈ కంపెనీల్లో తరచూ అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు జరుగుతున్నాయి. దీంతో కార్మికుల భద్రత సవాలుగా మారుతోంది.

## చంద్రబాబుకు సుప్రీం కోర్టులో భారీ ఊరట

**గత ప్రభుత్వ..బెయిల్ రద్దు పిటిషన్ కొట్టివేత**

**న్యూఢిల్లీ,జనవరి15 :**



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. స్కిల్ కేసులో బెయిల్ రద్దు చేయాలని గత ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ బేలా త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. ఈ కేసులో ఇప్పటికే చార్జిషీట్ ÷ల్ చేశారని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేసినందున బెయిల్ రద్దు పిటిషన్‌లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని జస్టిస్ బేలా త్రివేది వెల్లడించారు. 2023 నవంబర్‌లో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే బెయిల్‌ను రద్దు చేయాలంటూ అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంలో పిటిషన్ వేసింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన బెయిల్ రద్దు పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఈరోజు ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. అవసరం అయిన సందర్భంలో విచారణకు సహకరించాలని చంద్రబాబుకు సుప్రీం కోర్టు సూచించింది. అయితే ఈ కేసులో ఏపీ హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని జర్నలిస్టు ఇంప్లీడ్ పిటిషన్ వేయగా.. దాన్ని కొట్టివేస్తూ జర్నలిస్టుపై సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. 'అసలు ఈ కేసుకు మీకు సంబంధం ఏంటి... మీరెందుకు ఇందులో జోక్యం చేసుకున్నారు' అంటూ జర్నలిస్టును కోర్టు మందలించింది. స్కిల్ కేసులో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సుప్రీం కోర్టు సమర్థించింది. ఆ బెయిల్‌ను రద్దు చేసేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. కాగా.. ఏపీ స్కిల్ కేసుకు సంబంధించి గత ప్రభుత్వం మాజీ సీఎం హోదాలో ఉన్న చంద్రబాబుపై అక్రమ కేసు బనాయించి జైలుకు కూడా పంపించిన విషయం తెలిసిందే. ఆనాటి నుంచి కేసు విచారణ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి గతంలో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలంటూ గత వైసీపీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై సుప్రీంలో వాదనలు జరుగాయి. స్కిల్ కేసులో ఒక్క రూపాయి కూడా అవినీతి జరిగిందని అప్పటి సర్కార్ పేర్కొనలేదు. కావాలని కుట్ర పూరితంగా రాజకీయ కక్షలో భాగంగా చంద్రబాబుపై అవినీతి కేసును మోపింది. అక్రమ కేసును పెట్టి మరీ చంద్రబాబును జైలుకు తరలించారు. ఇదే పిటిషన్‌ను విచారణ జరిపిన ఏపీ హైకోర్టు.. నాడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంలో గత వైసీపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను తాజాగా సుప్రీం కోర్టు కొట్టివేసింది.

# గగ్గోలు పెడితే..అబద్ధాలు నిజాలు కావు !

**సిరిసిల్ల జనవరి15 :**
తప్పు చేయలేదు..కానీ వేలకోట్ల ఆస్తులు మాత్రం సమకూరాయి. భూములన్నీ హాంఫట్ అయ్యాయి. ధరణి పేరుతో పేదలను జలగల్లా పీల్చారు. పథకాల పేరుతో డబ్బులు పందేరం చేశారు. సిరిసిల్లలో 2500 ఎకరాల ప్రభుత్వ భూమి అనుయాయులకు అప్పనంగా కట్టబెట్టారు. ఇదంతా యువరాజా వారు కెటిఆర్ అవినీతిపై పుంఖానుపుంఖాలుగా వస్తున్న ఆరోపణలు. చెల్లెలు కవితమ్మ కూడా అవినీతి చేయలేదు. కానీ లిక్కర్ స్కామ్‌లో ఇరుక్కుని జెయిల్‌కు వెళ్లి బెయిల్‌పై వచ్చారు. చూస్తుండగానే కాళ్లకుచెప్పులు లేని వారు కోట్లకు పడగలెత్తారు. తెలంగాణలో వీరి కుటుంబం కోట్లకు పడగలెత్తింది. దీనికి సమాధానం లేదు. ఇప్పుడు ఫార్ములా–ఇ రేస్ కేసు మలుపుల మీద మలుపులు తిరుగుతూ పవర్‌ఫుల్ యాక్షన్ మూవీని తలపిస్తోంది. మాజీ మంత్రి కేటీఆర్‌పై ఫార్ములా–ఈ రేస్ కేసు రచ్చ రేపుతోంది. ఫార్ములా–ఈ రేస్ కేసులో పైసావంతు కూడా అవినీతి జరగేలదని కెటిఆర్ వాదిస్తున్నారు. 55 కోట్లు మాత్రం ఇచ్చేశానంటున్నాడు. ఓ మంత్రిగా, ఎవరి అనుమతి లేకుండా ఇంత పెద్దమొత్తంలో డబ్బులు ఎందుకు దాటవేశారన్నదానికి సమాధానం చెప్పడం లేదు. అవినీతి జరరగలేదు. ఏం చేసుకుంటారో చేసుకోండని, వెయ్యి కేసులు పెట్టినా భయపడేది లేదన్న వాదనతో కెటిఆర్ అబద్దాన్ని నిజం చేయాలని చూస్తున్నారు. ఇక్కడ అనుమతులు లేకుండా మంత్రిగా ఇంత డబ్బును విదేశాలకు ఎలా తరలించారన్న దానిపైనే కేసు పెట్టారు. కానీ దీనికి కెటిఆర్ ఇప్పటికీ సూటిగా సమాధానం చెప్పడం లేదు. సుప్రీంకోర్టు దాకా వెళ్లి క్వాష్ పిటిషన్లు మాత్రం వేస్తున్నారు. అబద్దాలు ఆడేవారికి అరుపులు ఎక్కువ అన్నట్లుగా ఉచ్చనీచాలు మరచి ఇష్టం వచ్చినట్లుగా విమర్శలు చేస్తున్నారు. కాళేశ్వరం అవినీతి అబద్ధమా..ధరణి అక్రమాలు అబద్ధమా...సిరిసిల్ల భూముల పందేరం అబద్ధమా...ఫార్ములా కేసులో 55 కోట్లు దాటించింది అబద్ధమా.. అన్నది మాత్రం చెప్పడం లేదు. నోరుంది కదాని, రాయడానికి, వినడానికి కొందరు ఉన్నారు కదాని పదేళ్ల అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు నానాయాగీ చేస్తున్నారు. ఎసిబి విచారణను తప్పుపడుతున్నారు.ఇక్కడ గమనించాల్సిందేమంటే..అరెస్టును నిలుపుదల చేయాలన్న కేటీఆర్ అప్పీల్ కూడా తిరస్కరణకు గురైంది. ఈ క్రమంలో కేటీఆర్‌కు మరోసారి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న విచారణకు రావాలని ఈడీ అధికారులు నోటీసుల్లో తెలిపారు. నాపై అక్రమ కేసు పెట్టారని, ఇది రాజకీయ ప్రేరేపిత లొట్టపీసు కేసు అని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ కేసులో అసలు పసలేదని భావిస్తే...హైకోర్టు క్వాష్ పిటిషన్ ఎందుకు కొట్టేసినట్లు..కెటిఆర్ సమాధానం చెప్పాలి. ఎసిబి విచారణ





చేయవచ్చని కూడా చెప్పింది. అవినీతిపరులకు అంతా అవినీతే కనిపిస్తుందని ఆరోపించి నంత మాత్రాన కెటిఆర్ అవినీతి వ్యవహారం నుంచి తప్పించుకోలేరని గుర్తించాలి. అధికారం అడ్డుపెట్టుకుని అక్రమకేసు పెట్టారని ఆరోపిస్తున్న కెటిఆర్...అదే అధికారం అడ్డం పెట్టుకుని పదేళ్ల పాటు విచ్చలవిడిగా చేసిన అక్రమాలపై ఎందుకు సమాధానం చెప్పడం లేదు.నేనెలాంటి తప్పూ చేయలేదని, నాకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంది... సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తా... జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో చర్చకు సిద్ధం...ఏసీబీ, ఈడీ విచారణకు కూడా హాజరవుతా ..అంటున్న కెటిఆర్ పదేపదే కోర్టు మెట్లు ఎక్కాలని ఎందుకు చూస్తున్నారో చెప్పాలి. ప్రపంచంలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు తేవాలని ఫార్ములా ఈ–కార్ రేస్‌ను నిర్వహించామని, దాని నిర్వహణకు సంబంధించిన విధానపరమైన నిర్ణయాలకు మంత్రి హోదాలో సంతకాలు చేశానని ఏసీబీ అధికారుల ప్రశ్నలకు కేటీఆర్ సమాధానమిచ్చినట్టు సమాచారం. అయితే ఆర్థిక అనుమతులు లేకుండా ఎందుకు డబ్బును దాటించారన్న దానికి సూటిగా సమాధానం చెప్పడం లేదు. డొంకతిరుగుడు మాటలు మానేసి డబ్బులు ఎందుకు దాటించారో చెప్పాలి. కానీ దీనికి సమాధానం లేదు. ఈ ఫార్ములా ఆగిపోవడంతో హైదరాబాద్ బ్రాండ్ దెబ్బతిన్నదని గగ్గోలు పెడితే చెవిలో ఎవరూ పూలు పెట్టుకోలేదని గుర్తించాలి. ముఖ్యంగా క్యాబినెట్ ఆమోదం లేకుండా డబ్బులు ఎలా బదిలీ చేశారనే అంశం గురించి ప్రశ్నిస్తుంటే..ఇంతవరకు కెటిఆర్ లేదా ఆయన అనుచర గణం సమాధానం ఇవ్వండ లేదు. ఈ ఒక్క కేసే కాదు వంద కేసులు పెట్టినా పోరాటం ఆపబోమని, ప్రతినిత్యం ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూనే ఉంటామని అహంకార పూరిత ప్రకటనలు చేసినంత మాత్రాన అవినీతి కేసులు ఆగిపోవు. నేను ఎలాంటి తప్పూ చేయలేదు.. ఎవరికీ తలవంచేది లేదు అని ప్రజలు ఎంతోకాలం మభ్య పెట్టలేమని కెటిఆర్ గుర్తిస్తే మంచిది. ఫార్ములా ఈ రేస్‌లో ముఖ్యమంత్రి డైరెక్షన్‌లోనే ఏసీబీ విచారణ చేపట్టిందని వాదించడం ద్వారా కెటిఆర్ తన పార్టీ వాళ్లకు నమ్మకం కలిగించవచ్చు..కానీ ప్రజలకు, ఎసిబికి నమ్మకం కలిగించలేరు. ఏసీబీ కేసులో పసలేదనే విషయం కేసు పెట్టినవారికి కూడా తెలుసంటూ ఇంకా బుకాయింపులు ఎందుకో కెటిఆర్ గారు చెప్పాలి. పస ఉందా లేదా అన్నది వారు విచారణలో తేలుస్తారు. అప్పటి వరకు కొంచెం ఓపిక పట్టాలి. అవినీతి కేసులు ఒక్కొక్కటి బుసకొడుతూ బయటకు వస్తుంటాయి. సీనియర్ ఐఏఎస్ అర్వింద్‌కుమార్‌తోపాటు, హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిశోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా కేటీఆర్‌ను ఎసిబి ప్రశ్నిస్తోంది. రేసు రద్దు వల్ల జరిగిన నష్టానికి ముఖ్యమంత్రి పైన కూడా కేసు నమోదు చేయాలనే వితండవాదన కూడా కెటిఆర్ తెరపైకి తెచ్చారు. రేసుల వల్ల ఇమేజ్ పెరిగితే గుర్రాలు, పత్తాల రేసులు కూడా పెట్టుకోవచ్చు. ఇక రేసులతో ఏమైనా చేయవచ్చనే మూర్ఖవాదన నుంచి కెటిఆర్ బయటపడితే మంచిది. అవినీతి ఎవరు చేసినా శిక్షార్హులే. అందుకు కెటిఆర్ కాదు..మరెవరూ అతీతం కాదని గుర్తించాలి.

# లొట్టపీసు కేసులో కెటిఆర్ అరెస్ట్ అయితే..?

**పార్టీని ముందుకు తీసుకెళ్లేదెవరో..**

**పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న చర్చ ఇదే**

**పెద్దాయన ఫామ్‌హౌజ్ వీడి వస్తారా అన్నది అనుమానమే**

**హైదరాబాద్,జనవరి15 :**
బీఆర్ఎస్ పార్టీ అంటే కేసీఆర్ కుటుంబ సభ్యులు, బంధువుల పార్టీ అన్నది జగమెరిగిన సత్యం. పార్టీ అంతా కెసిఆర్, కెటిఆర్, కవితల ఆధ్వర్యంలో నడుస్తుంది. పైకి హరీష్ రావు కనిపిస్తున్నా..ఆయనది నిమిత్తమైన పాత్ర. ఆయన గగ్గోలు బ్యాచ్‌లో ఉంటారు. అందుకే కేటీఆర్‌పై కేసు నమోదు కాగానే అడ్డదిడ్డమైన వాదనలు, అరుపులతో గగ్గోలు పెట్టాలని చూశారు. మొత్తంగా గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలుగా పనిచేసి వారంతా వచ్చి తమ సానుభూతి ప్రకటించి, దారాన్ని తాడులా పేనినట్లుగా ఒక్కటి కావాలనే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో భూకంపం వచ్చిందన్న భ్రమలు కలగించే పరిస్థితి ఉన్నట్లుగా చూపిస్తున్నారు. ఈ క్రమంలో కెసిఆర్ ఫామ్‌హౌజ్ వీడి బయటకు రావడం లేదు. ఒకవేళ కెటిఆర్ అరెస్ట్ అయితే పార్టీని ఎవరు నడిపిస్తారన్న చర్చ సాగుతోంది. ఎందుకంటే నేరుగా హరీష్ రావు చేతిలో పగ్గాలు పెట్టడం ఆ ఇంటి పెద్దలకు ఇష్ట లేదు. కెటిఆర్ పరోక్షంలో బీఆర్ఎస్ పార్టీని ఎవరు నడిపించాలనే దానిపై కేసీఆర్ కూడా చర్చిస్తున్నట్టు తెలుస్తోంది. ఫార్ములా ఈ రేస్ కేసులో ప్రభుత్వం వద్ద ఇప్పటికే అనేక బలమైన సాక్ష్యాధారాలు ఉన్నాయి. ఈ కేసు ఊరికే ముగిసేది కాదు. దర్యాప్తు జరుగుతూ పోతుంటే, మరిన్ని కొత్త విషయాలు బయటకు వచ్చేట్లున్నాయి. ఇలాంటి స్థితి కనిపిస్తున్న సందర్భంలో కేటీఆర్ చాలా అసహనానికి గురవుతున్నారని ఆయన ఎదురుదాడి విమర్శను బట్టి అర్థం చేసుకోవచ్చు. పైసా అవినీతి జరగలేదు..ప్రభుత్వ పరంగా జరగాల్సిన విచారణలో అవినీతి ఎక్కడుందని, ఇంకా గట్టిగా వాదిస్తూ.. లొట్టపీసు కేసు అని పదేపదే చెబుతున్నారు. ఇది ఆయనలోని అసహనాన్ని బయటపెడుతున్నాది. ఆయన లాయర్లు ఇది లొట్టపీసు కేసు కదని చెప్పే ఉంటారు. పదేపదే ఇదే పదం వాడుతూ, సిఎం ర ఏవంత్ రెడ్డిని కూడా అనరాని మాటలతో విమర్శలు చేస్తూ.. తనలోని ఇకపోతే÷–స్టేషన్‌ను బయటపెట్టుకుంటున్నారు. వందిమాగధులు చేరి, ఎంతగా ఎదురుదాడికి పూనుకున్నా ఈ లొట్టపీసు గట్టి కేసు అని మున్ముందు రుజువు కాబోతున్నదనడంలో సందేహం అక్కర్లేదు. కపోతే ఈ లొట్టపీసు కేసులో 'విదేశీ కంపెనీకి పురపాలకశాఖ నేరుగా నిధులు చెల్లిస్తే చట్టపరమైన సమస్యలు వస్తాయిన కేటీఆర్‌కు తెలియంది కాదు. కెటిఆర్ కూడా మళ్లీ తామే అధికారంలోకి



వచ్చేది కనుక ఏమీ కాదన్న ధోరణిలో అతి విశ్వాసంతో ,,,అంతా తాను చూసుకుంటానని ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్‌కు భరోసా ఇచ్చి వుంటారు. ప్రజాధనం దుర్వినియోగమవుతుంటే కాపాడలేకపోవడం వాస్తవమే అన్న నిజాన్ని ఈ లొట్టపీసు కేసులో ఏ2గా ఉన్న నాటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్ గుర్తించి వుంటారు. ఎసిబి విచారణలో ఆయన తప్పకుండా నిజాలు చెప్పేవుంటారు. కేబినెట్ ఆమోదం లేకపోవడం, ఆర్థికశాఖ అనుమతి తీసుకోకపోవడం వంటివి కెటిఆర్ మంత్రిగా తెలుసుకోకుండా చేసిన పనులు. అయితే ఏమీ కాదులే ..అంత మనదే రాజ్యం అన్న ధీమాలో కెటిఆర్ ఉండివుంటారు. అంతేనా అంటే ఇక కాబోయే సిఎంను నేనే అని కూడా భావించి ఉంటారు. అందుకే ఈ బరితెగింపు నిర్ణయం తీసుకుని ఉంటారు. సాధారణంగా ఇలాంటి కేసుల్లో ఎక్కువగా డాక్యుమెంట్లు, ఇతర ఆధారాల అనుగుణంగానే విచారణ జరుగుతుంది. ఇలాంటి విషయలు ఏవైనా అరవింద్ కుమార్ ఎసిబికి అందించివుంటే .. కేటీఆర్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయినట్లేనని భావించాలి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినతర్వాత ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి లేదు. అలాంటిది ఓ విదేశీ కంపెనీకు డబ్బు చెల్లింపులు చేయడం మరీ నేరం. ఇకపోతే ఫార్ములా– ఈ కార్ రేసింగ్ స్కాంలో ప్రాథమిక ఆధారాలున్నట్టు హైకోర్టు స్పష్టం చేయడం బీఆర్ఎస్‌ను వణికిస్తోంది. గత వారం రోజులుగా కేటీఆర్ ప్రదర్శిస్తున్న అసహనం ఆయన తప్పును బయటకు వెల్లడిస్తోంది. తనతోపాటు తన అడ్వకేట్లను అనుమతిస్తేనే విచారణకు హాజరవుతానని మొండికేయడం, విచారణకు రాకుండా వెనక్కి వెళ్లిపోవడం ద్వారా ఆయన తన దురుసుతనాన్ని ప్రదర్శించారు. ఈ కేసు మొదలయినప్పటి నుంచి గమనిస్తే...చట్టాలకు తాము అతీతులమనే అహంభావం ఆయన ప్రవర్తనలో కనిపిస్తున్నది. అంతేకాదు.. ఈ వ్యవహారంలో ఏసీబీ, ఈడీ కేసులు నమోదుచేసిన నాటి నుంచి కేటీఆర్ మీడియా ముందు దురుసుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ కేసు ను ఓ లొట్టపీసు కేసుగా అభివర్ణించారు. ఆయనో లొట్టపీసు ముఖ్యమంత్రి అంటే ఇంకా పలురకాలుగా నోరుపారేసుకుం టూనే ఉన్నారు. ఎసిబి విచారణ నుంచి బయటకు వస్తున్న సందర్భంలో మీడియాతో మాట్లాడ వద్దన్నందుకు కూడా నోరుపారేసుకున్న తీరును చూశాం. కేసులకు, జైళ్లకు భయపడేది లేదని అంటూ వీరావేశం ఎత్తుతున్నారు.కానీ, ఆయన హైకోర్టు, సుప్రీంకోర్టు చుట్టూ తిరుగుతుండటం చూస్తే.. కేసులో దమ్ముందని, తనకు చుట్టుకుంటోందని గమనించి ఉంటారు. అందుకే కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు బయలుదేరుతూ, ఎసిబి విచారణ నుంచి వచ్చిన తరవాత కూడ మీడియా ముందుకువచ్చి, ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్ రెడ్డిని విచక్షణా రహితంగా దూషించిన తీరు సభ్యసమాజం సిగ్గుతో తలదించు కునేలా చేసింది. కేసును రాజకీయ ప్రేరేపిత కుట్రగా చూపే ప్రయత్నంలో భాగంగా అసభ్యకర వ్యాఖ్యలను, అసంబద్ధ సవాళ్లను చేస్తున్నారు. నిజానికి నిబంధనలు పాటించకుండా పెద్ద మొత్తంలో నిధులు బదిలీ చేయడంతో హెచ్‌ఎండీఏ ఆదాయపన్ను శాఖకు రూ.8 కోట్లకు పైగా జరిమానా చెల్లించాల్సి వచ్చింది. ఇదంతా ఒక ఎత్తయితే ఇక కెటిఆర్ స్థానంలో ఎవరుండి పార్టీని నడపాలన్నది వారి ముందున్న సమస్య. బహుశా కవిత ఈ భారన్ని భుజాన వేసుకునే అవకాశం లేకపోలేదు.

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో కోతలు విధించొద్దు : హరీశ్‌రావు

**సిద్దిపేట,జనవరి 15 :**
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కోతలు విధించకుండా అమలు చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. వర్చువల్‌గా నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 50 లక్షల ఈజీఎస్ కార్డులు ఉంటే కోటి రెండు లక్షల మంది ఉపాధి హామీ కూలీలుగా పనిచేస్తున్నారని వీరంతా కూలీ పనికి వెళ్లే నిరుపేదలు అని తెలిపారు. ఎస్సీ ఎస్టీ, బీసీ రైతుల ఎక్కువగా ఉంటారు. రాష్ట్రంలో కోటి 2 లక్షల మంది వ్యవసాయ కూలీలు ఈ కార్డుల ద్వారా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నారు. గుంట భూమి ఉన్న రైతులను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించం అని ప్రభుత్వం చెప్పడం దురదృష్ట కరమన్నారు. ఒక్క సెంటు భూమి ఉన్నా కూలీ కాదు అని అంటున్నారు. ఉపాధి హామీ పథకంలో ఈ సంవత్సరం 20 రోజులు పని దినాలు ఉంటేనే కూలీగా గుర్తింపు ఉంటుందనే నిబంధన కూడా సరైంది కాదన్నారు. అనారోగ్య సమస్యలతోనూ ఇతర సమస్యలతోనూ పనికి వెళ్లని కూలీలను ఉపాధి హామీ కూలీలుగా గుర్తించరు అని ప్రభుత్వం చెప్తున్నది.

ఈ నిర్ణయాన్ని కూడా ప్రభుత్వం మార్చి రైతు కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు గుంటలు ఉన్న రైతుకు సంవత్సరానికి రైతు భరోసా కింద రూ.1500 మాత్రమే వస్తాయి. ఐదు గుంటలు ఉన్న రైతుకు వ్యవసాయ కూలీ కింద రూ.12000 ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద నష్టపోతారని పేర్కొన్నారు. ముఖ్యంగా దళితులు, గిరిజనులు.. తాతకు ఎకరం భూమి ఉంటే పిల్లలు పంచుకుంటే అది ఐదు గుంటలు వస్తాయి. 5 గుంటలో పంట పండింది లేదు, వారు బతికింది లేదు. 5 గుంటలు ఉన్నందుకు 12 వేల రూపాయలు ఇవ్వం అని ప్రభుత్వం చెప్పడం శోచనీయమన్నారు. రైతు భరోసా కింద మీరు ఇస్తున్నది రూ.1500 అయితే ఎగ్గొట్టేది 12 వేల రూపాయలు. రాష్ట్రంలో ఎకరం లోపు భూమి ఉన్న రైతులు 24 లక్షల 57,000 మంది ఉన్నారు. గుంట, రెండు గుంటలు ఉన్న రైతులు రైతు భరోసా తీసుకోవడం వల్ల రైతు కూలీలకు ఇచ్చే రూ.12,000 నష్టపోతారు. కావున ఇలాంటి రైతులకు రైతు భరోసా కాకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారులుగా గుర్తించాలని ఆయన సూచించారు. ఈజీఎస్ పథకంలో కూలీలు 60 సంవత్సరాల వయసు దాటితే కార్డు కోల్పోతారు. కాబట్టి ఈ పథకంలో ఈజీఎస్ నిబంధన విధించకుండా అమలు చేయాలన్నారు.

# విశ్వజ

# పండుగ నాడు... పోషక శోభ

మకర సంక్రాంతి విందు పసందైన ఆరోగ్యాన్ని అందించేలా ఉండాలి. అందుకోసం పండుగ పిండివంటల్లో ఈ పోషకభరిత పదార్థాలకు స్థానం కల్పించాలి. సంక్రాంతితో ఆరోగ్య శోభ వెల్లివిరియడం కోసం అనుసరించవలసిన పోషక నియమాలు ఇవే!

పండుగల్లో పిండివంటలదే ప్రత్యేక స్థానం. నోరూరించే పిండివంటల్లో ఆరోగ్య ప్రయోజనాలు కూడా దాగి ఉంటాయి. వ్యాధినిరోధకశక్తిని పెంచడం ద్వారా కాలానుగుణ రుగ్మతల నుంచి రక్షణ కల్పించే బలవర్ధకమైన పోషకాలను అందించడమే పండుగనాటి పిండిపదార్థాల ?లక్ష్యం. కాబట్టి సంప్రదాయసిద్ధమైన పిండివంటలకే ప్రాధాన్యమిస్తూ, వాటిలో పోషకవిలువలకు పెద్ద పీట వేయాలంటున్నారు వైద్య నిపుణులు.



**నువ్వుల లడ్డూలు**

దీన్లోని నువ్వులు, బెల్లం, వేరుశనగలు, యాలకుల పొడిలో లెక్కలేనన్ని పోషకాలుంటాయి. సంక్రాంతి నాడు వండుకునే ఈ సంప్రదాయ పిండి వంటతో ఒరిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏవంటే...

నువ్వులు: నల్ల నువ్వుల్లో విటమిన్లు, ప్రొటీన్లు, ఇనుము, క్యాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీఆక్సిడెంట్లు ఎక్కువ. వీటితో రక్తంలో చక్కెర నియంత్రణలో ఉండడంతో పాటు, కొలెస్ట్రాల్ మోతాదులు తగ్గుతాయి. అధిక రక్తపోటు, ఇన్‌ఫ్లమేషన్ తగ్గి, జీర్ణశక్తి మెరుగు పడుతుంది.

బెల్లం: కొలెస్ట్రాల్‌ను తగ్గించి, అధిక శరీర బరువు మరింత పెరగకుండా నియంత్రించే బెల్లం ఊపిరితిత్తుల ఆరోగ్యానికి కూడా దోహదపడుతుంది.

వేరుశనగలు: పీచు, మెగ్నీషియం, ఇనుము, జింక్ మొదలైన ఖనిజ లవణాలు, బి, కె విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు వీటిలో ఎక్కువ. వేరుశనగలతో గ్లైసెమిక్ ఇండెక్స్ తగ్గి మధుమేహం అదుపులో ఉంటుంది. వీటిలోని విటమిన్ ఇ, గుండె జబ్బుల నుంచి రక్షణ కల్పిస్తుంది.

యాలకులు: రక్తపోటు తగ్గి, గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. దీన్లో క్యాన్సర్ వ్యతిరేక, బ్యాక్టీరియా వ్యతిరేక గుణాలు ఎక్కువగా ఉంటాయి. మరీ ముఖ్యంగా నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ వ్యాధిగ్రస్థులకు వేరుసెనగలు ఎంతో మేలు చేస్తాయి.

**పసందైన పొంగలి**

సుప్రసిద్ధమైన దక్షిణ భారతీయ వంటకమైన పొంగలి, బియ్యం, పెసరపప్పు, జీలకర్ర, మిరియాలు, ఇంగువ, కరివేపాకు, అల్లంతో తయారవుతుంది. వీటిలో పోషకాలు ఏవంటే...

పెసరపప్పు: ఈ పప్పుతో మధుమేహం నియంత్రణతో పాటు, కాలేయం దెబ్బతినకుండా రక్షణ దక్కుతుంది. వ్యాధినిరోధకశక్తి మెరుగు పడుతుంది. పెసరపప్పులో మాంసకృత్తులు, పీచు, ఫోలేట్, విటమిన్ కె, సిలు ఎక్కువ. కీలకమైన పెప్టైడ్స్, పాలీఫినాల్స్ మొదలైన సమ్మేళనాలు కూడా సమృద్ధిగా దొరుకుతాయి.

ఇంగువ: జీర్ణ సంబంధ సమస్యలైన పొట్ట నొప్పి, పేగుల్లోని పరాన్నజీవులు, కడుపుబ్బరంతో పాటు ఉబ్బసం, బ్రాంకైటిస్, కోరింత దగ్గులకు ఇంగువ ఔష?ధంలా ఉపయోగపడుతుంది.

కరివేపాకు: కార్బజోల్ ఆల్కలాయిడ్స్‌ను సమృద్ధిగా కలిగి ఉండే కరివేపాకుకు మధుమేహాన్ని తగ్గించే గుణాలు కూడా ఉంటాయి. అలాగే నాడులను కాపాడే స్వభావం కూడా ఉంటుంది. కరివేపాకుతో జీర్ణసంబంధ సమస్యలతో పాటు, పైల్స్, ఎడీమా, ఒళ్లు నొప్పులు కూడా తగ్గుతాయి.

అల్లం: ఎన్నో వేల సంవత్సరాలుగా అధిక రక్తపోటు, దగ్గు, జలుబు, కీళ్ల నొప్పులు, ఇతరత్రా ఇన్‌ఫ్లమేటరీ సమస్యల చికిత్సల్లో అల్లాన్ని ఉపయోగిస్తున్నారు.

**బలవర్ధకమైన బెల్లం పాయసం**

కొత్త బియ్యం, కొత్త తాటి బెల్లంతో తయారుచేసే బెల్లం పాయసం సంక్రాంతి నాడు వండుకునే తీపి పిండివంటకం. వీటిలోని పోషకాల గురించి తెలుసుకుందాం!

తాటి బెల్లం: ఈ సహజసిద్ధ తీపి పదార్థంలో ఎన్నో పోషకాలుంటాయి. శక్తి పెరగడంతో పాటు, జీర్ణశక్తి మెరుగు పడుతుంది. మైగ్రెయిన్ నొప్పులు తగ్గుతాయి. బరువు తగ్గడంలో సహాయపడుతుంది. కీళ్లనొప్పులు, నెలసరి నొప్పులు తగ్గుతాయి. అల్జీమర్స్ లాంటి నాడీక్షీణత వ్యాధులను నయం చేయడంలో తాటి బెల్లం కీలక పాత్ర పోషిస్తుంది.

పండుగ వేళల్లో మనం భిన్నమైన పిండి వంటలతో కమ్మని రుచులకే ప్రాధాన్యమిస్తాం. కానీ నిజానికి ప్రత్యేకించి సంక్రాంతి పండుగ నాటి పిండివంటలు అంతకు మించిన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. కాబట్టి ఆత్మన్యూనతకు గురి కాకుండా, బరువు పెరిగిపోతాయమనే భయం లేకుండా పండుగ నాటి పిండిపదార్థాలను ఆస్వాదించాలి. అయితే అతి సర్వత్రా నష్టదాయకమే! కాబట్టి పరిమితంగా ఆస్వాదించడం మర్చిపోకూడదు. మరీ ముఖ్యంగా మధుమేహులు ఒకట్రెండు తీపి పదార్థాలకే పరిమితం కావాలి. పండుగ విందుల్లో ఇలాంటి సూపర్ ఫుడ్స్‌ను జోడించుకోవడం ద్వారా అటు సంప్రదాయాన్నీ, ఇటు పోషణనూ సమంగా సమన్వయం చేసుకోవాలి. అలాంటప్పుడే పండుగ వేడుకల ప్రయోజనాలను సంపూర్తిగా అందుకోగలుగుతాం!

**పోషకభరిత నువ్వులు**

నువ్వుల్లో జింక్, క్యాల్షియం, పీచు సమృద్ధిగా ఉంటాయి. నువ్వులు ఆరోగ్య ప్రయోజనాలను అందించే శక్తిభాండాగారాల్లాంటివి. కాబట్టి నువ్వులతో లడ్లు చేసుకోవాలి. అరిసెల్లో కూడా నువ్వులు చేర్చాలి.

**బలవర్ధకమైన బెల్లం**

చక్కెరను బెల్లంతో భర్తీ చేయడం అన్నివిధాలా ప్రయోజనకరమే! ఈ సహజసిద్ధ తీపిపదార్థంలో ఇనుము, మెగ్నీషియం, పొటాషియం ఎక్కువగా ఉంటాయి. బెల్లంతో పిండివంటలకు ప్రత్యేకమైన రుచితో పాటు పోషకాలు కూడా సమకూరతాయి.

**కమ్మని కుంకుమ పువ్వు**

రుచి, పోషకవిలువలను పెంచే కుంకుమ పువ్వును తీపి వంటకాల్లో విరివిగా వాడుతూ ఉంటాం. వీటిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు నొప్పులు వాపులను తగ్గిస్తాయి. రుచి, ఆరోగ్యం పరంగా ప్రయోజనకరంగా ఉండే కుంకుమ పువ్వు ఖరీదే అయినప్పటికీ పండుగ సందర్భాల్లో తప్పనిసరిగా వాడుకోవాలి.

**దారుఢ్యాన్ని పెంచే నట్స్**

బాదం, వాల్‌నట్స్, పిస్తాల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు, మాంసకృత్తులు, పోషకాలు ఉంటాయి. కాబట్టి తీపి వంటకాల్లో వీటిని ఎక్కువగా ఉపయోగించుకోవాలి. పండుగ పనుల్లో తీరిక లేని పనులతో అలసటకు లోనవకుండా, రోజంతా అప్పుడప్పుడూ నట్స్‌ను తింటూ ఉంటే, నిస్సత్తువ ఆవరించకుండా ఉంటుంది.

**పొట్టు తీయని ధాన్యం**

సజ్జలతో, జొన్నలు లాంటి పొట్టుతీయని వాటినే పిండివంటలకు ఉపయోగించడం ఉత్తమం. వీటిలో పీచుతో పాటు పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. దాంతో జీర్ణశక్తి మెరుగ్గా ఉంటుంది. పండుగ కార్యకలాపాలన్నింట్లో చురుగ్గా పాల్గొనే శక్తి సమకూరుతుంది.

## మీలో ఈ చెడు అలవాట్లు ఉన్నాయా.. ఏ అబ్బాయి మిమ్మల్ని ప్రేమించడు..



మీరు చాలా అందంగా ఉన్నా సరే ఈ 5 చెడు అలవాట్లు మీలో ఉంటే ఏ అబ్బాయి కూడా మీతో ప్రేమలో పడడు. ఒకవేళ మీ అందం చూసి లవ్ చేసినా ఆ బంధం ఎక్కువ కాలం కొనసాగదు. ఎందుకంటే.. కొంత మంది మనిషి అందం చూసి ప్రేమిస్తారు..ఇంకొంతమంది మనిషిలోని గుణాలను చూసి ప్రేమిస్తారు. అయితే, అందాన్ని చూసి ప్రేమించేవారి కన్నా గుణాలను చూసి ప్రేమించే వారు జీవితంలో సంతోషంగా ఉంటారు. కానీ, అమ్మాయిలు అందంగా ఉండి ఈ 5 చెడు లక్షణాలు ఉంటే మాత్రం ఏ అబ్బాయి మనస్ఫూర్తిగా ప్రేమించడు. ఒకవేళ ప్రేమించినా ఆ బంధం ఎక్కువ కాలం కొనసాగదు. ఎందుకంటే అందం ఆధారంగా ఏ సంబంధమూ ఎక్కువ కాలం సాగదు. మీ ప్రవర్తనలో కొన్ని చెడు అలవాట్లు ఉంటే, మీ అందం కూడా ఆ ప్రభావాన్ని కాపాడదు. అబ్బాయిలు తరచుగా అలాంటి అలవాట్లకు దూరంగా ఉండటానికి ఇష్టపడతారు, ఇది వారి ఆత్మగౌరవం లేదా శాంతిని ప్రభావితం చేస్తుంది. మీరు అందం ఉన్నప్పటికీ అబ్బాయిలు మీకు దూరం కాగల ఆ 5 చెడు అలవాట్లను ఇప్పుడు తెలుసుకుందాం..

1. అబ్బాయిలను తగ్గించడం:
మీరు ప్రతి చిన్న విషయాన్ని విమర్శించడం లేదా ఇతరులలో ఎల్లప్పుడూ తప్పులు కనుగొనడం మంచిది కాదు. ఎందుకంటే ఈ అలవాటు ఎవరికైనా అసౌకర్యాన్ని కలిగిస్తుంది. సంబంధాలలో సానుకూలత, ప్రశంసలు అవసరం. అబ్బాయిలు తరచుగా తమ బలహీనతలను అర్థం చేసుకుని, పదే పదే వారిని నిరాశపరచకుండా ఉండే మహిళను భాగస్వామిగా చేసుకోవాలని కోరుకుంటారు.
2. మితిమీరిన అహం:
మితిమీరిన అహం మీ బంధం తెగిపోయేలా చేస్తుంది. మీరు ఎల్లప్పుడూ మీ అభిప్రాయాన్ని సరైనదని నిరూపించడానికి ప్రయత్నించడం కరెక్ట్ కాదు. ఇతరుల భావాలను గౌరవించాలి.
3. అబద్ధం చెప్పే అలవాటు:
అబద్ధం చెప్పే అలవాటు ఉంటే మానుకోవడం మంచిది. ఎందుకంటే ఇది మనిషిపై నమ్మకం లేకుండా చేస్తుంది. మీ బంధం ఎక్కువ కాలం కొనసాగాలంటే నిజాయితీగా ఉండండి. అబ్బాయిలు నమ్మకం లేని అమ్మాయిలతో ఉండటానికి ఇష్టపడరు.
4. ప్రతికూలంగా ఉండటం:
మీరు ఎల్లప్పుడూ ప్రతికూలంగా ఆలోచించడం మంచిది కాదు. ప్రతి సందర్భంలోనూ చెడును మాత్రమే చూస్తే మీ పార్టనర్ మీపై విసుగు చెందవచ్చు. అంతేకాకుండా ఈ అలవాటు ఇతరులను మీ నుండి దూరం చేస్తుంది.
5. మితిమీరిన నియంత్రణ:
ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ అవసరం. మీరు ప్రతి విషయంలోనూ మీ భాగస్వామిని నియంత్రించడానికి ప్రయత్నిస్తే అతడు మీపై విరక్తి చెంది మీ నుండి దూరం అవుతాడు. కాబట్టి మితిమీరిన నియంత్రణ మంచిది కాదు.

# వ్యాపారం

# తగ్గేదే లే.. ప్రపంచంలోనే భారత్ మూడో స్థానం.. అతిపెద్ద మెట్రో నెట్‌వర్క్!

భారతదేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతోంది. ఇతర దేశాల సరసన స్థానం దక్కించుకుంటోంది. అన్నింటిలోనూ భారత్ ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. భారత్‌కు ప్రత్యేక గుర్తింపు వస్తోంది. ఇలాగే మెట్రో రైల్ విషయంలో కూడా భారత్‌కు ప్రత్యేక స్థానం దక్కింది. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మెట్రో రైలు నెట్‌వర్క్‌ను భారత్ సొంతం చేసుకుంది..

ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మెట్రో రైలు నెట్‌వర్క్‌ను భారత్ సొంతం చేసుకుంది. 1,000 కి.మీ మెగా మెట్రో రైలు నెట్‌వర్క్ మైలురాయిని ఇటీవలే చేరుకుంది. పది రోజుల క్రితం ఢిల్లీ మెట్రో నాల్గవ దశ ప్రాజెక్టులో భాగంగా 2.8 కిలోమీటర్ల పొడవైన జంకాపురి, కృష్ణా పార్క్ లైన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. సాహిబాబాద్, న్యూ అశోక్ నగర్ మధ్య ఢిల్లీ ఘజియాబాద్ మీరట్ నమో భారత్ కారిడార్ 13 కి.మీ విస్తరణను కూడా మోడీ ప్రారంభించారు. దీంతో భారత్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్ 1,000 కిలోమీటర్ల మైలురాయిని అధిగమించింది. ఈ ఘనత సాధించిన మూడో దేశంగా భారత్ నిలిచింది. భారతదేశం కంటే చైనా, అమెరికాలలో ఎక్కువ మెట్రో రైలు నెట్‌వర్క్ ఉంది.

భారతదేశంలో మొదటి మెట్రో రైలు నెట్‌వర్క్ 1984లో కోల్‌కతాలో స్థాపించారు. అయితే, ఆధునిక మెట్రో వ్యవస్థ మొదట ఢిల్లీలో నడిచింది. జపాన్ టెక్నాలజీ సాయంతో ఢిల్లీలో మెట్రో నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేశారు. ఇప్పుడు ఢిల్లీ మెట్రో ప్రపంచంలోనే 16వ అతిపెద్ద మెట్రో వ్యవస్థ.



బెంగళూరుతో సహా దేశంలోని 23 నగరాల్లో ఇప్పుడు మెట్రో రైలు వ్యవస్థలు ప్రారంభమయ్యాయి. 11 రాష్ట్రాలు మెట్రో సేవలను కలిగి ఉన్నాయి. 2014లో భారతదేశంలోని వివిధ మెట్రో రైళ్లలో రోజుకు 28 లక్షల మంది ప్రయాణించేవారు. నేడు రోజుకు కోటి మంది ప్రయాణిస్తున్నారని నివేదికలు చెబుతున్నాయి. గత కొద్ది రోజులుగా ప్రధాని నరేంద్ర మోడీ అనేక మెట్రో రైలు ప్రాజెక్టులు, పనులను ప్రారంభించారు. ఢిల్లీ ఘజియాబాద్ మీరట్ నమో భారత్ కారిడార్‌ను రూ.4,600 కోట్లతో 13 కిలోమీటర్ల పొడవున నిర్మించారు. ఢిల్లీ, మీరట్ మధ్య మంచి వేగంతో ప్రయాణించే అవకాశం ఉంది. రూ.1200 కోట్లతో జనక్‌పురి-కృష్ణా పార్క్ మధ్య మెట్రో రైలు మార్గాన్ని నిర్మించారు. మోడీ ఈ మార్గాన్ని కూడా ప్రారంభించారు. ఢిల్లీ మెట్రో నాల్గవ దశలో భాగమైన రిటాలా, కుండ్లీ సెక్షన్‌లోని 26.5 కి.మీ విభాగానికి ప్రధాని శంకుస్థాపన చేశారు.

ఢిల్లీ మెట్రో తర్వాత భారతదేశంలో అతిపెద్ద మెట్రో రైలు వ్యవస్థ బెంగళూరులో ఉంది. సిలికాన్ సిటీలో ఇప్పటివరకు నిర్మించిన మెట్రో రైలు మార్గాల పొడవు 76 కి.మీ కంటే ఎక్కువ. ఢిల్లీ మెట్రో దాదాపు 350 కి.మీ మేర భారీ మెట్రో నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. అత్యధిక మెట్రో రైలు నెట్‌వర్క్‌ను కలిగి ఉన్న హైదరాబాద్ బెంగళూరుకు దగ్గరగా ఉంది. ఇక్కడ 71 కిలోమీటర్ల పొడవైన మెట్రో రైలు నెట్‌వర్క్ ఉంది. కోల్‌కతా, ముంబై, అహ్మదాబాద్, చెన్నై నగరాల్లో మెట్రో నెట్‌వర్క్ 50 కి.మీ కంటే ఎక్కువ.

## కేంద్ర బడ్జెట్ లో వేతన జీవులకు భారీ ఊరట.. 80సీపై కీలక నిర్ణయం

కేంద్ర బడ్జెట్ ను పార్లమెంటులో ప్రవేశపెట్టే సమయం దగ్గర కొచ్చే కొద్దీ, దానిపై అంచనాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. బడ్జెట్ లో అందించే మినహాయింపులు, రాయితీలపై చర్చ ఎక్కువగా జరుగుతోంది. ముఖ్యంగా ఆదాయపు పన్ను చెల్లించే వారు పన్ను రాయితీలు పెంచుతారని ఆశగా ఎదురు చూస్తున్నారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరిలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈసారి ఆదాయపు పన్ను చట్టంలోని 80సీ పరిధిని పెంచుతారనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి.

ఆదాయపు పన్ను చెల్లించేవారందరూ ప్రతి ఏటా ఆదాయపు పన్ను రిటర్న్లు (ఐటీఆర్) సమర్పించాలి. ఆ ఆర్థిక సంవత్సరంలో వారి సంపాదన, ఖర్చులు తదితర వివరాలన్నీ దానిలో ఉంటాయి. వాటిని పరిశీలించిన అనంతరం ఎంత పన్ను చెల్లించాలో ఆ శాఖ అధికారులు నిర్ణయిస్తారు. ఈ క్రమంలో పన్ను చెల్లింపుదారుడికి కొన్ని రాయితీలు అందిస్తాయి. వాటిలో 80 సీ కింద పలు తగ్గింపులు ఉంటాయి. వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులతో పాటు హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్ యూఎఫ్ లు) కొన్ని పెట్టుబడులు, ఖర్చులను దీని ద్వారా క్లెయిమ్ చేసుకోవచ్చు.

ఆదాయపు పన్ను చెల్లింపులో పాత, కొత్త విధానాలు అనే రెండు రకాలు ఉన్నాయి. వీటిలోని పాత విధానంలో 80 సీ సెక్షన్ మినహాయింపులు ఎక్కువగా ఉంటాయి. దీనికింద పెట్టే పెట్టుబడులకు రూ.1.50 లక్షల వరకూ మినహాయింపు లభిస్తుంది. చాన్నాళ్లుగా ఈ పరిమితి పెరగనందున ఈసారి తప్పకుండా పెంచుతారని ఆర్థిక వేత్తలు భావిస్తున్నారు.

ఆదాయపు పన్ను చట్టంలోని 80సీ సెక్షన్ కింద కొన్ని రకాల పెట్టుబడులు, ఖర్చులకు మినహాయింపులు లభిస్తాయి.

మ్యూచువల్ ఫండ్స్ లో ఈక్విటీ లింక్డ్ సేవింగ్ స్కీములు (ఈఎల్ఎస్ఎస్)
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్సీ)
ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్స్ (ఈపీఎఫ్) విరాళం
60 శాతం కనీస కేటాయింపుతో యూనిట్ లింక్డ్ ఇన్స్యూరెన్స్ ప్లాన్లు (యూఎల్ఐపీ)
సుకన్య యోజన పథకం కట్టుబడి
సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్సీఎస్ఎస్)
బ్యాంకుల్లో ఐదేళ్ల పన్ను ఆదా ఫిక్స్ డ్ డిపాజిట్లు
80సీ పరిధిలోకి వచ్చే ఖర్చులు
ఇద్దరు పిల్లలకు ట్యూషన్ ఫీజు
ఇంటిరుణాలపై అసలు మొత్తం తిరిగి చెల్లించడం
జీవిత బీమా పాలసీలకు చెల్లించిన ప్రీమియాలు
నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్ పీఎస్) వంటి పెన్షన్ పథకాలకు చెల్లించిన విరాళాలు.


ఆదాయపు పన్ను రిటర్న్లు దాఖలు చేసినప్పుడు మన ఆదాయం వివరాలతో పాటు పైన తెలిపిన పెట్టుబడులు, ఖర్చులను క్లెయిమ్ చేసుకోవచ్చు. ఆ శాఖ అధికారుల పరిశీలన అనంతరం నిబంధనల మేరకు పన్ను చెల్లింపుదారుడికి రాయితీలు వర్తింపజేస్తారు. 80 సీ సెక్షన్ కింద మినహాయింపు పరిధి 2014 నుంచి రూ.1.50 లక్షలుగా కొనసాగుతోంది. ప్రస్తుతం పెరిగిన జీవన వ్యయం, ఖర్చులు తదితర వాటికి అనుగుణంగా మినహాయింపును పెంచే అవకాశం ఉంది.

## రూపాయి.. మహాప్రభో

**ఒక్కరోజే 66 పైసలు క్షీణత.. గత రెండేండ్లలో తొలిసారి ఆల్‌టైమ్ కనిష్ఠానికి దేశీయ కరెన్సీ**

**డాలర్‌తో పోల్చితే 86.70కు మారకపు విలువ**

ముంబై, : డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ దారుణంగా క్షీణించింది. సోమవారం ఒక్కరోజే ఏకంగా 66 పైసలు దిగజారింది. దాదాపు గత రెండేండ్లలో ఈ స్థాయిలో ఎప్పుడూ పడిపోకపోవడం గమనార్హం. 2023 ఫిబ్రవరి 6న 68 పైసలు పతనమైంది. మళ్లీ ఇప్పుడే అంతటి నష్టం వాటిల్లింది. ఈ క్రమంలోనే మునుపెన్నడూ లేనివిధంగా ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ వద్ద రూపీ వాల్యూ 86.70 స్థాయికి చేరి ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకింది. నిజానికి గతకొద్ది రోజులుగా డాలర్ ఎదుట ఏమాత్రం నిలదొక్కుకోలేకపోతున్న భారతీయ కరెన్సీ.. రోజుకింత క్షీణిస్తూ ఆల్‌టైమ్ కనిష్ఠాల్లోనే కదలాడుతున్నది. కాగా, అమెరికా మార్కెట్‌లో అంచనాల్ని మించి ఉద్యోగ వృద్ధి నమోదవడం.. డాలర్‌కు ఒక్కసారిగా డిమాండ్‌ను తెచ్చిపెట్టిందని ఫారెక్స్ మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇదిలావుంటే రూపాయి విలువ పతనం.. ఎగుమతిదారులకు పరిమిత శ్రేణిలోనే ప్రయోజనాలను తెచ్చిపెడుతుందని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. దేశీయ ఎగుమతుల కంటే దిగుమతులే ఎక్కువగా ఉండటం, అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చిత వాతావరణం నెలకొనడం ఇందుకు కారణాలుగా వారు పేర్కొంటున్నారు. మరోవైపు రూపాయి నష్టం.. దేశ ఆర్థిక వ్యవస్థకూ దెబ్బేనని, ద్రవ్యోల్బణం విజృంభణకు దారితీయవచ్చని కూడా వారు హెచ్చరిస్తున్నారు. రూపీ నష్టాలకు బ్రేక్ పడకపోతే సంక్షోభం ముప్పు ఖాయమన్న ఆందోళనల్నీ వెలిబుచ్చుతున్నారు. మరోవైపు రూపాయి పతనం రాజకీయంగానూ ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. అధికార బీజేపీ ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా అత్యంత స్థిరంగా ఉన్న కరెన్సీల్లో రూపాయి ఒకటని అంటుండగా, కాంగ్రెస్ మాత్రం మసిబూసి మారేడుకాయ చేస్తున్నారని ధ్వజమెత్తుతున్నది.



# దొంగతుర్తి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలి



**ధర్మారం, తారజ్యోతి ప్రతినిధి:**
మండలంలోని దొంగతుర్తి గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మండల సాధన సమితి సభ్యులు మంగళవారం బొట్లవనపర్తి, చింతలపల్లి, బుచ్చయ్యపల్లి, పైడిచింతలపల్లి గ్రామాల్లోని తాజా మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులను కలసి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపినట్లు మండల సాధన సమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ధర్మారం మాజీ ఎంపీపీ పాక మల్లీశ్వరి వెంకటేశం, బొట్లవనపర్తి మాజీ సర్పంచులు పెంచాల రాజేశం, తీగల రాజేశం, బుచ్చయ్యపల్లి తాజా మాజీ సర్పంచ్ ఇమిడిశెట్టి కొమురయ్య, సింగిల్ విండో డైరెక్టర్ మోర కొమురయ్య, ధర్మారం మండల బ్రాస్ బ్యాండ్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కళ్లపల్లి లింగయ్య, రచ్చపల్లి మాజీ ఉపసర్పంచ్ చిందం మల్లేశం, కతెర్ల కొమురయ్య, సాధన సమితి తదితరులున్నారు.

# కమ్మని విందుల కనుమ పండుగ

**ఎక్స్ వేదికగా బాబు శుభాకాంక్షలు**

**అమరావతి,జనవరి15 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు కనుమ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. కమ్మని విందుల కనుమ పండుగ అందరి కుటుంబంలో సంతోషం నింపాలని ఆకాంక్షించారు. రైతుల జీవితాలతో విడదీయరాని అనుబంధం పెనవేసుకొన్న పశు సంపదను పూజించే పవిత్ర కర్తవ్యాన్ని ఈ పర్వదినం మనకు బోధిస్తుందని చెప్పారు. కాలం మారినా తరగని అనుబంధాల సంపద మనదని పేర్కొన్నారు. ఆ విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు వివరించారు. తెలుగు ప్రజలకు ఏపీ మంత్రి లోకేశ్ కనుమ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండగ అన్నదాతలకు అత్యంత ప్రీతిపాత్రమైందని చెప్పారు. 'రైతన్నలు ఏడాది పొడవునా తమ కష్టంలో పాలుపంచుకునే పశువులను పూజించే పర్వదినమని ఇది. అన్నదాతల ఇల్లు ధాన్యరాశులతో నిండుగా, పాడిపంటలతో పచ్చగా.. ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నా. కనుమ.. అన్ని ప్రయత్నాల్లో విజయాన్ని, ఆనందాన్ని తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నా' అని లోకేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

# ప్రజాధనంతో సైకిల్ ట్రాక్‌లా

**పిటిషనర్‌పై సుప్రీం ఆగ్రహం**

న్యూఢిల్లీ,జనవరి15: ప్రభుత్వం వద్ద ఉన్న డబ్బుతో దేశం అంతా సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని పిటిషన్ వేసిన వ్యక్తిపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఖజానా నుంచి వచ్చే డబ్బును పేదలకు ఇళ్లు, ఆరోగ్యం, విద్యా మొదలైన సౌకర్యాలు కల్పించడానికి వినియోగించాలా లేక దేశంలో సైకిల్ ట్రాక్‌లు వేయడానికి ఉపయోగించాలా అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. అనేక నగరాల్లో పేద ప్రజలు సరైన నివాసాలు లేక మురికి వాడల్లో నివసిస్తున్నారని.. వారికి సరైన ఆరోగ్య, విద్యా సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేసింది. దేశ ప్రజల సమస్యలు వదిలేసి సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు గురించి న్యాయస్థానాన్ని ఆశ్రయించిన మీ ఆలోచన చాలా గొప్పదని చురకలు అంటించింది. పిటిషనర్ తరపున న్యాయవాది మాట్లాడుతూ ఎంపిక చేసిన నగరాలు, పట్టణాలలో ప్రాథమిక మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించే అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్కీమ్‌ను ప్రస్తావించారు. దీని కింద అనేక రాష్టాల్లో సైకిల్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారని తెలిపారు. చలి కాలంలో విపరీతమైన మంచు, వాయుకాలుష్యం వల్ల దేశ రాజధానిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని..సైకిల్ ట్రాక్‌లు నిర్మించడం వల్ల వాటిని కొంత మేరకు నివారించే అవకాశం ఉందని పేర్కొన్నారు. పిటిషనర్ కోరిన విధంగా ప్రభుత్వాలు చేస్తాయని అనుకోవడం అతడి పగటి కలే అవుతుందని పేర్కొంటూ.. న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది.

# తిరుమలలో విషాద ఘటన

**మూడో అంతస్థుపై నుంచి పడి బాలుడు మృతి**

**తిరుపతి,జనవరి15:** శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధి తిరుమలలో మరో ఘోరం జరిగింది. తిరుమల ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న యాత్రికుల వసతిగృహ సముదాయం రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తూ పడి మూడేళ్ల బాలుడు మృతిచెందాడు. కడప చిన్నచౌక్ ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు , కృష్ణవేణి దంపతులు తమ ఇద్దరు కుమారులతో కలిసి శ్రీవారి దర్శనార్థం జనవరి 13న తిరుపతికి చేరుకున్నారు. ఈనెల 14న స్వామివారి దర్శనానికి సంబంధించిన టోకెన్లను తిరుపతిలో ఈనెల 16వ తేదీకి కేటాయించారు. ఇవాళ(బుధవారం) ఉదయం తిరుమల చేరుకున్న ఆ కుటుంబం.. పద్మనాభ నిలయంలో లాకర్ పొందారు. అనంతరం వరాహస్వామిని దర్శించుకుని తిరిగి మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో పద్మనాభ నిలయానికి చేరుకున్నారు. అయితే సాయంత్రం 5 గంటలకు అన్నతో కలిసి సరదాగా ఆడుకుంటున్న చిన్నారి సాత్విక్ శ్రీనివాసరాజు ప్రమాదవశాత్తూ రెండో అంతస్తు పైనుంచి పడిపోయాడు. అంత ఎత్తు నుంచి పడడంతో బాలుడికి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో తల్లిదండ్రులు గాయపడిన కుమారుడిని హుటాహుటిన ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స చేస్తుండగానే చిన్నారి సాత్విక్ ప్రాణాలు కోల్పోయాడు. దీంతో శ్రీనివాస్, కృష్ణవేణి దంపతులు గుండెలు పగిలేలా రోధిస్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కుమారుడు ఇక తిరిగి రాడని తెలిసి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కాగా, జనవరి 8న రాత్రి జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతిచెందగా.. పలువురు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. తాజాగా మరో ప్రాణం పోవడంతో తిరుమల ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## రాజధాని ప్రాంత రైతుల సంక్రాంతి సంబరాలు

**గుంటూరు,జనవరి15:** రాజధాని ప్రాంత అసైన్డ్ రైతులు సంబరాలు జరుపుకున్నారు. ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూసిన అసైన్డ్ రైతులకు కౌలు సొమ్ము చేతికి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. బుధవారం రాయపూడిలో అమరావతి దళిత బహుజన జెఎసి కన్వీనర్ చిలకా బసవయ్య, మరికొందరు అసైన్డ్ రైతులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వం కౌలు చెల్లించి దళిత, ఇతర పేద వర్గాలకు చెందిన అసైన్డ్ రైతుల కుటుంబాలలో పండుగ తెచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. తుళ్లూరులోని టిడిపి కార్యాలయంలోనూ సిఎం, డిప్యూటీ సిఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మిఠాయిలు పంచుకున్నారు. అమరావతి రైతు జెఎసి నాయకులు కాటా అప్పారావు, రైతులు, మహిళలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఢిల్లీ లిక్కర్ కేసులో మరోమారు కదలిక

**కేజ్రీవాల్ ఇడి విచారణకు కేంద్రం అనుమతి**

**న్యూఢిల్లీ,జనవరి15:**
దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సెగలు రేపుతోంది. ఆప్.. బీజేపీ, కాంగ్రెస్ మధ్య హైవోల్టేజ్ డైలాగ్ వార్ నడుస్తోంది. గెలుపే లక్ష్యంగా మూడు పార్టీలు సరికొత్త ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నాయి.. అయితే.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు మాజీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు మళ్లీ చిక్కులు ఎదురయ్యాయి. సరిగ్గా ఎన్నికలకు ముందు లిక్కర్ కేసు మళ్లీ కదలింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా విచారణకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి బుధవారం అనుమతి ఇచ్చింది. అయితే.. ప్రజా ప్రతినిధుల్ని విచారించాలంటే ముందస్తుగా అనుమతి ఉండాలంటూ గత నవంబర్‌లో సుప్రీం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే అనుమతి కోసం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనాకి చాన్నాళ్ల క్రితమే ఈడీ లేఖ రాసింది. దానిపై ఆయన నిర్ణయం ఇప్పుడు తీసుకున్నారు. ఆ వెంటనే కేంద్రం కూడా ఇడి విచారణకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కాగా.. 70 శాసనసభ స్థానాలు ఉన్న



ఢిల్లీలో ఫిబ్రవరి 5న ఒకే విడతలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడికానున్నాయి.. ఈ క్రమంలోనే.. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసు విచారణకు కేంద్రం ఈడీకి అనుమతి ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. అయితే.. ఢిల్లీ లిక్కర్ కేసు సూత్రదారి, కింగ్‌పిన్ ఢిల్లీ మాజీ సీఎం కేజీవ్రాలే అంటూ ఆరోపణలు వచ్చాయి. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ 2021-22లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఈడీ కేసు నమోదు చేసింది.. ఈ కేసులో కేజ్రీవాల్ సహా పలువురిని ఈడీ అరెస్టు చేయడంతోపాటు విచారించింది.. కాగా.. 2024 మార్చి 21న కేజ్రీవాల్‌ను ఇఆ మనీలాండరింగ్ కేసులో అరెస్టు చేసింది. ఇదే కేసులో జూన్ 26న అఃఎ కూడా రంగంలోకి దిగి అవినీతి కేసులో అరెస్టు చేసింది. చివరికి సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు బెయిలిచ్చింది. ఈకేసులో మనీష్ సిసోడియా 17 నెలలపాటు జైల్లో ఉన్నారు. ఇప్పుడు తాజా ఈడీ విచారణకు అనుమతి నేపథ్యంలో.. ఢిల్లీ రాజకీయాలు ఉత్కంఠగా మారాయి. మనీలాండరింగ్ కేసులో మనీష్ సిసోడియాను కూడా ఇఆ ప్రాసిక్యూట్ చేయబోతోంది.

# దిగజారి మాట్లాడుతారని ఊహించలేదు

**ఎంపి ధర్మపురి వ్యాఖ్యలపై మంత్రి తుమ్మల అభ్యంతరం**

**బహిరంగ లేఖ రాసిన మంత్రి తుమ్మల**




**హైదరాబాద్,జనవరి15 :**
నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకటించిన సందర్భంగా తనపై ఎంపి అర్వింద్ చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తూ.. కేంద్రం సోమవారం కీలక నిర్ణయం తీసుకుంది. మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని స్థానిక బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం స్పందించారు. ఆ క్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్‌కు ఆయన బహిరంగ లేఖ రాశారు. నిజామాబాద్ రైతుల సుదీర్ఘ పోరాటం, చిరకాల నిరీక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డు ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగానే కాకుండా.. ఒక రైతుగా తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. ఈ సందర్భంగా.. పార్టీ, ప్రభుత్వంతో నిమిత్తం లేకుండా ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి తాను ధన్యవాదాలు తెలియజేశానని తెలిపారు. ఈ సందర్భంగా తన రాజకీయ జీవితం గురించి మీరు చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం... ఆక్షేపణీయంగా ఉన్నాయంటూ ఎంపీ దర్మపురి అరవింద్‌కు తెలియజేశారు. ఈ స్థాయికి దిగజారి మీరు మాట్లాడతారని తాను ఊహించలేదని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానం పట్ల అవగాహన రాహిత్యమో, సమాచార లోపమో తెలియదు కానీ మీ వ్యాఖ్యలు ఎంత మాత్రం ఆమోదయోగ్యం కానివని స్పష్టం చేశారు.

# లోకేశ్‌తో మంచు మనోజ్ భేటీ

**కాలేజీ గలాట తరవాత నారావారి పల్లికి చేరిక**

**తిరుపతి,జనవరి15 :**
ఏపీ మంత్రి నారా లోకేష్‌తో మంచు మనోజ్ భేటీ అయ్యారు. బుధవారం నారావారిప్లలెకు చేరుకున్న మనోజ్.. మంత్రి లోకేష్‌తో సమావేశం అయ్యారు. దాదాపు 45 నిమిషాల పాటు వీరి సమావేశం సాగింది. అయితే వీరి ఇద్దరి భేటీలో ఆస్తి వివాదం చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. తిరుపతిలో మోహన్‌బాబుకు చెందిన కళాశాల వద్ద నిన్న వందలాదిగా ఫ్లెక్సీలను మంచు మనోజ్ ఏర్పాటు చేశారు. అయితే ఈరోజు ఉదయానికల్లా వాటిని కొందరు బౌన్సర్లు తొలగించేశారు. మీడియాకు సమాచారం ఇచ్చి మరీ మంచు మనోజ్ కళాశాలకు వచ్చారు. కానీ మనోజ్ కళాశాలకు రాకుండా ఇప్పటికే కోర్టు నుంచి మోహన్ బాబు కుటుంబం ఇంజక్షన్ తీసుకుంది. దీంతో కాలేజ్‌కు వద్దకు వచ్చిన మనోజ్‌ను పోలీసులు అడ్డుకుని.. ఇంజక్షన్ ఆర్డర్ ఉన్న విషయాన్ని తెలియజేశారు. కాలేజ్‌కు సంబంధించి నాలుగు గేట్ల వద్దకు మనోజ్ చేరుకుని అక్కడి పోలీసులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. మనోజ్‌తో పాటు భార్య మౌనిక కూడా కాలేజ్‌కు వచ్చారు. ఆ వ్యవహారాన్ని మొత్తం వీడియో తీశారు మనోజ్ ప్రైవేట్ సెక్యూరిటీ. అనంతరం మోహన్ బాబు కళాశాల దగ్గర్లోనే నారావారిపల్లి ఉండటంతో.. కళాశాల వద్ద నుంచి నారావారిప్లలెకు వచ్చి 45 నిమిషాలు లోకేష్‌తో గడిపారు మనోజ్ దంపతులు. కళాశాల వద్ద చంద్రబాబుతో మోహన్ బాబు తీసుకున్న ఫోటోలు, నారా లోకేష్‌తో విష్ణు తీసుకున్న ఫోటోలని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో నారా కుటుంబంతో తన సన్నిహిత్యాన్ని తెలిపేందుకు లోకేష్‌ను మనోజ్ కలిసినట్లు తెలుస్తోంది. అయితే నారా లోకేష్‌తో గడిపినప్పటి ఎటువంటి ఆస్తుల వివాదం చర్చకు రానట్లు తెలుస్తోంది. ఆస్తులు వివాదం పూర్తిగా వ్యక్తిగతం అయిన నేపథ్యంలో ఏ వర్గం వైపు లేకుండా నారా కుటుంబం వ్యవహరిస్తున్నట్లు సమాచారం.





# టెకీ ప్రాణాలమీదకు తెచ్చిన చైనా మంజా

**సకాలంలో ఆస్పత్రికి తరలించడంతో తప్పిన ప్రాణాపాయం**

**హైదరాబాద్,జనవరి15 :**
గాలి పటాల పండుగ ఏమోకానీ.. చైనా మాంజా దారం ప్రాణాలు తీస్తోంది. గాల్లోకి ఎగిరిన గాలి పటాలు.. కిందకు దిగిన తర్వాత.. వాటికి ఉన్న చైనా దారాలు జనం గొంతులు కోస్తున్నాయి. నిన్నటికి నిన్న ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రాణాల మీదకు తెచ్చిన చైనా మాంజా.. ఇప్పుడు ఓ సాఫ్ట్ వేర్ ఉద్యోగి గొంతును కోశాయి. హైదరాబాద్ సిటీలో కుషాయిగూడ నాగార్జున కాలనీకి చెందిన 29 ఏళ్ల సాయి వర్ధన్ సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఇంటి నుంచి బైక్ పై ఆఫీసుకు బయలుదేరిన సాయివర్ధన్.. ఉప్పల్ మెట్రోస్టేషన్ దగ్గరకు రాగానే తన మెడకు చైనా మాంజా తగిలింది. బైక్ పై వెళు తుండటంతో.. మాంజా దెబ్బకు గొంతు కోసుకుపోయింది. ఆ వెంటనే కింద పడిపోయాడు. స్థానికులు వెంటనే గమనించి.. దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన డాక్టర్లు.. గొంతుకు కుట్లు వేశారు. పెద్ద ప్రమాదం తప్పిందని చెబుతున్నారు డాక్టర్లు. ఇంకొంచెం బలంగా మాంజా తగిలినా ప్రాణాలకే ముప్పు ఉండేదని స్పష్టం చేశారు. చైనా మాంజా అమ్మకాలపై నిషేదం ఉన్నా.. అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.. కొనుగోళ్లు తగ్గటం లేదు అనటానికి ఈ ఘటనే నిదర్శనం. ఇప్పటికే వందల సంఖ్యలో పోలీసులు కేసులు నమోదు చేసినా.. ప్రతిఏటా ఈ చైనా మాంజా పీడ మాత్రం పోవటం లేదు. చైనా మాంజా అమ్మకాలు సాగించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటేకానీ ఇలాంటి ప్రమాదాలకు ఫుల్ స్టాప్ పెట్టలేం.

# కేరళ విపత్తులపై సర్కార్ కీలక నిర్ణయం

**కేరళ, జనవరి 15 :**
కేరళలోని వయనాడ్‌లో గతేడాది సంభవించిన ఘోరవిపత్తు ఘటనపై పినరయి విజయన్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. కొండచరియలు విరిగిపడిన ఘటనలో గల్లంతైన వారిని మృతులుగా ప్రకటించాలని నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో విపత్తులో గల్లంతైన వారి కుటుంబ సభ్యులకు లబ్ధి చేకూరుతుందని, పరిహారం అందించేందుకు సహాయపడుతుందని అభిప్రాయపడింది. మిస్ అయిన వ్యక్తుల జాబితాను పరిశీలించేందుకు రెవెన్యూ శాఖ అధికారులతో సహా స్థానిక, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ఉత్తర్వులో పేర్కొంది. ఈ కమిటీ విపత్తులో తప్పిపోయిన వారి జాబితాను తయారు చేసి పరిశీలన కోసం జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీకి సమర్పిస్తుంది. డీడీఎమ్ఏ ఆ జాబితాను పరిశీలించి రాష్ట్ర స్థాయి కమిటీకి పంపితే.. అక్కడి నుంచి ఆ జాబితా ప్రభుత్వానికి చేరుతుంది. ఈ జాబితాలో పేర్లు ఉన్నవారిని ప్రభుత్వం మృతులుగా ప్రకటించి.. వారి బంధువులకు పరిహారం అందిస్తుంది. కాగా, గతేడాది జులై 30న వయనాడ్‌లో ఘోర ప్రకృతి విపత్తు సంభవించిన విషయం తెలిసిందే. భారీ వర్షాలు కురవడంతో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ దుర్ఘటనలో గ్రామాలకు గ్రామాలే తుడిచిపెట్టుకుపోయాయి. ఈ ఘటనలో సుమారు 263 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. మరో 35 మంది మిస్సయ్యారు.

# కెటిఆర్ క్వాష్ పిటిషన్‌పై తప్పుడు ప్రచారం

**కాంగ్రెస్ నేతల తీరుపై బిఆర్ఎస్ ఆగ్రహం**

**హైదరాబాద్,జనవరి15 :**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ నేతలు విష ప్రచారం చేస్తుందంటూ బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై జరిగిన విచారణపై కాంగ్రెస్ నేతలు, కొన్ని మీడియా సంస్థలు తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. క్వాష్ పిటిషన్‌పై ఈ దశలో జోక్యం చేసుకోవడం సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. సుప్రీం సూచన మేరకు వెంటనే కేటీఆర్ లీగల్ టీమ్ పిటిషన్‌ను విత్ డ్రా చేసుకుంది. అక్రమ కేసులను న్యాయబద్ధంగానే ఎదుర్కొంటామని కేటీఆర్ చెప్పారు. అందులో భాగంగానే సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. క్వాష్ పిటిషన్ వేసే నాటికి ఎఫ్ఐఆర్ దశలోనే ఫార్ములా ఈ కార్ కేసు ఉంది. సుప్రీంలో విచారణకు ముందే ఏసీబీ విచారణకు కేటీఆర్ సహకరించారు. సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా ఫార్ములా ఈ రేస్ కేసు విషయాలను న్యాయస్థానం దృష్టికి కేటీఆర్ లీగల్ టీమ్ తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు సూచన మేరకు కేటీఆర్ లాయర్లు పిటిషన్‌ను విత్ డ్రా చేసుకున్నారు. దీనిపై కాంగ్రెస్ నేతలు, గుంపు మీడియా తప్పుడు ప్రచారం చేస్తోంది. కేటీఆర్‌కు ఎదురుదెబ్బ అంటూ దిక్కుమాలిన వ్యాఖ్యానాలు చేస్తోంది. నేషనల్ హెరాల్డ్ కేసులో తమ అప్పీల్‌ను సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వెనక్కి తీసుకున్నారు. సోనియా, రాహుల్‌కు కూడా ఎదురుదెబ్బ తగిలినట్టేనా..? చరిత్రను కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకోవాలని బీఆర్ఎస్ నేతలు సూచించారు. కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ కాలేదు అని కేటీఆర్ అడ్వకేట్ మోహిత్ రావు స్పష్టం చేశారు. మా లీగల్ ఒపీనియర్ ప్రకారం కేసు విత్ డ్రా చేసుకున్నాం. ఈ కేసుకు సంబంధించి ఏ కోర్టులోనైనా అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. ఏసీబీ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నవి ప్రొసీజర్‌లోని ఇరెగ్యులారిటీకి సంబంధించిన అంశాలు. ఫార్ములా ఈ కార్ కేసు విషయమైన సుప్రీంకోర్టులో కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ ప్రసన్న వర్లే ధర్మాసనం విచారణ జరిపింది. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై ఆర్యమా సుందరం, సిద్ధార్థ దవేలు వాదనలు వినిపించారు.

ఈ కేసులో సెక్షన్ 13.1ఏ సీపీ యాక్ట్ వర్తించదని వాదనలు వినిపించాం అని మోహిత్ రావు పేర్కొన్నారు. క్వాష్ పిటిషన్‌ను విత్ డ్రా చేసుకోవడం వేరు.. కొట్టివేయడం వేరు : న్యాయవాది సోమ భరత్ ÷-రపంచం మొత్తంలో 9 నగరాల్లోనే ఫార్ములా ఈ రేసు జరుగుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌కు ఫార్ములా ఈ రేసును రప్పించి.. కేటీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. హైదరాబాద్ ప్రతిష్ట పెంచేందుకే ఫార్ములా ఈ రేసు నిర్వహించారు. రాజకీయ కక్షతోనే కేటీఆర్‌పై బూటకపు కేసు పెట్టారు. కేటీఆర్ ఎప్పుడూ విచారణను వ్యతిరేకించలేదు. న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందని కేటీఆర్ ఎప్పుడూ చెబుతుంటారు. ఫార్ములా కేసులో క్రిమినల్ ఆధారాలు లేవని కోర్టు నమ్మింది. క్వాష్ పిటిషన్ విత్ డ్రా చేసుకోవడం వేరు.. కొట్టివేయడం వేరు. అబద్దాలు, అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. సోనియా, రాహుల్‌లో నేషనల్ హెరాల్డ్ కేసు అప్పీల్‌ను విత్ డ్రా చేసుకున్న సందర్భం ఉంది. సుప్రీంకోర్టు చెప్పినందుకే కేటీఆర్ క్వాష్ పిటిషన్ విత్ డ్రా చేసుకున్నారు. మీడియా అనేది ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాలి. విచారణకు పూర్తిగా సహకరిస్తానని కేటీఆర్ చెప్పారని న్యాయవాది సోమ భరత్ తెలిపారు.

ది క్రైమ్ న్యూస్

cinema NEWS

# అక్కినేని విప్లవానికి 50 ఏళ్లు





తెలుగు సినీ పరిశ్రమ ఈ రోజు హైదరాబాద్‌లో ఎంత పెద్ద స్థాయిలో నిలబడుతోందో తెలిసిందే. ఇండియాలోనే అతి పెద్ద ఇండస్ట్రీల్లో ఒకటిగా టాలీవుడ్ ఎదిగింది. భాగ్య నగరంలో ఈ ఇండస్ట్రీ ఈ స్థాయికి చేరుకోవడంలో అక్కినేని నాగేశ్వరరావు పాత్ర అత్యంత కీలకం అనడంలో సందేహం లేదు. మద్రాసు నగరం మనకూ సొంతమైన సమయంలో అక్కడే మొదలైన తెలుగు సినీ పరిశ్రమ.. ఆ సిటీ తమిళనాడులో భాగం అయ్యాక కూడా అక్కడే కొనసాగుతున్న సమయంలో అక్కినేని వేసిన ముందడుగు.. మొత్తం కథను మార్చేసింది.

ఆయన కోసం నిర్మాతలు హైదరాబాద్ రావడం, ఇక్కడే చిత్రీకరణలు జరపడం.. ఆ తర్వాత ఇండస్ట్రీ మొత్తం నెమ్మదిగా హైదరాబాద్ వచ్చేయడం.. ఇదంతా ఒక చరిత్ర. హైదరాబాద్‌లో అడుగు పెట్టి కొండలు గుట్టలతో నిండిన బంజారా హిల్స్‌లో అన్నపూర్ణ స్టూడియో నిర్మాణానికి శ్రీకారం చుట్టి తెలుగు సినీ పరిశ్రమలో ఒక విప్లవానికి తెర తీసిన ఘనత ఏఎన్నార్‌కే చెందుతుంది.

ఈ విప్లవం మొదలై 50 ఏళ్లు పూర్తి కానుండడం విశేషం. అన్నపూర్ణ స్టూడియో 50వ వార్షికోత్సవంలోకి అడుగు పెడుతున్న వేళ.. అక్కినేని కుటుంబం ఏడాది పొడవునా సంబరాలకు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా నాగ్ ఒక ప్రత్యేకమైన వీడియోను అభిమానులతో పంచుకున్నారు. అన్నపూర్ణ స్టూడియోకు ఏఎన్నార్ ఎలా శ్రీకారం చుట్టింది.. దీని నిర్మాణం, ఎదుగుదల కోసం ఆయన ఎంత కష్టపడిందీ ఆయనీ వీడియోలో వివరించారు.

స్టూడియో అంటే తన తల్లిదండ్రులకు ఎంత ఇష్టమో.. ఇందులో ప్రతి ప్రదేశాన్నీ వాళ్లిద్దరూ ఎంతగా ప్రేమించేవారో నాగ్ చెప్పారు. అలాగే అన్నపూర్ణ సిబ్బందిలో ఎవ్వరినీ తాము ఉద్యోగులుగా చూడమని.. వాళ్లంతా ఫ్యామిలీ అని.. ప్రతి సంవత్సరం స్టూడియో మొదలైన సంక్రాంతి రోజు వారితో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేయడం ఏఎన్నార్‌కు అలవాటని.. తాము కూడా ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని నాగ్ వెల్లడించారు. ఈ బ్యూటిఫుల్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో అందరినీ ఆకట్టుకుంటోంది.

# ఫెస్టివల్ హిట్లు - భాగమైన బుల్లి స్టార్లు





పండక్కు రిలీజై హిట్టు కొట్టిన రెండు సినిమాల్లో చైల్డ్ ఎలిమెంట్ కీలక పాత్ర పోషించడాన్ని కొట్టిపారేయలేం. ముందుగా డాకు మహారాజ్ సంగతి చూస్తే శ్రద్ధ శ్రీనాథ్ కూతురిగా నటించిన పాప పేరు వేద అగర్వాల్. స్వస్థలం ఆగ్రా అయినప్పటికీ వీళ్ళ ఫ్యామిలీ హైదరాబాద్ లో స్థిరపడిందట. ఇంతకు ముందు వరుణ్ తేజ్ గాండీవధారి అర్జునలో చిన్న పాత్ర చేసింది. సన్నీడియోల్ జాత్ లోనూ ఉందట. బాలయ్యతో తన ఆన్ స్క్రీన్ బాండింగ్ ఎంత బాగా వచ్చిందో చూశాం. వయసు చిన్నదే అయినా పెర్ఫార్మన్స్ పరంగా వేద అగర్వాల్ ఎక్స్ ప్రెషన్లు, నటన ఫ్యామిలీ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇక సంక్రాంతికి వస్తున్నాంలో వెంకటేష్ కొడుకు బుల్లిరాజుగా నటించిన బుడ్డోడి పేరు రేవంత్ భీమల. బందరు లడ్డులా బొద్దుగా క్యూట్ గా ఉండే ఈ పిల్లాడు ఫస్ట్ హాఫ్ కొన్ని సీన్లలో దుమ్ము దులిపేశాడు. ముఖ్యంగా నాన్న మీద మాటల దాడి చేయడానికి వచ్చిన గ్రామస్థులను క్లాసు పీకే ఎపిసోడ్లో నవ్వని ఆడియన్స్ థియేటర్లో లేరంటే అతిశయోక్తి కాదు. ఇంకో సన్నివేశంతో తాత ఫ్రెండుకు ఇచ్చే కౌంటర్ కి ఘొల్లుమనని వాళ్ళు లేరు. ఇంకా ఇతని వివరాలు పూర్తిగా తెలియాల్సి ఉంది కానీ సినిమా చూసి బయటికి వచ్చిన వాళ్ళు ఖచ్చితంగా రేవంత్ గురించి మాట్లాడకు కోకుండా ఉండలేకపోతున్నారు. ఇలా ఇద్దరు బుల్లి స్టార్లు రెండు బ్లాక్ బస్టర్లలో భాగం కావడం కాకతాళీయమే అయినా చెప్పుకోదగ్గ విశేషమే. గేమ్ ఛేంజర్ లోనూ పిల్లల ట్రాక్ ఒకటి ఉంది కానీ దానికి తగినంత స్కోప్ లేకపోవడంతో దర్శకుడు శంకర్ ఫ్లాష్ బ్యాక్ లో దాన్ని మొక్కుబడిగా చూపించి అప్పన్నని హైలైట్ చేశారు. కలెక్షన్ల పరంగా సంక్రాంతికి వస్తున్నాం పూర్తిగా డామినే ట్ చేస్తుండగా రెండో స్థానంలో డాకు మహారాజ్ దూసుకెళ్లే పనిలో ఉన్నాడు. వసూళ్లు దేనికవే పోటా పోటీగా ఉన్నాయి. విజేత ఎవరు కాబోతున్నారనేది ప్రాథ మికంగా కనిపిస్తోంది కానీ ఫైనల్ స్టేటస్ అయ్యాకే రియ ల్ విన్నర్ ని ప్రకటించొచ్చు. చూడాలి ఎవరవుతారో.

# ఐశ్వర్యకు దక్కిన భాగ్యం.. వద్దన్న వాళ్లది దురదృష్టం !



సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో పెర్ఫార్మన్స్ పరంగా వెంకటేష్ తర్వాత ఎక్కువ స్కోప్ దొరికింది ఐశ్వర్య రాజేష్ కే. గ్లామర్ పరంగా మీనాక్షి చౌదరికి యూత్ ని ఆకర్షించే ఛాన్స్ ఉన్నప్పటికి నటనతో డామినేట్ చేసింది మాత్రం ఐశ్వర్య. వైవి రాజు భార్య భాగ్యంగా ఒకపక్క అమాయకత్వం, ఇంకోపక్క చదువులేని నిస్సహాయత, వీటిని మించి బావ అంటే విపరీతమైన ప్రేమ. ఇన్ని కలగలసిన పక్కా పదహారణాల తెలుగు సతీమణి పాత్రలో తన బెస్ట్ ఇచ్చేసింది. గోదారి గట్టు మీద పాటలో గొప్ప విజువల్స్ లేకపోయినా వెంకీ లేని ఫ్రేమ్స్ లో ఈ అమ్మాయి చేసిన డాన్స్ మాస్ జనాలను బాగా మెప్పించింది. నిజానికి భాగ్యంగా అనిల్ రావిపూడి మొదటి ఛాయస్ ఐశ్వర్య రాజేష్ కాదు. వేరే ఇద్దరు ముగ్గురిని అడిగాడు. కానీ నలుగురు చిన్న పిల్లల తల్లి అనేసరికి వాళ్ళు వెనుకడుగు వేశారు. కానీ కథ ప్రకారం హైలైట్ అయ్యేది బుల్లిరాజు ఒక్కడే అనే పాయింట్ గుర్తించలేకపోయారు. దీంతో వద్దనుకున్నారు. కట్ చేస్తే క్యారెక్టర్ లో ఎంత వెయిట్ ఉందో గుర్తించిన ఐశ్వర్య రాజేష్ ఆలోచించకుండా ఎస్ చెప్పేసింది.

వెంకటేష్ లాంటి సీనియర్ ఆర్టిస్ట్ అయినా సరే తనకు ఎంత స్కోప్ ఉందో పసిగట్టింది. కామెడీ పరంగానూ ప్రూవ్ చేసుకుంది. ఉదాహరణ చెప్పాలంటే పప్పా పాండేను రోడ్డు మీద తోసే ఎపిసోడ్ చాలు. ఇలా ఇతరులు తిరస్కరించిన విషయాన్ని ఐశ్వర్య రాజేష్ ఇటీవలే ఒక ఇంటర్వ్యూలో చెప్పింది. అయినా పిల్లల తల్లిగా నటించినంత మాత్రాన ఆఫర్లకు కొదవేమి ఉండదు. మహానటిలో కీర్తి సురేష్ ఏకంగా వయసు మళ్ళిన పాత్రలో జీవించింది. దాని తర్వాత మహేష్ బాబు, విక్రమ్, విజయ్ లాంటి స్టార్ల సరసన ఛాన్సులు వచ్చాయి. సౌందర్య సైతం గతంలో ఇలాంటి రిస్కులు చేసే స్టార్ ఆఫర్లు దక్కించుకున్నారు. ఐశ్వర్య రాజేష్ ఆ రేంజని చెప్పడం లేదు కానీ సరైన బ్రేక్ దొరికితే మంచి అవకాశాలు తలుపు తడతాయి. టాలీవుడ్ లో అలాంటి మలుపు కోసమే ఎదురు చూసిన తెలుగమ్మాయికి ఆ కోరిక నెరవేరింది.

## పాత సినిమా..దుమ్ము దులుపుతోంది



ఎప్పుడో 2012లో మొదలైన తమిళ సినిమా.. మద గజ రాజా. కొన్ని కారణాల వల్ల మేకింగ్‌లో ఆలస్యం జరిగి.. 2013 సంక్రాంతి సందర్భంగా రిలీజ్‌కు రెడీ అయింది. కానీ కొన్ని సమస్యలు తలెత్తి ఆ ఏడాది విడుదల కాలేదు. తర్వాత ఏం జరిగిందో ఏమో.. ఎంతకీ ఈ సినిమాకు మోక్షం కలగలేదు. ఇక ఎప్పటికీ విడుదల కాదు అనుకున్న ఈ సినిమాను అనూహ్యంగా ఈ సంక్రాంతికి రేసులోకి వచ్చింది.

ఐతే పుష్కర కాలం కిందట రిలీజ్ కావాల్సిన సినిమా.. ఇప్పుడు వస్తోందంటే సాధారణంగా ప్రేక్షకుల్లో ఆసక్తి అంతంతమాత్రంగానే ఉంటుంది. కానీ తమిళనాట మాత్రం 'మద గజ రాజా'కు అనూహ్యంగా బజ్ క్రియేట్ అయింది. అయినా సరే.. పొంగల్‌కు చాలా సినిమాలు పోటీలో ఉన్న నేపథ్యంలో బాక్సాఫీస్ దగ్గర ఈ చిత్రం ఏమాత్రం నిలబడుతుందో అనుకున్నారు. కానీ ఈ సినిమా పోటీని తట్టుకుంది. ఒక కొత్త సినిమా తరహాలోనే వసూళ్లు రాబడుతూ దూసుకెళ్తోంది.

తొలి రెండు రోజుల్లో 'మద గజ రాజా' రూ.10 కోట్ల మేర వసూళ్లు రాబట్టింది. మూడో రోజు వసూళ్లు ఇంకా పెరిగాయి. రూ.6 కోట్ల మేర కలెక్షన్లు వచ్చాయి. ఇలాంటి పాత సినిమాకు తొలి రెండు రోజుల కంటే మూడో రోజు ఎక్కువ వసూళ్లు రావడం అనూహ్యం. తమిళంలో సంక్రాంతికి అరడజనుకు పైగా సినిమాలు రిలీజయ్యాయి. దీని వల్ల థియేటర్ల సమస్య తప్పలేదు.

'మద గజ రాజా'కు ఉన్న టికెట్ల డిమాండుకు.. అందుబాటులో ఉన్న స్క్రీన్లు సరిపోవడం లేదని ట్రేడ్ వర్గాలు అంటుండడం విశేషం. స్క్రీన్లు పెంచాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. మరోవైపు ఈ చిత్రాన్ని యుఎస్‌లో రిలీజ్ చేయకపోవడం పట్ల అక్కడి ప్రేక్షకులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అక్కడా సినిమాను అందుబాటులోకి తేవాలంటున్నారు.

విశాల్, అంజలి, వరలక్ష్మి శరత్ కుమార్ ముఖ్య పాత్రల్లో సుందర్.సి ఈ చిత్రాన్ని రూపొందించాడు. సినిమా కథాకథనాలు రొటీన్ అయినప్పటికీ.. కామెడీకి, యాక్షన్ సన్నివేశాలకు, హీరోయిన్ల గ్లామర్‌కు ప్రేక్షకులు కనెక్ట్ అవుతున్నారు. ముఖ్యంగా కామెడీ వేషాలు వదిలేసి హీరో పాత్రలకు పరిమితం అయిన సంతానం.. ఇందులో తన మార్కు కామెడీతో అదరగొట్టడాడని అంటున్నారు. సంతానం కామెడీకి దూరం కావడం పెద్ద తప్పు అని ఈ చిత్రం రుజువు చేస్తోంది.

# కల్కి పార్ట్ 2 - 2026 లోనే రిలీజ్!



గత ఏడాది 'కల్కి: 2898 ఏడీ' సినిమా ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. 'బాహుబలి' తర్వాత ప్రభాస్‌కు అతి పెద్ద హిట్ ఇదే అయింది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ రూపొందించిన ఈ సైఫై ఫాంటసీ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా రూ.1100 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఈ సినిమా ఘనవిజయం సాధించడంతో 'కల్కి-2' మీద భారీగా అంచనాలు పెరిగాయి. ఐతే ఈ చిత్రం ఎప్పుడు మొదలవుతుంది.. ఎప్పుడు రిలీజవుతుంది అనే విషయాల్లో కొంత అయోమయం నెలకొంది. ప్రస్తుతం ప్రభాస్.. 'రాజా సాబ్', 'ఫౌజీ' సినిమాల్లో సమాంతరంగా నటిస్తున్నాడు. మరోవైపు 'స్పిరిట్' మూవీని వీలైనంత త్వరగా మొదలుపెట్టడానికి సందీప్ రెడ్డి వంగ చూస్తున్నాడు. ఇంకోవైపు 'సలార్-2' మూవీ టీం కూడా వెయిటింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో నిర్మాత అశ్వినీదత్ కీలక ప్రకటన చేశారు.'కల్కి-2' వచ్చే ఏడాదే విడుదలవుతుందని ఆయన స్పష్టం చేశారు. అంతే కాక పార్ట్-2లో ముఖ్య పాత్రల తీరు ఎలా ఉంటుందో కూడా చెప్పారు. 'కల్కి'లో తక్కువ స్క్రీన్ టైంకు పరిమితమైన కమల్ రెండో భాగంలో సినిమా అంతటా కనిపిస్తారని తెలిపారు. "కల్కి-2 వచ్చే ఏడాదే విడుదలవుతుంది. వీలైనంత త్వరగా షూటింగ్ మొదలుపెడతాం. రెండో భాగం అంతా కమల్ హాసనే ఉంటారు. ఆయనకు, ప్రభాస్‌కు మధ్య రసవత్తరమైన సన్నివేశాలు ఉంటాయి. అమితాబ్ బచ్చన్ పాత్ర కూడా పార్ట్-2లో కీలకంగా ఉంటుంది. ఈ ముగ్గురే సినిమాకు మెయిన్. దీపిక పాత్రకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. కథ ప్రకారం కొత్త పాత్రలు ఉండే అవకాశం తక్కువే" అని అశ్వినీదత్ తెలిపారు. ఇక దర్శకుడు, తన అల్లుడు నాగ్ అశ్విన్ గురించి దత్ మాట్లాడుతూ.. "మహానటి సినిమా చేస్తునన సమయంలోనే తన ప్రతిభ ఏంటో అర్థమైంది. అంత పెద్ద సినిమాను ఎలాంటి తడబాటు లేకుండా తీశాడు. అతడికి జీవితంలో ఓటమన్నదే ఉండదని అనుకుంటున్నా. తన ఆలోచన తీరు, సినిమాలు తీసే విధానం అంత గొప్పగా ఉంటాయి" అని దత్ అన్నారు.

## ఆ సినిమాను డిస్కౌంట్లో అయినా చూస్తారా?



క్వీన్, మణికర్ణిక లాంటి లేడీ ఓరియెంటెడ్ మూవీస్‌తో ఒక టైంలో బాలీవుడ్లో తిరుగులేని స్థాయిని అందుకుంది కంగనా. అప్పట్లో ఆమెకు సాటి వచ్చే కథానాయికే బాలీవుడ్లో కనిపించలేదు. కానీ సక్సెస్‌ను తలకెక్కించుకుని.. అనవసర వివాదాల్లో తలదూర్చి, అతిగా మాట్లాడ్డం ద్వారా క్రమంగా తన మీద ప్రేక్షకుల్లో వ్యతిరేకతను పెంచుకుంది కంగనా.దరాజకీయాల్లోకి వచ్చి ఎంపీ అయితే అయింది కానీ.. కథానాయికగా తన రేంజ్ మాత్రం పడిపోయింది. ఆమె సినిమాలకు కొన్నేళ్ల నుంచి మినిమం ఓపెనింగ్స్ కూడా ఉండట్లేదు. ధకడ్ అనే సినిమా మీద వంద కోట్ల బడ్జెట్ పెడితే వసూళ్లు ఐదు కోట్లు కూడా రాని పరిస్థితి. దీని తర్వాత కంగన నుంచి రావాల్సిన ప్రెస్టీజియస్ మూవీ 'ఎమర్జన్సీ' అయితే వాయిదాల మీద వాయిదాలు పడుతూ విడుదలకే నోచుకోలేదు. ఇక ఈ సినిమా రిలీజే కాదేమో అనుకున్న టైంలో కొత్త విడుదల తేదీ ఇచ్చారు. ఈ నెల 20న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఐతే సినిమాకు పెద్దగా బజ్ లేని నేపథ్యంలో ఎలాగైనా ఆడియన్స్ దృష్టిని ఆకర్షించేందుకు కంగనా అండ్ టీం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. టికెట్ల ధరలను బాగా తగ్గించి రూ.99కే సినిమా చూసే అవకాశం కల్పిస్తోంది. సింగిల్ స్క్రీన్, మల్టీప్లెక్స్ అని తేడా లేకుండా అన్ని చోట్లా ఒకే రేట్ పెట్టేశారు. ప్రీమియం మల్టీప్లెక్సులు కొన్ని మాత్రం రూ.112 రేటు పెట్టాయి. ముంబయి, ఢిల్లీ లాంటి నగరాల్లో ఈ రేటుతో సినిమా చూసే అవకాశం రావడం విశేషమే. మరి ఈ డిస్కౌంట్ రేట్లతో అయినా కంగనా సినిమాను ప్రేక్షకులు చూస్తారా అన్నది ఆసక్తికరం. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ నాటి పరిస్థితుల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. ఇందులో ఇందిరాగాంధీ పాత్రను పోషించడమే కాక.. స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రూపొందించింది కంగనా. ఐతే బీజేపీ వాళ్లు కొన్నేళ్ల నుంచి తెర వెనుక ఉండి తీయిస్తున్న ప్రాపగండా సినిమాల్లో ఒకటిగా దీన్ని ప్రేక్షకులు భావిస్తుండడం.. కంగనా మీద పెరిగిన వ్యతిరేకత వల్ల మినిమం బజ్ క్రియేట్ కాలేదు ఈ మూవీ మీద. మరోవైపు ఇందిరా గాంధీని బ్యాడ్ లైట్లో చూపించేలా ఉన్న ఈ సినిమాను కాంగ్రెస్ వాళ్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని బ్యాన్ చేయాలని కూడా చూస్తున్నారు.

Printed & Published Owned by, B.Srinivas,H No:6-3-439,Kishan Nagar,Karimnagar, Telangana,505001.Printed at Sri Balaji Printing Press.
H No. 4-4-55, Tilak Road, Karimnagar.(TS). RNI No: APTEL/2006/19056, Cell : 63055 84064, Mail: tarajyothi999@gmail.com